# ఇస్లాం అవగాహన

ఇస్లాం సూత్రాలు, విలువలు,
ఇస్లామీయ వారసత్వం గురించి సంక్షిప్త పరిచయం

ఎనలేని శుభాలవాడు ఈ (మంచిచెడులు వేరు చూపి చూపే) గీటురాయిని తన దాసునిపై (ముహమ్మద్ పై) అవతరింప జేశాడు. యావత్తు మానవాళికి హెచ్చరిక చేసేదిగా ఉండేటందుకు.

దివ్యఖుర్‌ఆన్ (25:1)

# ఇస్లామ్ అవగాహన

## ఇస్లాం సూత్రాలు, విలువలు, ఇస్లామీయ వారసత్వం గురించి సంక్షిప్త పరిచయం

**మూడవ ప్రచురణ: జమాదుస్సానీ 1440/ ఫిబ్రవరి 2019**

**కాపీరైట్**

మానవాళి ఇస్లామ్ ను అవగాహన చేసుకునేలా తోడ్పడే లక్ష్యంతో ఈ పుస్తకాన్ని ఏ భాషలో అయినా సరే ప్రచురించే అనుమతి ఇస్లామిక్ ఇన్ఫర్మేషన్ సెంటరు ఇస్తున్నది. అయితే, ఇందులో ఎలాంటి మార్పులు చేర్పులు చేయరాదు, ఇది వ్యాపారానికి ఉపయోగించరాదు.

**రచన & ప్రచురణ**

**ఇస్లామిక్ ఇన్ఫర్మేషన్ సెంటర్**
**సుల్తాన్ ఖబూస్ గ్రాండ్ మాస్క్,**
**మస్కత్ ఒమాన్ సల్తనత్**
**టెలీఫాక్స్. (968) 2450 5170**
**www.iicoman.om**



అనంత కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన
అల్లాహ్ పేరుతో

# విషయసూచిక


విభాగం | పుట

ముందుమాట ........................................................ ...........1

1. చరిత్రలో ఇస్లామ్......................................................... 2
2. ఇస్లామ్ అంటే అర్థం – ఇస్లామ్ ప్రాథమిక సూత్రాలు ................................. 8
3. సృష్టికర్త – అల్లాహ్ స్వభావం, గుణగణాలు ...................................... 19
4. ప్రవక్త ముహమ్మద్(స)– జీవితమూ, వ్యక్తిత్వము ...................................... 21
5. ప్రవక్త విశ్వసనీయత ......................................................... 24
6. దివ్యఖుర్ఆన్ చరిత్ర, సందేశం......................................................... 30
7. దివ్యఖుర్ఆన్ విశ్వసనీయత......................................................... 39
8. ప్రవక్త (స) సంప్రదాయాలు......................................................... 42
9. మరణానంతర జీవితం......................................................... 44
10. ఇతర మతాల పట్ల ఇస్లామ్ దృక్పథం......................................................... 49
11. ఇస్లామ్ లో ఏసుక్రీస్తు......................................................... 52
12. ఇస్లామ్ ఎందుకు? ఇతర మతాలు సత్యమెందుకు కాదు? ......................... 55
13. నాస్తికత్వము, సంశయవాదాల ఖండన......................................................... 57
14. ఇస్లామ్ లో మహిళల హోదా ......................................................... 61
15. మతతీవ్రవాదం-హింస......................................................... 62
16. ఇస్లామీయ జిహాద్ ......................................................... 64
17. ఇస్లామీయ షరిఅత్......................................................... 66
18. ఇస్లామ్ లో వివిధ పంథాలు ......................................................... 68
19. ఇస్లాంలో మౌలిక మానవహక్కులు ......................................................... 70
20. ఇస్లామ్ లో సాంస్కృతిక వైవిధ్యం......................................................... 74
21. మతం ఎందుకు ముఖ్యం?......................................................... 78
22. ఒకవ్యక్తి ముస్లింగా ఎలా మారతాడు?......................................................... 80

పదకోశం......................................................... 82

పాదసూచికలు......................................................... 84

రిఫరెన్సులు ......................................................... 88

# ముందుమాట

అల్లాహ్ మానవులను సృష్టించాడు. అల్లాహ్ తనను సేవించడానికి, ఆరాధించడానికి, తన ఆదేశాల ప్రకారం జీవించడానికి మానవాళిని సృష్టించాడు. ఇది అల్లాహ్ స్థాపించిన మతం. మనం అల్లాహ్ అభీష్టానికి విధేయత చూపడం, అరబీలో దీన్ని ఇస్లాం అంటారు. తన మతం గురించి తెలియజేయడానికి, రుజుమార్గం చూపించడానికి అల్లాహ్ ప్రవక్తలను నియమించాడు, మతగ్రంథాలను అవతరింపజేశాడు. కాబట్టి మానవులందరికీ ఈ మతం గురించి తెలుసుకునే హక్కు ఉంది. ఆ విధంగా మనుషులందరికీ మతానికి సంబంధించి పూర్తి అవగాహనతో ఎంచుకునే హక్కు అవకాశం ఉంటుంది. దురదృష్టవశాత్తు ప్రారంభ కాలం నుంచి ఇస్లామ్ ను విమర్శకులు వక్రీకరించి చూపించడమే జరిగింది. ఫలితంగా ఇస్లామ్ అపార్థాల పాలవుతూ వచ్చింది. ఆ విధంగా ఆధ్యాత్మిక సత్యాన్ని గ్రహించాలనుకునే వారికి ఈ విమర్శలు, అపార్థాలు అడ్డంకులయ్యాయి. పైగా, నేటి సోకాల్డ్ నిపుణులు చాలా మంది ఇస్లాం పేరుతో చెప్పే విషయాల్లోను పక్షపాతాలున్నాయి. వాస్తవానికి పాశ్చాత్య రచయితలు అత్యధికంగా రాసిన మతం ఇస్లామ్, అలాగే పాశ్చాత్య రచయితలు అత్యధికంగా వక్రీకరించి నెగిటివ్ గా రాసిన మతం కూడా ఇస్లామే. ఆ విధంగా ఇస్లమ్ గురించి గత దశాబ్దంగా అనేక రచనలు పుంఖానుపుంఖాలుగా వచ్చినప్పటికీ, సత్యంపై ఆధారపడిన విశ్వసనీయమైన రచనలు చాలా తక్కువ. భయాందోళనలు, అపోహలు, అనుమానాలు కాకుండా, పరస్పర అవగాహన పెంచడానికి ఉద్దేశించిన రచనలు కూడా చాలా తక్కువ.

ఈ గొప్ప మతం గురించి పరిచయం చేయడం ఈ పుస్తక లక్ష్యం. ఇస్లామ్ గురించి వక్రీకరణలు, అపోహలను తొలగించడం ద్వారా ఇస్లామ్ ను మానవులంతా సరయిన పద్ధతిలో అర్థం చేసుకోడానికి తోడ్పడడం. ఆవిధంగా మానవాళికి ఆధ్యాత్మికంగా రుజుమార్గాన్ని ఎంచుకోవడంలో సహాయపడడం. నిజానికి మతం అనేది వ్యక్తి సంస్కృతిపై ఆధారపడి ఉంటుంది. కాబట్టి కేవలం జ్ఞానం ద్వారా మాత్రమే మనిషి సత్యం ఎక్కడ ఉన్నదో గ్రహించగలడు.

# చరిత్రలో ఇస్లామ్

ఇస్లామ్ ఒక మతం, ఒక నాగరికత కూడాను. ఒక చారిత్రక వాస్తవం. మానవచరిత్రలో పద్నాలుగు వందల సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర ఇస్లామ్ కు ఉంది. అలాగే భౌగోళికంగా విశాల భూభాగాల్లో ఇస్లామ్ విస్తరించింది. దాదాపు అన్ని ఖండాల్లో ఇస్లామ్ ఉంది. ఇస్లామ్ ఒక ఆధ్యాత్మిక వాస్తవికత. నాగరికతలు, ముఖ్యంగా పాశ్చాత్య నాగరికత లోని కొన్ని అంశాల పురోభివృద్ధి వెనుక ఇస్లామ్ ప్రభావం ఉంది. ప్రపంచవ్యాప్తంగా అనేకమంది జీవితాల్లో అంతర్గతంగాను, బాహ్యంగాను గొప్ప పరివర్తనకు కారణమయ్యింది. నేడు ప్రపంచవ్యాప్తంగా రెండు బిలియన్లు, అంటే 200 కోట్ల మంది ముస్లిములున్నారు. అన్ని జాతుల్లోను, అన్ని సముదాయాల్లోను, సాంస్కృతిక నేపథ్యాలలోను ముస్లిములు కనిపిస్తారు. ప్రస్తుత ప్రపంచంలో ఇస్లామ్ ఒక పెద్ద మతం. పాశ్చాత్య దేశాల్లో, ఆసియా ఆఫ్రికా ఖండాల్లో ఇస్లాం ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. అందువల్లనే ఇస్లాం గురించిన జ్ఞానం చాలా ముఖ్యమైనది. మానవాళి గురించి ఆలోచించేవారికి, పాశ్చాత్య మేథో, సాంస్కృతిక చరిత్రపై ఆసక్తి ఉన్నవారికి, మతానికి సంబంధించిన వాస్తవికత, ఆధ్యాత్మికతల పట్ల శ్రద్ధ ఉన్నవారికి ఈ జ్ఞానం చాలా అవసరం.

ఉమ్మత్ లేదా సముదాయం అనే భావన గురించి అవగాహన లేకపోతే ఇస్లామ్ ను అర్థం చేసుకోలేము. ఉమ్మత్ అంటే ముస్లిములుగా పిలువబడే మొత్తం సముదాయం లేదా ఇస్లామీయ ప్రపంచం. ఇస్లామీయ ఉమ్మత్ ఒక్కటిగా భావించబడుతుంది. దివ్యఖుర్ఆన్ సందేశం పునాదిగా ఏర్పడిన సంఘీభావం ఇది. దైవం ఒక్కడే, ప్రవక్త ముహమ్మద్ (ఆయనపై శాంతి కలుగుగాక) చివరి దైవప్రవక్త అని విశ్వసించడం[1], దైవిక చట్టం అంటే షరిఅత్ ను ఆమోదించి స్వీకరించడం ద్వారా అంతా ఒక్క ఉమ్మత్ అయ్యారు. ముస్లిములందరూ బలమైన సోదరభావంతో సమైక్యంగా ఉంటారు. కొన్ని ముస్లిం సమాజాల్లో అనేక ఒడిదుడుకులు చోటు చేసుకున్నప్పటికీ, నేటికి కూడా ఈ అనుబంధం చాలా బలంగా ఉంది. ముస్లిములు రాజకీయంగా సమైక్యంగా లేకపోయినప్పటికీ, వారంతా ఒకే మతసముదాయం. ప్రపంచంలో ముస్లిము మతస్తులు లేని జాతి, తెగ ఏదీ లేదు. ప్రారంభం నుంచి ఇస్లాం పూర్తి మానవాళిని ఉద్దేశించి మాట్లాడుతుంది. అన్నివిధాల జాతితత్వాన్ని, విభేదాలను నిరసిస్తుంది. ప్రపంచంలోని అన్ని ఖండాలు, ఆసియా, ఆఫ్రికా, యూరప్, ఉత్తర, దక్షిణ అమెరికా, ఆస్ట్రేలియా, అన్ని ఖండాల్లోని అన్ని జాతుల ప్రజల్లోను ముస్లిములున్నారు.

ఇస్లామీయ సమాజాల చరిత్ర నుంచి ఇస్లామ్ చరిత్రను వేరు చేసి చూడలేము. ఇస్లామీయ

సమాజం, సంస్థలు, నాగరికతల్లో ఇస్లామీయ చరిత్ర ఉంది. ప్రవక్త మక్కా నగరం నుంచి మదీనా నగరానికి వలస వెళ్ళిన తర్వాత మదీనాలో మొదటి ఇస్లామీయ సమాజం ఏర్పాటయ్యింది. అప్పటి నుంచి ప్రవక్త స్వర్గస్తులయ్యేవరకు, ఆ తర్వాత నలుగురు సన్మార్గగాములైన ఖలీఫాల కాలం (622 సామాన్యశకం నుంచి 661 సా.శ.వరకు) ఇస్లామీయ చరిత్రలో ఒక విశిష్టమైన కాలం. ఆ తర్వాతి కాలాల్లోని ముస్లిములందరూ మార్గదర్శకత్వం కోసం ఈ కాలంలోని వారివైపు చూడడం కొనసాగుతోంది. అలాంటి ఆదర్శవంతమైన కాలం అది.

సన్మార్గగాములైన నలుగురు ఖలీఫాల తర్వాత వచ్చిన పాలకులు విశాల సామ్రాజ్యాన్ని స్థాపించారు. డెమస్కస్ రాజధాని నగరంగా ఈ సామ్రాజ్యం ఏర్పడింది. కాని సన్మార్గగాముల ఖిలాఫత్ ను వంశపారంపర్య రాజవంశంగా మారడం కూడా జరిగింది. అలా మొదటి ముస్లిం రాజవంశం ''ఉమయ్యా'' ఏర్పడింది. మధ్యాసియా నంచి స్పెయిన్, ఫ్రాన్సుల వరకు ఉమయ్యా పాలకులు సామ్రాజ్యాన్ని విస్తరించారు. సమాచారమార్పిడి, పరిపాలన, న్యాయ, సైనిక వ్యవస్థలు, సంస్థలు ఏర్పాటు చేశారు. ఈ వ్యవస్థలు, సంస్థలు ఆ తర్వాత అనేక శతాబ్దాలు కొనసాగాయి. తమ సామ్రాజ్యంలోని అనేక ప్రాంతాల్లో అనేక సంస్కరణలు ప్రవేశపెట్టారు. ప్రజాపరిపాలన, వాణిజ్యం, వ్యవసాయం, పోస్టల్



స్పెయిన్, గ్రెనడాలోని అల్ హంబ్రా ప్యాలేస్

సేవలు వంటి రంగాల్లో గొప్ప మార్పులు తెచ్చారు. ఉమయ్య ఖిలాఫత్ అత్యున్నత దశకు చేరుకున్న కాలంలో ముస్లిం ప్రపంచం అంతటా అరబీ భాషను సంధానభాషగా మార్చారు. సామ్రాజ్యమంతటా ఒకే కరెన్సీ ప్రవేశపెట్టారు. తమ స్వంత బంగారు, వెండి నాణేలు ప్రవేశపెట్టారు. డెమస్కస్ లో ఉమయ్యా మస్జిదు, జెరుసలేంలో డోమ్ ఆఫ్ ది రాక్ ఉమయ్యాలు నిర్మించిన ముఖ్యమైన వాస్తునిర్మాణాలు.

సామాన్యశకం 750లో ఉమయ్యా ఖిలాఫత్ పతనమైంది. అబ్బాసీ పాలకులు ఆ స్థానంలోకి వచ్చారు. కొత్తనగరం బగ్దాద్ రాజధానిగా చేసుకున్నారు. అబ్బాసీల కాలంలో ఇస్లామీయ నాగరికత అత్యున్నత స్థాయిని అందుకుంది. కళలు, విజ్ఞానశాస్త్రం, తత్వశాస్త్రాలను అబ్బాసీ ఖలీఫాలు ప్రోత్సహించారు. ఒక మేథోసంస్కృతిని అబ్బాసీలు నిర్మించారు. ప్రాచీన గ్రీసు, రోము సంస్కృతులను ఈ నాగరికత అధిగమించింది. కాలక్రమేణా బగ్దాదులో కేంద్రీకృత అధికారం బలహీనమయ్యింది. సరికొత్త అధికారకేంద్రాలు ఏర్పడ్డాయి. అలాగే అధ్యయన కేంద్రాలు కూడా ముస్లిం ప్రపంచంలో విభిన్న ప్రాంతాల్లో ఏర్పడ్డాయి. అధ్యయన సంస్థలు, పరిశోధనా సంస్థలు ఒకదానికి ఒకటి పోటీగా ఏర్పడ్డాయి. బగ్దాద్, డెమస్కస్, బుఖారా, కైరో, ఫెజ్, కార్డోబా, షిరాజ్ తదితర విద్యాకేంద్రాలకు ప్రపంచవ్యాప్తంగా విద్యార్థులు అధ్యయనానికి వచ్చేవారు. అల్ కింది, అల్ ఫరాబీ, ఇబ్నే సీనా, ఇబ్నె రుష్ద్, ఇబ్నుల్ హైతమ్, అల్ బిరూనీ, అల్ ఖ్వారిజ్మీ వంటి అనేకమంది బహుముఖ మేధావులు, శాస్త్రవేత్తలు వేగుచుక్కల్లా ప్రకాశించారు. అనేక కొత్త సిద్ధాంతాలు, ప్రతిపాదనలు, ఆవిష్కరణలతో ముందుకు వచ్చారు. తత్వశాస్త్రం, ఖగోళశాస్త్రం, వైద్యం, గణితం, విజ్ఞానశాస్త్రాల్లో అనేక పరిశోధనలు, అధ్యయనాలు ముస్లిం ప్రపంచంలో కొనసాగేవి. అధ్యయన భాషగా అరబీ కొనసాగేది. అప్పట్లో అరబీ భాష అంతర్జాతీయంగా శాస్త్రవిజ్ఞాన భాషగా ఉండేది. ఈ కాలంలోనే ఇస్లామీయ చట్టాల క్రోడీకరణ (షరిఅత్) పూర్తయ్యింది. ఈ పని ఉమయ్యాల కాలంలో ప్రారంభమయ్యింది. అబ్బాసీల కాలంలో పూర్తయ్యింది. నేడు స్థిరపడిన సాంప్రదాయిక ధార్మికపంథాలు (సున్నీ, షియా, ఇబాదీ) ఈ కాలంలోనే ఏర్పడ్డాయి. ఈ కాలంలోనే ప్రామాణికమైన, విశ్వసనీయమైన హదీసుగ్రంథాలు బుఖారీ, ముస్లిం మొదలైనవి సంకలనం చేయబడ్డాయి. తొమ్మిది, పది శతాబ్దాలలో బగ్దాద్, కార్డోబా నగరాలు ప్రపచంలోనే అత్యద్భుతమైన నగరాలు. అత్యున్నత నాగరికత వర్ధిల్లిన నగరాలు. ప్రపంచంలోని అనేకమంది మేధావులు, విద్యావేత్తలకు గొప్ప ఆకర్షణలుగా కొనసాగిన నగరాలు. ఫ్రాన్సు, ఇంగ్లాండు, ఇటలీ పాలకులకు ఎవరైనా సలహాదారుడు, సర్జన్, ఆర్కిటెక్ట్, చివరకు ఒక సంగీతకళాకారుడు కావలసి వచ్చినా, దర్జీ కావలసి వచ్చినా

వారు బగ్దాద్ లేదా కార్డోబా నగరాలను సంప్రదించేవారు. ముస్లిం నగరాల్లో భవనాలను, రాజప్రాసాదాలను రాళ్ళతో కట్టేవారు. రహదారుల్లో వీధిదీపాలు ఉండేవి. నీటి పారుదల సౌకర్యం ఉండేది. విశ్వవిద్యాలయాలు, లైబ్రరీలు, ఆసుపత్రులు, ఫార్మసీలు, కళాకేంద్రాలు, ప్రజాస్నానాగారాలు అన్నీ ఉండేవి. మధ్యయుగాల ముస్లిములు ఆధునిక వ్యక్తిగత పరిశుభ్రతా సాధనాలు వాడేవారు. అంటే సబ్బులు, కాస్మటిక్స్, సువాసన ద్రవ్యాలు ఉపయోగించేవారు. అబ్బాసీల కాలం ముస్లిం స్వర్ణయుగం. సైన్సు, కొత్త ఆవిష్కరణలు, అత్యున్నత జీవనప్రమాణాలు, ఆధునిక సమాజం ఇవన్నీ ఉండేవి.

క్రమేణా అబ్బాసీ ఖిలాఫత్ బలహీనమయ్యింది. చివరకు సామాన్యశకం 1517లో అబ్బాసీ ఖిలాఫత్ పతనమయ్యింది. అబ్బాసీల స్థానంలో ఉస్మానియా లేదా ఒట్టోమాన్ ఖిలాఫత్ వచ్చింది. సుల్తాన్ సులైమాన్ కాలంలో ఒట్టోమాన్ ఖిలాఫత్ అత్యున్నత దశకు చేరుకుంది. సుల్తాన్ సులైమాన్ ప్రాచీన బైజాంటైన్ అంటే నేటి ఇస్తాంబుల్ నుంచి పరిపాలించారు. ఆయన మరణించే నాటికి మొత్తం సిరియా, ఈజిప్టు, ఉత్తరాఫ్రికా, అరేబియా ద్వీపకల్పం, తూర్పు యూరపులోని అనేక ప్రాంతాలు ఆయన పరిపాలనలో ఉండేవి. ఒట్టోమాన్ సామ్రాజ్యం చాలా పెద్ద సామ్రాజ్యం. పరిపాలనకు అద్భుతమైన



**టర్కీ, ఇస్తాంబుల్ లోని సులైమాన్ మస్జిదు లోపలి భాగం**

బ్యూరోక్రసీని నిర్మించారు. అప్పటి కాలంలో ఇలాంటి పకడ్బందీ పాలనావిధానాలు మరెక్కడా లేవు. సామ్రాజ్యంలోని వివిధ సంస్కృతుల వారిపై ఒకే సంస్కృతిని సుల్తాన్ బలవంతంగా రుద్దలేదు. మతసహనానికి, బహుళత్వానికి విలువ ఇచ్చారు. విభిన్న సముదాయాలు, తమ సంస్కృతి, మతవిశ్వాసాలను పాటిస్తూ, శాంతియుతంగా కలిసి జీవించే వ్యవస్థను ఒట్టోమాన్ ప్రభువులు నిర్మించారు. ఒట్టోమాన్ సామ్రజ్యం ఆరు శతాబ్దాలు కొనసాగింది. పదిహేడవ శతాబ్దం నుంచి ఇరవయ్యో శతాబ్దం మధ్యకాలంలో యూరపు వలసలు విస్తరించాయి. ముస్లిమేతర వ్యాపారులు, మిషనరీలు, సైనికులు, వలసపాలకులు ముస్లిం భూభాగాలపై ప్రాబల్యం వహించారు. పోర్చుగీసు, స్పెయిన్, డచ్, బ్రిటీష్, ఫ్రెంచ్ వలస సామ్రాజ్యాలు పెరిగాయి. చైనా, రష్యాదేశాలు కూడా తమ ప్రాంతాలను ముస్లిం భూభాగాల్లోకి విస్తరించాయి. విదేశీ పెత్తనాన్ని చాలా మంది ముస్లిములు అవమానంగా భావించారు. అంతేకాదు, ఇస్లామీయ సమాజ పునాదులకు ఈ పరిణామాలు ప్రమాదకరమని భావించారు. ఎందుకంటే, సాంప్రదాయిక ముస్లిం విద్య, న్యాయ, పరిపాలనా సంస్థలన్నింటి స్థానంలో యూరపు పాలకులు పాశ్చాత్య సంస్థలను స్థాపించారు. ముస్లిం ప్రాంతాల్లోని మతవిలువలను యూరపు పాలకులు అణిచేసే ప్రయత్నం చేశారు. క్రయిస్తవ ప్రాబల్యం పెంచారు. సెక్యులర్, భౌతికవాద సంస్కృతికి పెద్దపీట వేశారు. ఇరవయ్యో శతాబ్దం ప్రారంభమైనప్పుడు ఒట్టోమాన్ సామ్రాజ్యం చాలా బలహీనమైపోయింది. మొదటి ప్రపంచయుద్ధంలో ఒట్టోమాన్ సామ్రాజ్యం ఓడిపోయి పూర్తిగా కనుమరుగై పోయింది. ఒట్టోమాన్ సామ్రాజ్యం కూలిపోయిన తర్వాత పాశ్చాత్య సెక్యులర్ నమూనా పునాదులపై ప్రస్తుత టర్కి రిపబ్లిక్ ఏర్పడింది. ఒట్టోమాన్ సామ్రాజ్యంలో భాగంగా ఉన్న వివిధ ప్రాంతాలు తర్వాత స్వతంత్రం ప్రకటించాయి.

ఆధునిక కాలంలో ముస్లిం సాంప్రదాయిక వ్యవస్థలపై వరుస దాడులు జరుగుతున్నప్పటికీ ముస్లిములు తమ లోకంలో తమ జీవితాలు గడుపుతున్నారు. నేడు ఇస్లాంను అర్థం చేసుకోవాలంటే ముందుగా అర్థం చేసుకోవలసింది, వివిధ మతాల పరిణామక్రమం ఒకే తీరున లేదన్న విషయాన్ని అవగాహన చేసుకోవాలి. క్రయిస్తవం విషయంలో పదహారవ శతాబ్దంలో సంస్కరణ ఉద్యమం వచ్చింది. ఫలితంగా ప్రొటెస్టెంటిజం వచ్చింది. యూదమతంలోను సంస్కరణలు వచ్చాయి. వాటితో పాటు శుద్ధయూద కన్సర్వేటివులు కూడా ఉన్నారు. కాని ఇస్లాంలో ఇలాంటి పరిణామాలు రాలేదు. ఇలాంటి పరిణామాలు వచ్చే అవకాశం కూడా లేదు. ధార్మిక శాసనాల పరంగా లేదా ఆధ్యాత్మికసిద్ధాంతాల పరంగా ఇలాంటి పరిణామాలు ఇస్లాంలో వచ్చే అవకాశాలు లేవు. ఇస్లాంలో సామాజిక

జీవనం, సామాజిక ఆలోచనలు అన్నీ సాంప్రదాయిక, ధార్మిక చట్రంలోనే చాలా వరకు కొనసాగుతుంటాయి. కొన్ని ముస్లిం భూభాగాల్లోని ఇస్లామీయ సమాజంలోని కొన్ని రంగాల్లో కనిపించే ఆధునికత, సోకాల్డ్ ఛాందసవాదం ఇవన్నీ కలిసి సాంప్రదాయిక ఇస్లామీయ జీవితాన్ని కొంతవరకు బలహీనపరిచాయన్నది నిజమే కాని, ఆధ్యాత్మికంగా, ధార్మిక నియమాల పరంగా ఎలాంటి మార్పులు చేయలేకపోయాయి. ప్రవక్త కాలంలో, నలుగురు సన్మార్గగాములైన ఖలీఫాల కాలంలో స్థిరపడిన సాంప్రదాయిక చట్రాన్ని మార్చలేకపోయాయి. ముస్లిముల్లో చాలా మంది అప్పటి కాలంలో పేర్కొన్న సాందప్రదాయిక పద్ధతులనే పాటిస్తున్నారు. ముస్లిముల జీవితాలు ఆ క్రమశిక్షణనే పాటిస్తున్నాయి. సాంప్రదాయిక ఇస్లామీయ విజ్ఞానశాస్రాలు, అంటే ఖుర్ఆన్, హదీస్, షరీఅత్ మొదలైనవి శతాబ్ధాల క్రితం ఎలా ప్రాముఖంగా ఉండేవో నేడు కూడా అంతే ప్రాముఖ్యం కలిగి ఉన్నాయి. సాంప్రదాయిక ఇస్లామీయ విద్యావ్యవస్థ, న్యాయవ్యవస్థలు పూర్తిగా పతనమైనప్పటికీ సాంప్రదాయిక ఇస్లామీయ విజ్ఞానశాస్త్రాలకు ముస్లిముల జీవితాల్లో ప్రాముఖ్యం తగ్గలేదు.



''ప్రప్రథమంగా మానవుల కొరకు నిర్మించబడిన ఆరాధనా గృహం నిస్సందేహంగా మక్కాలో ఉన్నదే.'' (దివ్యఖుర్ఆన్ 3:96)

# ఇస్లామ్ భావార్థాలు, నియమాలు

ఇస్లామ్ మతం అంటే ఏమిటంటే, సృష్టికర్త, అల్లాహ్ మాత్రమే ఒకే ఒక్క దేవుడనే మతవిశ్వాసం. ఆ ఒకే ఒక్క దైవం అల్లాహ్ తన చివరి ప్రవక్త ముహమ్మద్ (ఆయనపై శాంతి కురియుగాక) ద్వారా తెలియజేసిన అల్లాహ్ అభీష్టానికి పూర్తి విధేయత చూపించడం ఇస్లాం

ఇస్లాం అంటే స్వచ్ఛందంగా, నిజాయితీగా, శాంతియుతంగా అల్లాహ్ అభీష్టానికి విధేయత చూపడం అని అర్థం. అల్లాహ్ అభీష్టానికి విధేయత చూపించడమంటే, అల్లాహ్ పట్ల భక్తిభావంతో, ధర్మపరాయణత్వంతో, నిబద్ధతతో ఉండాలి. మనిషి దేవునితోనే కాదు, తనతో తాను, ఇతర ప్రాణులతో, పర్యావరణంతో శాంతియుతంగా ఉండే షరతులివి. దైవాన్ని విశ్వసించి, దైవాబిష్టానికి పూర్తి విధేయత చూపేవారిని ముస్లిములని పిలుస్తారు.

ఇస్లాం కొత్త ధర్మమేమీ కాదు. దైవం పంపిన ప్రవక్తలందరికీ ఇచ్చిన ధర్మం ఇదే. ఆదం నుంచి నూహ్, అబ్రహం, ఇస్మాయీల్, ఇస్సాక్, మూసా, ఏసు చివరకు ప్రవక్త ముహమ్మద్ (ప్రవక్తలందరిపై అల్లాహ్ శాంతి కురియుగాక), అందరికీ అల్లాహ్ ఇచ్చి పంపిన ధర్మం ఒక్కటే. ఈ ప్రవక్తలు అందరూ ముస్లిములు. ఎందుకంటే ఈప్రవక్తలందరూ కేవలం అల్లాహ్ ను మాత్రమే ఆరాధించారు. కేవలం ఆయన అభిష్టానికి మాత్రమే విధేయత చూపించారు[2]. అదేవిధంగా, ప్రవక్తలు తీసుకువచ్చిన ధర్మాన్ని పాటించిన వారంతా ముస్లిములుగా పిలవబడతారు. ఇస్లామ్ అనే పదానికి ఉన్న ఈ విస్తృతభావం కారణంగానే అల్లాహ్ దివ్యకుర్ఆన్ లో ఇలా ప్రకటించారు.

> *"అల్లాహ్ దృష్టిలో అసలు ధర్మం కేవలం ఆయన అభీష్టానికి విధేయత చూపడం (ఇస్లామ్) మాత్రమే" (దివ్యఖుర్ఆన్ 3:19)*

ఇస్లామ్ మతవిశ్వాసం ఆరు విశ్వాస (ఇమాన్) నియమాలపై ఆధారపడి ఉంది. అలాగే ఐదు ధార్మిక(ఇస్లామ్) నియమాలపై ఆధారపడి ఉంది. ఇమాన్ లేదా ధార్మికవిశ్వాసం అంటే మనిషి మనస్సులో నమ్మేది. మతం అనేది ఆచరణలో ఆ విశ్వాసాన్ని అమలు చేయడం. మతానికి విశ్వాసం అనేది తప్పనిసరి ముందస్తు అవసరం. ఎందుకంటే ధార్మిక విశ్వాసం ద్వారా మాత్రమే సృష్టికర్త, ఆయన దైవత్వం, ప్రభుత్వం, విధేయతను పొందే హక్కు అధికారాలు గుర్తింపబడతాయి. అరబీ భాషలో వీటిని ఉలుహియ్యా, రుబుబియ్యా, ఉబుదియ్యా అంటారు.

# విశ్వాసానికి సంబంధించిన ఆరు నియమాలు

విశ్వాసానికి సంబంధించిన నియమాలు దివ్యఖుర్ఆన్ లోని వివిధ వాక్యాల్లో ఉన్నాయి[3]. ఉదాహరణకు, మొదటి నియమం దివ్యఖుర్ఆన్ 112వ అధ్యాయంలో అల్లాహ్ ఇలా పేర్కొన్నారు.

بِسْمِ اللَّهِ الرَّحْمَٰنِ الرَّحِيمِ

قُلْ هُوَ اللَّهُ أَحَدٌ * اللَّهُ الصَّمَدُ * لَمْ يَلِدْ وَلَمْ يُولَدْ *
وَلَمْ يَكُن لَّهُ كُفُوًا أَحَدٌ

*అనంతకరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో*

*చెప్పు: ఆయన అల్లాహ్, అద్వితీయుడు. అల్లాహ్ నిరపేక్షా పరుడు ఎవరి ఆధారమూ, ఎవరి అక్కరా లేనివాడు అందరూ ఆయనపై ఆధారపడేవారే. ఆయనకు సంతానం ఎవరూ లేరు. ఆయన కూడ ఎవరి సంతానమూ కాదు. ఆయనకు సరిసమానులు ఎవరూ లేరు.*

## మొదటి నియమం:

అల్లాహ్ తప్ప ఆరాధనలకు అర్హత కలిగిన ఆరాధ్యుడు మరెవ్వడూ లేడనే విశ్వాసం. అల్లాహ్, ఆయనే విశ్వానికి సృష్టికర్త, ఆయన ఒకే ఒక్కడు. ఆయన గుణగణాలు సాటిలేనివి. ఎవరికీ పంచలేనివి. ఆయనకు భాగస్వాములను నిలబెట్టడం సాధ్యం కాదు. విశ్వాసానికి సంబంధించిన ఈ నియమాన్ని ఏకదైవారాధన అంటారు (అత్తౌహీద్ అంటారు అరబీలో).

***విశ్వాసానికి సంబంధించిన ఈ నియమం ప్రాముఖ్యత :*** (1) సృష్టికర్త ఒక్కడే అనే విశ్వాసం సృష్టి వెనుక ఒకే ఉద్దేశ్యం ఉందని సూచిస్తుంది. అంటే మతం కూడా ఒక్కటే అని సూచిస్తుంది. అంటే ఒకే జీవనవిధానం. చాలా మంది ప్రపంచంలో ఆధ్యాత్మిక నిరాశలో జీవిస్తున్నారు. కారణమేమంటే జీవితంలో ఒక లక్ష్యం ఉందనే గ్రహింపు లేకపోవడం వల్ల. (2) దైవం గుణగణాలను ఇతరులకు ఆపాదించడం వల్ల మూఢనమ్మకాలు వ్యాపిస్తాయి. వాటి వల్ల భయం, అవినీతి, దౌర్జన్యం, దోపిడి పెరుగుతాయి.

## రెండవ నియమం :

దైవదూతల పట్ల విశ్వాసం. దైవదూతలు అల్లాహ్ కు ఆధ్యాత్మిక సేవకులు. మనుషుల మాదిరిగా కాదు, వారు ఆత్మలు మాత్రమే, వారికి భౌతిక కాయము ఉండదు. అల్లాహ్ ను నిరంతరం ఆరాధించడం, అల్లాహ్ ఆదేశాలను అమలు చేయడం మాత్రమే వారి స్వభావం.

***ఈ విశ్వాస నియమం ప్రాముఖ్యత :*** మనిషి తన ఇంద్రియజ్ఞానంతో తెలుసుకోలేని, చూడలేని వాటిని విశ్వసించడం ధార్మికవిశ్వాసానికి చాలా అవసరం. సృష్టి అనేది మన భౌతికఇంద్రియజ్ఞానాన్ని మించినది. విశ్వాసవచనం మనిషి మేధో సామర్థ్యాన్ని మరింత పెంచుతుంది. భౌతికంగా ఇంద్రియజ్ఞానంతో గ్రహించే పరిధులను దాటి అధ్యాత్మిక అవగాహన, అంతర్ దృష్టిని పెంపొందిస్తుంది.

## మూడవ నియమం :

అల్లాహ్ ప్రవక్తలుగా అవతరిచిన వారికి అందజేయబడిన సమస్త దైవగ్రంథాలను, దైవిక శాసనాలను విశ్వసించడం. ఉదాహరణకు దావూద్ ప్రవక్తకు అల్లాహ్ జబూర్ గ్రంథాన్ని ప్రసాదించారు. మూసా ప్రవక్తకు తౌరాత్ గ్రంథాన్ని ప్రసాదించారు. ఏసు ప్రవక్తకు ఇంజీల్ లేదా బైబిలు గ్రంథాన్ని ప్రసాదించారు. చిట్టచివరకు దివ్యఖుర్ఆన్ గ్రంథాన్ని ప్రవక్త ముహమ్మద్ (ప్రవక్తలందరిపై అల్లాహ్ శాంతి కురియుగాక)కు ప్రసాదించారు.

***ఈ విశ్వాస నియమం ప్రాముఖ్యత :*** అన్ని ధార్మికగ్రంథాలు ఒకే సృష్టికర్త నుంచి వచ్చాయి. అన్నింటిలోను మౌలికంగా విశ్వాసానికి సంబంధించి ఒకేమాదిరి సూత్రాలున్నాయి. విలువలున్నాయి. కాబట్టి ఒకధార్మికగ్రంథాన్ని స్వీకరించి మరోదాన్ని తిరస్కరించడంలో అర్థం లేదు. అలాగే సృష్టికర్త మానవాళికి విభిన్నమైన, పరస్పర విరుద్ధమైన సందేశాలు పంపించారని భావించడం కూడా అర్థరహితం. దివ్యఖుర్ఆన్ ఇంతకు ముందు అవతరించిన గ్రంథాలను ధృవీకరిస్తుంది. మానవాళికి దైవసందేశాన్ని దివ్యఖుర్ఆన్ పరిపూర్ణం చేస్తుంది. గత కాలంలోని ప్రవక్తలు తీసుకొచ్చిన దైవసందేశాల్లో కాలక్రమేణా చోటు చేసుకున్న మార్పులను సరిదిద్దుతుంది.

## నాల్గవ నియమం :

అల్లాహ్ ప్రవక్తలందరినీ విశ్వసించడం, అంటే ఆదమ్ నుంచి చిట్టచివరి ప్రవక్త ముహమ్మద్ (వారందరిపై అల్లాహ్ శాంతి కురియుగాక) వరకు అందరినీ విశ్వసించడం.

***ఈ విశ్వాస నియమం ప్రాముఖ్యత :*** ప్రవక్తలందరూ ఒకే సృష్టికర్త నుంచి వచ్చారు. మానవాళికి ఒకే మౌలికమైన సందేశాన్ని ఇచ్చారు. కాబట్టి ఒక దైవప్రవక్తను ఒప్పుకుని మరొకరిని తిరస్కరించడం అర్థరహితం. ఇలా చేయడం వల్ల దైవధర్మంలో విభేదాలు సృష్టించడమే అవుతుంది.

## ఐదవ నియమం :

తీర్పుదినంపై విశ్వాసం. దైవదూతల మాదిరి కాకుండా మనుషులకు స్వేచ్ఛను దైవం ప్రసాదించాడు. అల్లాహ్ ఆదేశాలను స్వీకరించే లేదా తిరస్కరించే స్వేచ్ఛ మనిషికి ఉంది. అయితే ఈ స్వేచ్ఛతో పాటు దేవుని ముందు జవాబు చెప్పుకోవలసిన బాధ్యత కూడా ఉంది. తీర్పుదినం రోజున మనం ఈ జీవితంలో ఏ మార్గం అనుసరించామో దానికి జవాబు చెప్పుకోవలసి ఉంటుంది. సరయిన మార్గాన్ననుసరించి, అల్లాహ్ సందేశాన్ని స్వీకరించినవారు స్వర్గానికి వెళతారు. అక్కడ శాశ్వతంగా ఉంటారు. తప్పు నిర్ణయాలు తీసుకుని అల్లాహ్ సందేశాన్ని తిరస్కరించిన వారు నరకానికి వెళతారు. అక్కడ శాశ్వతంగా ఉంటారు.

***ఈ విశ్వాస నియమం ప్రాముఖ్యత :*** ఈ నియమం దేవుని ముందు జవాబుదారితనాన్ని నిర్దేశిస్తుంది. ఈ ప్రపంచంలో మనం చేసిన పనులకు జవాబు చెప్పుకోవాలి. నిజమైన న్యాయం కోసం మన అభిలాష, శాశ్వత సంతృప్తి అప్పుడే లభిస్తాయి. తీర్పుదినాన నిజమైన దైవికన్యాయం స్థాపించబడినప్పుడు లభిస్తాయి.

## ఆరవ నియమం :

విధిని విశ్వసించడం. సృష్టిలో జరిగే సమస్తం, మంచి, చెడు ఏదైనా సరే దైవిక శాసనాలకు, విలువలకు అనుగుణంగా మాత్రమే జరుగుతుంది. అరబీలో దీన్న ఖాదా వ ఖాదర్ అంటారు. ఇవన్నీ ముందస్తు నిర్ణయాల ప్రకారమే జరుగుతాయి. అల్లాహ్ అపరిమిత జ్ఞానసంపన్నుడు. సృష్టిలో ఏది కూడ అల్లాహ్ పట్టుకు ఆవల లేదు. ఆయన ఈ చట్టాల ద్వారా అన్నింటిని అదుపు చేస్తున్నారు. ఈ చట్టాలు భౌతికమైనవి, ఆధ్యాత్మికమైనవి. ఆయన నిర్దేశించిన విలువలు, చట్టాల ప్రకారమే జరుగుతాయి. అంతేకాదు, అల్లాహ్ తన చట్టాలు, విలువల ద్వారా పూర్తి అదుపు కలిగి ఉండడమే కాదు, ఆయనకు అన్నింటి గురించి సంపూర్ణమైన జ్ఞానం ఉంది. అన్నీ అంటే కాలం, స్థలం అన్నింటిపైన అధికారం ఉంది. గతంలో జరిగిన, వర్తమానంలో జరుగుతున్న, భవిష్యత్తులో జరగబోయే అన్నింటిని ఆయన రికార్డు చేసి ఉంచారు. దివ్యఖుర్ఆన్ (6:59)లో ఇలా చెప్పడం జరిగింది :

*అగోచరాల తాళం చెవులు ఆయన వద్దనే ఉన్నాయి. వాటిని ఆయన తప్ప ఎవరూ ఎరుగరు. భూమిలోనూ, సముద్రంలోనూ ఉన్నదంతా ఆయనకు తెలుసు. చెట్టునుండి ఏ ఆకైనా ఆయనకు తెలియకుండా రాలదు. భూమిలోని చీకటి పొరలలో ఉన్న ఏ గింజైనా ఆయనకు తెలియకుండా లేదు. తడిగా ఉన్నదీ, పొడిగా ఉన్నదీ అంతా ఒక విపులమైన గ్రంథంలో వ్రాయబడి ఉంది.*

అల్లాహ్ జ్ఞానం సంపూర్ణమైనది. అందులో మానవజీవితానికి సంబంధించిన ఆటుపోటులన్నీ ఉన్నాయి. అయితే ఇక్కడ అర్థం చేసుకోవలసిన ముఖ్యమైన విషయం ఏమిటంటే, మనిషి భవిష్యత్తులో ఏం చేయబోతున్నాడో అల్లాహ్ కు తెలుసు, ఈ జ్ఞానం అల్లాహ్ కు ఉంది, అంతమాత్రాన అల్లాహ్ ఆ మనిషి ఆ పనులు చేసేలా అల్లాహ్ నిర్బంధించాడని అర్థం కాదు. అలాగే ఖచ్చితంగా చేస్తాడన్నది అల్లాహ్ మహాజ్ఞానవంతుడు కాబట్టి ఆయనకు తెలుసు. ఒక ఉదాహరణ ద్వారా దీన్ని అర్థం చేసుకోవచ్చు. ఖగోళశాస్త్రవేత్తలు సూర్యగ్రహణం ఎప్పుడు వస్తుందో ముందే లెక్కలు వేసి చాలా సంవత్సరాల ముందే చెప్పేస్తారు. వారికి ఉన్న వైజ్ఞానిక జ్ఞానం వల్ల చెప్పగలుగుతారు. వాళ్ళు చెప్పారు కాబట్టి సూర్యగ్రహణం రాదు. అదేవిధంగా అల్లాహ్ అపరిమిత జ్ఞానసంపన్నుడు. ఆయన జ్ఞానసంపద స్థలకాలాల పరిమితులకు అతీతమైనది. కాబట్టి ఆయనకు మనుషులు ఎప్పుడు ఏం చేస్తారన్నది ముందే తెలుసు. అంతే తప్ప ఆయన ఆయా పనులు చేసేలా మనుషులను నిర్బంధించడం జరగదు.

కాబట్టి, పై నియమాల వల్ల మనిషికి ఇవ్వబడిన ఎంపిక స్వేచ్ఛను తగ్గించడం జరగలేదు. క్లుప్తంగా చెప్పాలంటే, (1) మనిషి తీసుకునే నిర్ణయాలు, ఎంపికలన్నీ అల్లాహ్ చట్టాలకు అనుగుణంగానే ఉంటాయి. (2) మనిషి తీసుకున్న నిర్ణయాల ఫలితాలు దైవిక నిర్దేశాల ప్రకారమే ఉంటాయి. (3) మనిషి తీసుకునే నిర్ణయాలు, ఆచరణలు, ఎంపికల గురించి పూర్తి జ్ఞానం అల్లాహ్ వద్ద ఉంది. తన నిర్ణయాలకు, ఆచరణలకు మనిషి బాధ్యత వహించక తప్పదు[4]. అంతేకాదు, మనుషులకు స్వేచ్ఛ ఉంది. తమ స్వేచ్ఛలకు, తమ ఆచరణలకు వారే బాధ్యులు. అయితే మనుషులకు తమ కోసం కొత్త ఎంపికలు తయారు చేసుకునే శక్తి లేదు.

*"అల్లాహ్ యే మిమ్మల్ని సృష్టించాడు, మీరు చేసేవాటన్నింటిని సృష్టించాడు" (దివ్యఖుర్ఆన్ 37:96)*

అంటే, మనిషికి ఉన్న స్వేచ్ఛ అనేది ఒక దైవాభీష్టానికి లేదా మానవ ఆచరణలకు సంబంధించి దైవిక సృష్టి సరళి చట్రంలోనే ఉంటుంది. మరోవిధంగా చెప్పాలంటే, మనిషి

కొన్ని పనులు చేయాలనుకుంటాడు, దైవం తలిస్తే ఆ పనులు జరిగేలా చేస్తాడు. ఈ విధంగా మనిషి అభీష్టం అనేది దైవాభీష్టం పరిమితులకు లోబడి ఉంటుంది. కాబట్టి మంచి, చెడు రెండింటికి సంబంధించి సృష్టి అనేది అల్లాహ్ చేసినదే. అయితే, ఇందులో చెడు అనేది మనిషి ఎంపికల పర్యావసనంగా సృష్టించబడింది. అంటే, మనిషి తనకు ఇవ్వబడిన స్వేచ్ఛను ఉపయోగించకపోవడం లేదా దురుపయోగించడం వల్ల తలెత్తిన పర్యావసానం. ఆచరణలు, వాటి పర్యావసానాలు రెండింటిని అల్లాహ్ మాత్రమే సృష్టిస్తాడు.

> ***"మనిషీ! నీకు ఏ మేలు కలిగినా అల్లాహ్ కరుణవల్లనే కలుగుతుంది. నీకు ఏ కీడు కలిగినా అది నీవు స్వయంగా సంపాదించుకున్న దాని ఫలితమే..." (దివ్యఖుర్‌ఆన్ 4 : 79)***

అల్లాహ్ దృష్టికోణం ప్రకారం, చెడును సృష్టించడం లేదా చెడు జరిగేలా అనుమతించడం అనేది దానికదే చెడు కాదు, చెడును ఎంచుకోవడం స్వయంగా ఒక చెడు, దైవం చెడును ఎంచుకోలేదు, మనుషులు ఆ పని చేస్తున్నారు.

**ఈ నియమ ప్రాముఖ్యత :** సృష్టికర్త ఈ యావత్తు సృష్టిని సంపూర్ణంగా అదుపు చేస్తున్నాడని, పరిపాలిస్తున్నాడని విశ్వసించడం, సృష్టిపై అల్లాహ్ విశ్వసామ్రాజ్యాధికారాన్ని మనం స్వీకరించడాన్ని అల్లాహ్ గుర్తిస్తాడు. అల్లాహ్ తన కరుణ, దయాగుణాలతో, సృష్టి పట్ల తన వాత్సల్యంతో వ్యవహరిస్తాడు. ఈ నియమం మనిషిలో ఆశను, అంతరంగిక శాంతిని, మనోబలాన్ని పెంచుతుంది.

***ధార్మిక విశ్వాసానికి సబంధించిన ఈ ఆరు నియమాలు మనిషి ఆధ్యాత్మిక అవగాహన పెంచుకునేలా, మనిషిలో లోచూపు పెరిగేలా మనిషి మేధోశక్తిని తీర్చిదిద్దుతాయి. అంతేకాదు, ఒక విశ్వాసిని ఈ నియమాలుసంపూర్ణంగా నిర్వచిస్తాయి. ఈ నియమాల్లో దేన్ని వదిలేసినా, ఉదాహరణకు ఒక ప్రవక్తను విశ్వసించి ఇతరులను తిరస్కరించడం వంటివి చేస్తే అతను అవిశ్వాసి అవుతాడు.***

# నమాజుకు పిలుపు అజాన్

అల్లాహ్ మహోన్నతుడు, అల్లాహ్
మహోన్నతుడు,

అల్లాహ్ మహోన్నతుడు, అల్లాహ్
మహోన్నతుడు,

అల్లాహ్ తప్ప ఆరాధనకు అర్హుడు మరెవరు
లేరని నేను సాక్ష్యమిస్తున్నాను,

అల్లాహ్ తప్ప ఆరాధనకు అర్హుడు మరెవరు
లేరని నేను సాక్ష్యమిస్తున్నాను,

ముహమ్మద్ అల్లాహ్ ప్రవక్త అని నేను
సాక్ష్యమిస్తున్నాను,

ముహమ్మద్ అల్లాహ్ ప్రవక్త అని నేను
సాక్ష్యమిస్తున్నాను,

ప్రార్థనకు రండి, ప్రార్థనకు రండి,

సాఫల్యం వైపునకు రండి, సాఫల్యం
వైపునకు రండి,

అల్లాహ్ మహోన్నతుడు, అల్లాహ్
మహోన్నతుడు

అల్లాహ్ తప్ప ఆరాధనకు అర్హుడు మరెవరు
లేరని నేను సాక్ష్యమిస్తున్నాను

నమాజు లేదా ప్రార్థనలకు ఇచ్చే ఈ పిలుపు ప్రజలను శాశ్వత సాఫల్యం దిశగా ఆహ్వానిస్తుంది. అల్లాహ్ తప్ప ఆరాధనకు అర్హుడు మరెవ్వరు లేరని, ముహమ్మద్ (ఆయనపై అల్లాహ్ శాంతి కురియుగాక) అల్లాహ్ ప్రవక్తయని ఈ పిలుపు పదే పదే గుర్తు చేస్తుంటుది.

# మతానికి సంబంధించిన ఐదు నియమాలు

దివ్యఖుర్ఆన్ లోని వివిధ వాక్యాల్లో మతానికి సంబంధించిన ఐదు నియమాల గురించి చెప్పబడింది[5]. ఉదాహరణకు మొదటి నియమానికి సబంధించి దివ్యఖుర్ఆన్ 49:15లో అల్లాహ్ ఇలా సెలవిచ్చారు.,

إِنَّمَا الْمُؤْمِنُونَ الَّذِينَ آمَنُوا بِاللَّهِ وَرَسُولِهِ ثُمَّ لَمْ يَرْتَابُوا وَجَاهَدُوا بِأَمْوَالِهِمْ وَأَنفُسِهِمْ فِي سَبِيلِ اللَّهِ ۚ أُولَٰئِكَ هُمُ الصَّادِقُونَ

*అసలు అల్లాహ్ ను, ఆయన ప్రవక్తనూ విశ్వసించి, ఇక ఎలాంటి అనుమానానికీ గురికాకుండా, తమ ప్రాణాలతో, తమ సిరిసంపదలతో అల్లాహ్ మార్గంలో ప్రయత్నించే వారే నిజమైన విశ్వాసులు. వారే సత్యసంధులు.*

## మొదటి నియమం :

అల్లాహ్ తప్ప ఆరాధనకు అర్హులు మరెవ్వరు లేరు, అల్లాహ్ తరపున సందేశహరుడు ముహమ్మద్ (స) అనే విశ్వాసవచనాన్ని మనోమస్తిష్కాల్లో ప్రతిష్ఠించుకుని ప్రకటించడం. ఈ ప్రకటన సృష్టికర్త ఒకే ఒక్కడనే విశ్వాసాన్ని ధృవీకరిస్తుంది. అలాగే ప్రవక్త ముహమ్మద్ (ఆయనపై శాంతి కురియుగాక) అల్లాహ్ తరపున అరుదెంచిన చిట్టచివరి ప్రవక్త అని ఈ ప్రకటన ధృవీకరిస్తుంది. దీన్ని అరబీ భాషలో షహాదా అంటారు. అంటే అర్థం సత్యాన్ని ప్రకటించి, సత్యం కోసం నిలబడుతూ, సత్యానికి సాక్ష్యం పలకడం.

మనిషి తన ధార్మిక విశ్వాసాన్ని ప్రకటించిన తర్వాత ముస్లిముగా ఆచరణలో తన ధార్మికవిశ్వాసం ప్రకారం కొన్ని నియమాలకు నిబద్ధుడై ఉండాలి.

## రెండవ నియమం :

విధిగా చేయవలసిన నమాజులు. రోజుకు ఐదుపూటలు నమాజు చేయాలి. అరబీ భాషలో సలా అంటారు. పొద్దుపొడిచిన వెంటనే, మధ్యాహ్నం, సాయంత్రం, పొద్దుగుంకిన తర్వాత, రాత్రి ఈ ఐదుపూటలు నమాజు చేయవలసి ఉంటుంది. నమాజు లేదా ప్రార్థన అనేది మధ్యవర్తులెవరు లేకుండా అల్లాహ్ తో ప్రత్యక్షంగా సంభాషించడం. నమాజులో అల్లాహ్ ఔన్నత్యాన్ని స్తుతించడంతో పాటు మన వేడుకోళ్ళు కూడా ఉంటాయి.

***మతానికి సంబంధించిన ఈ నియమం ప్రాముఖ్యత:*** అల్లాహ్ నమాజును దైవస్మరణగాను, దైవ అవిధేయతకు పాల్పడకుండా రక్షణగాను వర్ణించారు (దివ్యఖుర్ఆన్ 20:14, 29:45). కాబట్టి క్రమం తప్పకుండా నమాజు చేయడం వల్ల మనలో దైవభీతి (అరబీలో తఖ్వా[6]) పెంపొందుతుంది.

## మూడవ నియమం :

పేదలకు, అవసరార్థులకు దానాలు చేయడం. అరబీలో ఈ మూడవ నియమాన్ని జకాత్ అంటారు. ఇది తప్పనిసరిగా, విధిగా చేయవలసిన దానం. సంవత్సరకాలంలో తన ఖర్చులుపోగా మిగిలిన సంపదలో రెండున్నరశాతం సంపద జకాత్ గా ముస్లిములు చెల్లించాలి. నగదు రూపంలో, బంగారం రూపంలో, వెండి రూపంలో ఉన్న సంపదపై మాత్రమే కాదు, వ్యవసాయ ఉత్పత్తులపై, మార్కెటుషేర్లపై మొదలైన వాటిపై కూడా చెల్లించవలసి ఉంటుంది.

***మతానికి సంబంధించి ఈ నియమం ప్రాముఖ్యత :*** జకాత్ వ్యవస్థ వల్ల సమాజంలో సంపద పంపిణీ అయ్యే ఏర్పాటు జరుగుతుంది. ఆ విధంగా పేదరికాన్ని తొలగిస్తుంది. సమాజంలో ఈర్ష్యాద్వేషాలను లేకుండా చేస్తుంది. జకాత్ అనే అరబీ పదానికి అర్థం ప్రక్షాళన చేయడం. అంటే అల్లాహ్ దయ వల్ల జకాత్ మన సంపదను, మన ఆత్మలను ప్రక్షాళనం చేస్తుంది.

## నాల్గవ నియమం :

రమజాను మాసంలో పొద్దుపొడిచేసమయం నుంచి సూర్యాస్తమయం వరకు ఉపవాసం పాటించడం. రమజాను మాసం ఇస్లామీయ చంద్రమాన కేలండరులో తొమ్మిదవ నెల. ఉపవాసం ఉన్నప్పుడు పొద్దంతా ఒక ముస్లిం అన్నపానీయాలకు, లైంగిక చేష్టలకు దూరంగా ఉంటాడు. వీటితో పాటు చాడీలు చెప్పడం, అబద్ధపు సాక్ష్యం పలకడం వంటి ఇస్లాం నిషేధించిన వాటన్నింటికి చాలా నిష్ఠగా దూరంగా ఉంటాడు.

***మతానికి సంబంధించిన ఈ నియమం ప్రాముఖ్యత :*** మనిషిలో సహనం, ఓరిమి, సంకల్పబలాన్ని ఉపవాసం పెంచడమే కాదు, ధార్మికవిశ్వాసాన్ని, దైవభీతిని(తఖ్వా) పెంపొందిస్తుంది. మన కన్నా తక్కువస్థాయిలో ఉన్న వారిని, పేదవారిని, రోజుకోపూట కూడా భోంచేయలేని స్థితిలో ఉన్నవారిని గుర్తు చేసుకునేలా చేస్తుంది.

## ఐదవ నియమం :

మక్కా నగరానికి ధార్మిక యాత్ర. దీన్ని అరబీలో హజ్ అంటారు. ఆర్థికంగా స్తోమత, శారీరకంగా శక్తి ఉన్న ముస్లిం తన జీవితకాలంలో ఒక్కసారయినా ఈ యాత్ర చేయాలి.



*ఇబ్రాహీం స్థానం (మకామె ఇబ్రాహీం) మక్కాలో కాబా వద్ద ఉంది. కాబాగృహాన్ని నిర్మిస్తున్నప్పుడు ప్రవక్త ఇబ్రాహీం (ఆయనపై శాంతి కురియుగాక) ఇక్కడ నిలబడి కట్టారు.*

***మతానికి సంబంధించిన ఈ నియమం ప్రాముఖ్యత :*** ప్రపంచవ్యాప్త ముస్లిములంతా ఒకే చోట సమావేశమయ్యే అద్భుతమైన సందర్భం హజ్ యాత్ర., మానవాళి సమైక్యత, మతసమైక్యత, దేవుని ఏకత్వం, మానవులంతా ఒక్కటే అనే భావం, అందరి ధర్మం ఒక్కటే అనే భావాలను గొప్పగా ప్రదర్శించి, ప్రకటించే సందర్భం ఇది. హజ్ యాత్ర కూడా ఒకవిధమైన ఆరాధన. అల్లాహ్ ఔన్నత్యాన్ని స్తుతించడం. అంతేకాదు, ప్రవక్త ఇబ్రాహీం, ఆయన కుమారుడు ఇస్మాయీల్ (వారిపై అల్లాహ్ శాంతి కురియుగాక) ఈ ఇద్దరు ప్రవక్తల ఆరాధనలను, వారి త్యాగాలను స్మరించుకోవడం కూడా ఈ సందర్భంగా జరుగుతుంది.

మతానికి సంబంధించిన ఈ నియమాలు ఒక ముస్లిం మనోమస్తిష్కాల్లో భౌతికావసరాలు, భౌతికవాదాలను తొలగించి ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంచుతాయి. మరోవిధంగా చెప్పాలంటే, ఈ నియమాలు మన ఉనికికి సంబంధించి, భౌతిక పరిధుల నుంచి బయటకు తీసి ఆధ్యాత్మిక ఆవరణలోకి ప్రవేశపెడతాయి. దానివల్ల సృష్టికర్త గురించి ఎల్లప్పుడు గుర్తు చేసుకుంటూ, ఆయన పట్ల మన బాధ్యతలు, మానవాళి పట్ల మన కర్తవ్యాలను మరిచిపోకుండా ఉంటాము.



*ఒమాన్ లోని మస్కత్ లో ఉన్న సుల్తాన్ కబూస్ గ్రాండ్ మస్జిదు మినారును చూడండి. గతంలో నమాజుకు పిలుపు అంటే అజాన్ ఇవ్వడానికి ఒక ఎత్తయిన ప్రదేశంగా ఈ మినార్లు ఉపయోగపడేవి. ఇప్పుడు ఇవి మస్జిదును గుర్తుపెట్టే వాస్తుశైలిగా ఉన్నాయి.*

## సృష్టికర్త, అల్లాహ్ స్వభావం, గుణగణాలు

ప్రపంచంలో ప్రతి మనిషికి ఒక పేరుంది. అలాగే, సృష్టికర్త, విశ్వప్రభువుకు కూడా ఆయన వ్యక్తిగతమైన పేరు ఉంది. ఆ పేరు "అల్లాహ్". ఇది విశిష్టమైన పదం. చాలా ప్రత్యేకమైన పేరు. ఈ పదానికి లింగభేదం లేదు. బహువచనం లేదు. ఈ పదం నుంచి ఇతర పదాలేవీ ఏర్పడవు. అల్లాహ్ అనే పదం పులింగం కాదు, స్త్రీలింగం కాదు. ఆయన ఎవరికీ జన్మించలేదు. ఆయనకు తల్లి, తండ్రి లేరు. ఆయనలాంటి మరొకరు ఎవరు లేరు. ఆయనకు సమానులు, సమాంతరమైనవారు ఎవరు లేరు. ఆయన స్వచ్ఛమైనవాడు. ఆయనకు భాగస్వాములు ఎవరు లేరు. ఒకే ఒక్కడు, అంటే అల్ వాహిద్ గా పిలువబడే అర్హత ఆయనకు ఒక్కడికే ఉంది. ఆయన ఒకే ఒక్కడు, ఏకైకమైన వాడు. కాబట్టి –

1. అల్లాహ్ (1) విశిష్టమైన అలౌకిక, భౌతికపరిధుల్లేని గుణగణాలు లక్షణాలు కలిగినవాడు. ఉదాహరణకు ఆయన సర్వస్వతంత్రుడు, స్వయంసమృద్ధుడు. ఆయనకు ఆది లేదు, అంతం లేదు మొదలైన గుణగణాలు, (2) ఆయన స్వభావం, సంపూర్ణ శక్తిసామర్థ్యాలను ప్రకటించే సాటిలేని విశిష్ట లక్షణాలు, ఉదాహరణకు, ఆయన ఈ సృష్టి వంటి వాడు కాదు, ఆయన శాశ్వతమైనవాడు, ఆయన జీవితాన్ని ప్రసాదిస్తాడు, ఆయన అన్నీ వింటాడు, అన్నీ చూస్తాడు, చూసే, వినే శక్తిని ప్రసాదించేవాడు, ఆయన సర్వశక్తిమంతుడు, తన అభీష్టం అమలయ్యేలా చేయగలడు, ఇలా అనేక గుణగణాలు ఆయనకు స్వంతం. ఈ గుణగణాలన్నీ విశిష్టమైనవి, ఇందులో మరెవ్వరికీ ఎలాంటి భాగస్వామ్యమూ లేదు.

2. అల్లాహ్ కు అనేక అందమైన పేర్లున్నాయి. ఆయన గుణగణాల నుంచి ఈ పేర్లు జనించాయి. ఈ పేర్లలో – అనంత కరుణామయుడు, క్షమాశీలుడు, దయామయుడు, మహాజ్ఞాని, మహా వివేకవంతుడు మొదలైనవి.

3. అల్లాహ్ దైవత్వం, ప్రభుత్వం, దాస్యం పొందే హక్కు (ఉలూహియ్యహ్, రుబూబియ్యహ్, ఉబుదియ్యహ్) ఈ మూడు ప్రత్యేకతల్లో ఎవరికీ ఎలాంటి భాగం లేదు.

4. ఈ దైవిక ఔన్నత్యంతో, అల్లాహ్ అనే పేరుకు అర్థమేమిటంటే, మనం సంపూర్ణ విధేయత, ప్రేమ చూపవలసిన ఒకే ఒక్క దైవం. ఆయన ద్వారానే మనకు పూర్తి రక్షణ, ఆశ్రయం లభిస్తున్నాయి.

అదేవిధంగా, అల్లాహ్ అనే పేరు పరిపూర్ణమైన ఏకదైవారాధనను నిర్వచిస్తుంది. అంతేకాదు, దైవానికి ఉన్న ఈ విశిష్టమైన పేరుకు ఉన్న ప్రత్యేక అర్థం వల్ల, ఇతర పదాలు, దైవం, దేవుడు వగైరా పదాలు ఆయన్ను వర్ణించడానికి సరిపోయే పదాలు కాదు. అయినా

ఇస్లామీయ సాహిత్యంలో ఇతర భాషల్లో ఈ పదాలను అనువాదం కోసం వాడుతుంటారు.

ఈ విశ్వాన్ని, ఇందులోని సమస్త ప్రాణులను ప్రారంభించినవాడు, పోషిస్తున్నవాడు అల్లాహ్. ఆయన్నే మనం విశ్వసించాలని, ఆయన పట్ల మాత్రమే మన విధేయత చూపించాలని, ఆ విధంగా ఆయన పట్ల కృతజ్ఞత చూపించాలని అల్లాహ్ కోరుతున్నాడు. అల్లాహ్ స్వభావం, ఆయన గుణగణాలు, ఆయన పేర్లను తిరస్కరించడం, లేదా ఇతరులకు ఈ లక్షణాలను ఆపాదించడం (ఇలా చేయడాన్ని అరబీలో షిర్క్ అంటారు) ఇలాంటి పనులు అల్లాహ్ పట్ల తీవ్రమైన కృతఘ్నుత చూపిచడం అవుతుంది. ఆ విధంగా ఇది మహాపాపం. ఈ పాపానికి పాల్పడిన వ్యక్తి పశ్చాత్తాపపడకపోతే అల్లాహ్ ఎన్నటికీ క్షమించనని చెబుతున్నారు.

*అల్లాహ్ తనకు ఇతరులను భాగస్వాములుగా చేయడాన్ని ఎన్నటికీ క్షమించరు. కాని, ఇతర ఆచరణలను వేటినైనా ఆయన తలిస్తే క్షమిస్తారు. అందువల్ల అల్లాహ్ కు భాగస్వాములను నిలబెట్టడం అత్యంత హీనమైన పాపం*



కేథడ్రల్ ఆఫ్ కార్డోబా ఒక మస్జిదు. దీన్ని గ్రేట్ మాస్క్ ఆఫ్ కోర్డోబా అంటారు. స్పానిష్ భాషలో మెర్జికిటా అంటారు. క్రయిస్తవ పేరు కేథడ్రాల్ ఆఫ్ అవర్ లేడి ఆఫ్ ది అసంప్షన్. కార్డోబాలో ఇది కేథలిక్ కేథడ్రాల్. ఇస్లామీయ వాస్తుకు అత్యున్నత ఉదాహరణగా నేటికి కూడా నిలిచి ఉంది.

# ప్రవక్త ముహమ్మద్ – ఆయన జీవితం, వ్యక్తిత్వం

ప్రవక్త ముహమ్మద్ (ఆయనపై అల్లాహ్ శాంతి కురిపించుగాక) అల్లాహ్ తరఫున యావత్ మానవాళి కోసం అరుదెంచిన సందేశహరుడు. ప్రవక్త ముహమ్మద్ కన్నా ముందు అల్లాహ్ అనేకమంది ప్రవక్తలను పంపించారు. నోవా (నూహ్), అబ్రహం (ఇబ్రాహీం), మోసెస్ (మూసా), జీసస్ (ఏసు) (వారందరిపై అల్లాహ్ శాంతి కురిపించుగాక) వంటి ప్రవక్తలను పంపించారు. వారందరు ప్రత్యేక జాతి కోసం, ప్రత్యేక కాలం కోసం పంపబడిన ప్రవక్తలు. అల్లాహ్ పంపిన ప్రవక్తలందరినీ ముస్లిములు విశ్వసిస్తారు. వారిని గౌరవిస్తారు. ప్రవక్త ముహమ్మద్ చిట్టచివరి ప్రవక్తగా యావత్తు మానవాళి కోసం, సర్వకాలాల కోసం వచ్చారు. ఆయన శాశ్వతమైన, స్వచ్ఛమైన దైవసందేశం తీసుకుని వచ్చారు. అందువల్ల ఆయనను అత్యున్నత స్థాయిలో గౌరవిస్తారు[7].

## ఆయన వంశవృక్షం

ప్రవక్త ముహమ్మద్ ఒక అరబ్బు. అబ్రహం (ఇబ్రాహీం) కుమారుడు ఇస్మాయిల్ (ప్రవక్తలపై శాంతి కురియుగాక) వంశానికి చెందినవారు. అరబ్బుల్లో బనీ హాషీం వంశానికి చెందినవారు. మక్కాలో బలమైన ఖురైష్ తెగలోని అనేక వంశాల్లో బనీ హాషీం ఒకటి.

## జననం

ప్రవక్త ముహమ్మద్ (ఆయనపై అల్లాహ్ శాంతి కురిపించుగాక) మక్కాలో, సామాన్యశకం 570లో జన్మించారు. అంటే ఏసుక్రీస్తు ప్రవక్త (ఆయనపై అల్లాహ్ శాంతి కురిపించుగాక) తర్వాత ఆరుశతాబ్దాలకు జన్మించారు. ఆయన తల్లిదండ్రులిద్దరు గౌరవప్రదమైన కుటుంబాలకు చెందినవారు. ఆయన తండ్రి పేరు అబ్దుల్లా, ఆయనకు తండ్రి అబ్దుల్ ముత్తలిబ్, ఆయనకు తండ్రి హాషిం, ఆయనకు తండ్రి అబ్దుల్ మనాఫ్, ఆయనకు తండ్రి ఖాసే,, ఆయనకు తండ్రి కిలాబ్, ఆయనకు తండ్రి ముర్రా. ప్రవక్త తల్లి పేరు ఆమినా. ఆమె తండ్రి పేరు వహాబ్, ఈయనకు తండ్రి అబ్దుల్ మనాఫ్, ఆయన తండ్రి జురాహ్, ఆయన తండ్రి కిలాబ్, ఆయన తండ్రి ముర్రా.

ప్రవక్త ముహమ్మద్ (ఆయనపై అల్లాహ్ శాంతి కురిపించుగాక) జన్మించక ముందే ఆయన తండ్రి చనిపోయారు. ప్రవక్త కేవలం ఆరేళ్ళ వయసులో ఉన్నప్పుడు తల్లిని కోల్పోయారు. తాత అబ్దుల్ ముత్తలిబ్ ఆయన్ను పెంచారు. రెండేళ్ళ వయసులో ప్రవక్త తన పినతండ్రి అబూతాలిబ్ సంరక్షణలోకి వచ్చారు. అబ్దుల్ ముత్తలిబ్ మరణించిన తర్వాత అబూతాలిబ్ బనీ హాషీం వంశానికి నాయకుడయ్యారు.

## ప్రవక్త వ్యక్తిత్వం, నడవడి


ముహమ్మద్ (ఆయనపై అల్లాహ్ శాంతి కురిపించుగాక)

ప్రవక్తగా నియమించబడక ముందు ముహమ్మద్ (ఆయనపై అల్లాహ్ శాంతి కురిపించుగాక) చాలా సరళమైన, సదాచార సంపన్నుడైన, నైతికప్రమాణాలున్న వ్యక్తిగా ఎదిగారు. ఆయన నిరక్షరాస్యుడు. ఆయన ఎన్నడూ విగ్రహాలకు పూజలు చేయలేదు. ఆ కాలంలో విగ్రహారాధన సమాజంలో ప్రబలంగా ఉన్నప్పటికీ ఆయన విగ్రహారాధన ఎన్నడూ చేయలేదు. అందుకు బదులుగా ఆయన మక్కా నగరానికి బయట ఉన్న ఒక గుహలో ఏకాంతంగా ధ్యానం చేస్తూ, సృష్టికర్త గురించి, సృష్టి గురించి ఆలోచించేవారు.

సత్యసంధుడు, నిజాయితీపరుడు అని ఆయన సమాజంలో పేరుపడ్డారు. అరబీ భాషలో సాదికుల్ ఆమిన్ అని అంటారు. చాలా నిజాయితిగా ఉండేవారు. చాలా మంది తమ వద్ద ఉన్న సంపద ఆయన వద్ద దాచుకునేవారు.

ప్రవక్త ముహమ్మద్ (ఆయనపై అల్లాహ్ శాంతి కురిపించుగాక) ప్రజల పట్ల చాలా సానుభూతితో వ్యవహరించేవారు. పేదలను కాపాడేవారు. బడుగులను ఆదరించేవారు. వారిని కాపాడ్డానికి, వారికి సహాయపడడానికి ఒప్పందాలు, చర్చల్లో పాల్గొనేవారు.

# దైవసందేశం

ముహమ్మద్ (ఆయనపై అల్లాహ్ శాంతి కురిపించుగాక) మక్కా బయట ఉన్న గుహలో ధ్యానంలో ఉన్నప్పుడు ఒకసారి ప్రథమ దైవసందేశం వచ్చింది. దైవదూత జిబ్రయీలు తీసుకుని వచ్చారు.

*(ఓ ప్రవక్తా) పఠించు సర్వాన్నీ సృష్టించిన నీ ప్రభువు పేరుతో. ఆయన పేరుకుపోయిన నెత్తుటి ముద్దతో మానవుణ్ణి సృజించాడు. పఠించు: నీ ప్రభువు పరమదయాళువు. ఆయన కలం ద్వారా జ్ఞానం నేర్పాడు, మనిషి ఎరుగని జ్ఞానాన్ని అతనికి ప్రసాదించాడు. (దివ్యఖుర్ఆన్ **96:1-5**)*

ఈ దైవసందేశం సామాన్యశకం 610లో అవతరించింది. అప్పుడు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం అంటే ఆయనపై శాంతి కురియుగాక అని అర్థం, ఇక నుంచి క్లుప్తంగా (స) అని సూచించడం జరుగుతుంది) వయసు 40 సంవత్సరాలు.

***మొదటి దైవసందేశం జ్ఞానానికి సంబంధించింది. జ్ఞానం, హేతువు అనేవి విశ్వాసప్రకటనకు పునాదులు. నిజానికి ధర్మానికి కూడా ఇవే పునాదులు.***

ఆ తర్వాత దైవదూత జిబ్రయీల్ ద్వారా 23 సంవత్సరాల కాలం దైవసందేశాలు కొనసాగాయి. మొదటి 13 సంవత్సరాల కాలంలో ఆయన మక్కా నగరంలో ఇస్లాం సందేశ ప్రచారం చేశారు. మక్కాలో ఆయనపై, ఆయన అనుయాయులపై తీవ్ర వ్యతిరేకత, దౌర్జన్యాలు ఎదురయ్యాయి. సామాన్యశకం 622లో దౌర్జన్యాలు, హింసాకాండలు మితిమీరిపోవడం వల్ల ప్రవక్త, ఆయన అనుచరులు మక్కా వదిలి ఉత్తరాన 400 కిలోమీటర్ల దూరాన ఉన్న మదీనా నగరానికి వలస వెళ్ళారు. మదీనా ప్రజలు ఆయన్ను ఎంతో సాదరంగా ఆహ్వానించారు. మదీనాలో కూడా ప్రవక్త వద్దకు దైవసందేశం అవతరించడం కొనసాగింది. ఆయన ఆ దైవసందేశాన్ని మదీనాలో 10 సంవత్సరాల కాలం వరకు ప్రచారం చేశారు. మదీనాలో ఆయన ఇస్లామీయ రాజ్యాన్ని స్థాపించారు.

## మరణం

సామాన్య శకం 632లో, 63 సంవత్సరాల వయసులో ప్రవక్త ముహమ్మద్ (స) కొద్దికాలం జబ్బుపడి స్వర్గస్తులయ్యారు. మదీనాలో ఆయన్ను సమాధి చేశారు. ఆయన భార్య ఆయేషా (రజి అల్లాహు అన్హా అంటే అల్లాహ్ ఆమె పట్ల ప్రసన్నుడు అవ్వాలని ప్రార్థన. ఇక నుంచి (రజి) అని క్లుప్తంగా రాయడం జరుగుతుంది) ఇంట ఆయనను సమాధి చేశారు.

*కనుక ఓ ప్రవక్తా! అల్లాహ్ మీద భారం వెయ్యి. నిశ్చయంగా నీవు స్పష్టంగా సత్యంపై ఉన్నావు (దివ్యఖుర్ఆన్ 27:79)*



# ప్రవక్త విశ్వసనీయత

మానవాళి చరిత్రలో ఎల్లప్పుడు ప్రవక్తల విశ్వసనీయతను ప్రశ్నించడమే జరిగింది. ప్రవక్త ముహమ్మద్ (స) కూడా మినహాయింపు కాదు. దివ్యఖుర్‌ఆన్ ప్రకారం దైవ ప్రవక్తల విశ్వసనీయతకు ధృవీకరణ వారి వ్యక్తిత్వం, నడవడికల్లో ఉదాత్తతలో ఉంది. విశ్వప్రభువు నుంచి వారు తీసుకువచ్చిన దైవసందేశంలోని నిరాకరించలేని సత్యాలే వారి విశ్వసనీయతకు నిదర్శనాలు. ప్రవక్త ముహమ్మద్ (స) విశ్వసనీయతను చాటిచెప్పే నాలుగు వాదాలు మన ముందుకు వస్తాయి.

## మొదటి వాదన

మనం విభాగం 4లో చెప్పుకున్నట్లు ప్రవక్త ముహమ్మద్ (స) అత్యున్నత స్థాయి నిజాయితీ కలిగిన వారు. సమాజంలో అప్పట్లో ప్రజలంతా ఆయన్ను చాలా గౌరవించేవారు. ఆయన్ను సత్యసంధుడు, నిజాయితీపరుడనే పేర్లతో పిలిచేవారు. ప్రవక్త ముహమ్మద్ (స) ప్రవక్తగా తన దైవసందేశ ప్రచారాన్ని 40 సంవత్సరాల వయసులో ప్రారంభించారు. ఆయన వంటి అత్యున్నత నిజాయితీ, సత్యశీలం కలిగిన వ్యక్తి హఠాత్తుగా, ఆ వయసులో అబద్ధాలు చెబుతాడని చెప్పడం నమ్మశక్యం కాని విషయం.

ఆయన సమాజంలో తన హోదా పెంచుకోడానికి బహుశా ఇలా చేసి ఉండవచ్చని ఎవరైనా వాదించవచ్చు. కాని అప్పటికే ఆయన సమాజంలో చాలా గౌరవమర్యాదలు హోదా కలిగి ఉన్నారు. మక్కాలో అత్యంత బలమైన, గౌరవనీయమైన ఖురైష్ తెగకు చెందినవారు. నిజానికి ఆయన దైవసందేశ ప్రచారం ప్రారంభించిన కొత్తలో ఈ ప్రచారం మానేస్తే నాయకత్వ పదవి ఆయనకు కట్టబెడతామని కూడా ప్రతిపాదనలు ఆయన ముందుకు వచ్చాయి. వాటిని ఆయన నిర్ద్వంద్వంగా తిరస్కరించారు[8]. దీన్ని బట్టి ఆయన హోదాగౌరవాల కోసం, పదవుల కోసం ప్రయత్నించలేదని స్పష్టంగా అర్థమవుతోంది.

## రెండవ వాదన

దైవప్రవక్తలకు దైవిక సందేశాలు అందుతూ ఉంటాయి. ఆ విధంగా ప్రవక్త ముహమ్మద్ (స) వద్ద దైవసందేశం ఖుర్‌ఆన్ రూపంలో వచ్చింది. మనం విభాగం 7లో చెప్పుకున్న విషయాల దృష్ట్యా ఆలోచిస్తే దివ్యఖుర్‌ఆన్ను ప్రవక్త ముహమ్మద్ (స) రచించడం సాధ్యం కాదు. కాబట్టి ఇది ఖచ్చితంగా దైవిక సందేశం. నిజానికి దివ్యఖుర్‌ఆన్ లోనే దీనికి సంబంధించిన ఒక సవాలు ఉంది. ఖుర్‌ఆన్ వంటిది ఏదైనా రాసి తీసుకురమ్మనే సవాలు. ప్రవక్త ఖుర్‌ఆన్ రాశారని ఎవరైనా భావిస్తుంటే, ఇలాంటి ఒక వాక్యమైనా రాసి తీసుకురావాలని ఖుర్‌ఆన్ అప్పట్లోనే సవాలు చేసింది. ప్రవక్త నిరక్షరాస్యులు. అలాంటి

పుస్తకం ఆయన రాసే అవకాశం లేదు. కాబట్టి ప్రవక్త ముహమ్మద్ (స) విశ్వసనీయత, ఆయన దైవప్రవక్త అని చెప్పడానికి దివ్యఖుర్ఆన్ స్వయంగా ఒక నిదర్శనం. నిజానికి ప్రవక్త ముహమ్మద్ (స) చేసానని చెప్పుకున్న ఒకే మహత్యం దివ్యఖుర్ఆన్[9].

## మూడవ వాదన

మానవ చరిత్రలో అంతకు ముందు ఏ ఉద్యమం కూడా మార్చలేనట్లు మానవ నాగరికతను అత్యంత వేగంగాను, పరిపూర్ణంగాను ప్రవక్త ముహమ్మద్ (స) ప్రారంభించిన ఉద్యమం మార్చేసింది. అంతేకాదు, ఇస్లాం మాదిరిగా మానవనాగరికత, వికాసాలపై మరే మతం కూడా ఇలాంటి నిరంతర ప్రభావాన్ని వేయలేదు. మానవనాగరికతను శరవేగంగాను, సంపూర్ణంగాను ఈ విధంగా మార్చడం అనేది మోసం వల్ల సాధ్యమయ్యే పని కాదు. నిజానికి ఇలా ఆలోచించడమే నిర్హేతుకం.

## నాల్గవ వాదన

ప్రవక్త ముహమ్మద్ (స) గురించి అన్ని ప్రధాన మతాల గ్రంథాల్లోను భవిష్యవాణులున్నాయి. యూద, క్రయిస్తవ, హిందూ, బౌద్ధ గ్రంథాల్లో ఆయన గురించి సూచనలున్నాయి.

దివ్యఖుర్ఆన్ లో ప్రవక్త ముహమ్మద్ (స) గురించి యూద, క్రయిస్తవ గ్రంథాల్లోని భవిష్యవాణుల ప్రస్తావన ఉంది.

> ***ఈ సందేశహరుణ్ణి, చదువనూ వ్రాయనూ రాని ఈ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లమ్)ను అనుసరించేవారు (ఈనాడు ఈ కారుణ్యానికి అర్హులు). అతని ప్రస్తావన వారికి తమ వద్ద ఉన్న తౌరాతు, ఇంజీలు గ్రంథాలలో వ్రాయబడి లభిస్తుంది (దివ్యఖుర్ఆన్ 7:157)***

ద్వితీయోపదేశకాండం 18:18లో ఇలా రాయబడి ఉంది:

> ***వారి సహోదరులలోనుండి నీవంటి ప్రవక్తను వారికొరకు పుట్టించెదను; అతని నోట నా మాటల నుంచుదును; నేను అతనికాజ్ఞాపించునది యావత్తును అతడు వారితో చెప్పును.***

పాత నిబంధనలోని ఈ వాక్యంలోని వర్ణన ప్రకారం, మూసా ప్రవక్త తర్వాత వచ్చిన ప్రవక్తల్లో ముహమ్మద్ (స) తప్ప మరెవ్వరు ఈ వర్ణన ప్రకారం లేరు. మొదట, యూదులకు సోదరులంటే అరబ్బులు. ఇస్రాయీల్ సంతానం అంటే ఇస్సాకు సంతతి వారు. అరబ్బులు

ఇస్మాయిలు సంతతి వారు. ఇస్సాకు, ఇస్మాయీలు ఇద్దరు ఇబ్రాహీం ప్రవక్త కుమారులు. కాబట్టి వారి సంతతి వారు సోదరులు అవుతారు. రెండవ విషయం : ప్రవక్త ముహమ్మద్, ప్రవక్త మూసా వంటివారు. ఏసుక్రీస్తు ఇలాంటి వారు కాదు. ఎందుకంటే (1) ప్రవక్త ముహమ్మద్, ప్రవక్త మూసా ఇద్దరికి తల్లిదండ్రులు ఇద్దరు ఉన్నారు. కాని ఏసుక్రీస్తుకు తల్లి మాత్రమే, తండ్రిలేరు. (2) ప్రవక్త మూసా, ప్రవక్త ముహమ్మద్ ఇద్దరు ప్రకృతి సహజంగా తల్లిగర్భంలో వేయబడ్డారు. కాని ఏసుక్రీస్తు జననం అలాంటిది కాదు, ఒక మహత్యం ద్వారా ఆయన తల్లి గర్భంలో వేయబడ్డారు. (3) ప్రవక్త మూసా, ప్రవక్త ముహమ్మద్ ఇద్దరు వివాహాలు చేసుకున్నారు. వారికి పిల్లలున్నారు. ఏసుక్రీస్తు వివాహం చేసుకోలేదు. (4) ప్రవక్త మూసా, ప్రవక్త ముహమ్మద్ ఇద్దరు కూడా ప్రజలకు కొత్త చట్టాలు తీసుకుని వచ్చారు. ఏసుక్రీస్తు కొత్త చట్టాలు తీసుకురాలేదు. (5) ప్రవక్త మూసా, ప్రవక్త ముహమ్మద్ ఇద్దరు సహజమరణం పొందారు, ఇస్లామీయ, క్రయిస్తవ విశ్వసాలు రెండింటిలోను ఏసుక్రీస్తు సహజమరణం పొందలేదు. మూడవ విషయం, దివ్యఖుర్ఆన్ 55:3-4లో ఇలా చెప్పబడింది. "అతను (ప్రవక్త) తన మనోవాంఛలను అనుసరించి చెప్పటం లేదు. ఇది ఒక వహీ, అతనిపై అవతరింపజేయ బడుతుంది. గొప్ప శక్తిసంపన్నుడు అతనికి నేర్పుతున్నాడు."

కొత్త నిబంధనలో చూస్తే, గోస్పెల్ ఆఫ్ జాన్ లో ఇలా ఉంది:

> *నేను మీతో చెప్పవలసినవి ఇంకను అనేక సంగతులు కలవు గాని యిప్పుడు మీరు వాటిని సహింపలేరు. అయితే ఆయన, అనగా సత్యస్వరూపియైన ఆత్మ వచ్చినప్పుడు మిమ్మును సర్వసత్యము లోనికి నడిపించును; ఆయన తనంతట తానే యేమియు బోధింపక, వేటిని వినునో వాటిని బోధించి సంభవింపబోవు సంగతులను మీకు తెలియజేయును. ఆయన నా వాటిలోనివి తీసికొని మీకు తెలియజేయును. నా ఔన్నత్యాన్ని పెంచును.*

ఈ వాక్యాలు సత్యస్వరూపి గురించి మాట్లాడుతున్నాయి. ఆయన తనంతట తాను మాట్లాడడు. ఇక్కడ సత్యస్వరూపి పవిత్ర ఆత్మ అయ్యే అవకాశం లేదు. ఎందుకంటే పవిత్ర ఆత్మ ఏసుక్రీస్తు కాలంలో ఆయనతో ఉన్నారు. (లూకా 4:1, 3:22, జాన్ 20:22, యాక్ట్స్ 2:4 మొదలైనవి) అంతేకాదు, సత్యస్వరూపి ఏసుక్రీస్తు ఔన్నత్యాన్ని పెంచును. ఏసుక్రీస్తు తర్వాత వచ్చి, ఏసుక్రీస్తు ఔన్నత్యాన్ని పెంచిన ప్రవక్త ముహమ్మద్ (స) తప్ప మరెవ్వరు లేరు (విభాగం 11 చూడండి). కాబట్టి ఏసుక్రీస్తు తర్వాత రావలసిన సత్యస్వరూపి ప్రవక్త ముహమ్మద్ (స).

అంతేకాదు, బైబిలులో ప్రవక్త ముహమ్మద్ గురించి సూచనలు ఐసయ్య 29:12, జాన్



**ఇస్లాంబుల్ ఆసియాభాగంలోని నగరంలో కనిపించే మినార్లు**

14:16, జాన్ 16:7, మాథ్యు 21:43, యాక్ట్స్ 3:22 లలో ఉన్నాయి. ఈ బైబిలు వాక్యాల్లో ప్రస్తావనకు వచ్చిన స్వస్థతనిచ్చువాడు అనే పదం నిజానికి గ్రీకు పదం పారాక్లిటోస్ కు అనువాదం. నిజానికి అసలు గ్రీకుపదం పెరిక్లిటోస్ కు భ్రష్ఠరూపం పారాక్లిటోస్. పెరిక్లిటోస్ అనే పదానికి నైఘంటిక అర్థం ప్రశంసించబడిన వారు అని. అరబీలో దీన్ని అనువదిస్తే అహ్మద్ లేదా ముహమ్మద్[10].

నిష్పక్షపాతమైన అధ్యయనం వల్ల తెలుస్తున్నదేమంటే, ప్రవక్త ముహమ్మద్ (స) గురించి హిందూ, బౌద్ధ గ్రంథాల్లో కూడా ఉంది. “ముహమ్మద్ ఇన్ ది హిందూ స్క్రిప్చర్స్” అనే గ్రంథంలో డా.వేదప్రకాష్ ఉపాధ్యాయ హిందూ గ్రంథాల్లో ప్రవక్త ముహమ్మద్ (స) గురించి అనేక ప్రస్తానలను వివరించారు. వేదాలు భవిష్యత్తులో రాబోయే ఒక రుషిని గురించి చెప్పాయి. ఆయన వర్ణన ప్రవక్త ముహమ్మద్ (స)కు సరిపోతుంది. సంస్కృతభాషలో ఉన్న ఆ వర్ణన ప్రకారం:

1. *నరాశంస అంటే ''ప్రశంసనీయుడు''. ప్రవక్త పేర్లు అహ్మద్, ముహమ్మద్ లకు అర్థమిదే. అంతేకాదు, నరాశంస జన్మస్థానం, ఆయన గుణగణాలు కూడా ప్రవక్తకు పూర్తిగా సరిపోతాయి.*

2. *“అంతిమ రుషి” లేదా “చివరి రుషి”. ప్రవక్త ముహమ్మద్ (స) మానవాళికి చివరి దైవప్రవక్త.*

3. *కల్కి అవతారం, అంటే చివరి తరం కోసం వచ్చే రుషి. ప్రవక్త ముహమ్మద్ (స) యావత్తు మానవాళి కోసం వచ్చిన చిట్టచివరి దైవప్రవక్త.*

4. *కౌరం, అంటే ఒక ప్రవాసి. ప్రవక్త ముహమ్మద్ (స) మదీనాకు ఒక ప్రవాసిగా వెళ్ళారు (విభాగం 4 చూడండి).*

5. ఆయన తండ్రిని ''విష్ణువేష్ గా'' పేర్కొనడం జరిగింది. అంటే అర్థం ''దైవదాసుడు''. ఆయన తల్లిని ''సుమతి'' అని చెప్పడం జరిగింది. అంటే అర్థం ''శాంతి''. ఈ రెండు పేర్లు అరబీలోని ''అబ్దుల్లా'', ''అమీనా'' పేర్ల అర్థాలతోనే ఉన్నాయి. ఇవి ప్రవక్త ముహమ్మద్ (స) తల్లిదండ్రుల పేర్లు.

6. రానున్న రుషి పేరు మమహా. ఇది సంస్కృత పదం కాదు. అరబీ పేరు ముహమ్మద్ సంస్కృతరూపంలో ఇలా మారినట్లు కనిపిస్తుంది.

బౌద్ధ గ్రంథాల్లో గౌతమ బుద్ధుడి భవిష్యవాణి ఉంది. 'అంతిమ బుద్ధుడు' వస్తాడని చెప్పడం జరిగింది. అంటే చిట్టచివరి రుషి అని అర్థం. ఆయన పేరు మైత్రేయ అని పేర్కొన్నారు. (గోస్పెల్ ఆఫ్ బుద్ధా, కేరస్, పేజి 17). మైత్రేయుడి వర్ణన పూర్తిగా ప్రవక్త ముహమ్మద్ (స) తో సరిపోతుంది :

1. ప్రవక్త ముహమ్మద్ (స) చిట్టచివరి ప్రవక్త, చివరి రుషి.

2. మైత్రేయ అటే అర్థం 'కారుణ్యమూర్తి'. ప్రవక్త ముహమ్మద్ (స)ను దివ్యఖుర్ఆన్ (21:107) ప్రపంచంలోని యావత్తు మానవాళికి కారుణ్యమూర్తిగా వర్ణించింది.

3. ఒక బుద్ధుడికి ఉండే లక్షణాలన్నీ మైత్రేయ కలిగి ఉంటాడు. ఆయన ఒక కులీన వంశంలో జన్మిస్తారు. ఒక గుహలో ధ్యానంలో గడుపుతారు. ఆయన్ను దైవదూతలు సందర్శిస్తారు. ఆయనకు భార్యలు, సంతానం ఉంటారు. ఆయన జీవనోపాధికి పనిచేస్తారు. ఆయన తన సహజమైన జీవితాన్ని పూర్తి చేస్తారు. అంటే ఆయన సహజ మరణానికి గురవుతారు. ఈ వర్ణన మొత్తం ప్రవక్త ముహమ్మద్ (స)కు సరిపోతుంది.

4. మైత్రేయ ఒక పాలకుడు. ముహమ్మద్ కేవలం ఒక ప్రవక్త మాత్రమే కాదు, ఒక పాలకుడు కూడాను. ముస్లిం రాజ్యానికి ఆయన పాలకుడు.

5. మైత్రేయ తన కన్నా ముందు వచ్చిన బుద్ధుల గురించి చెబుతారు. ముహమ్మద్ (స) కూడా తనకన్నా ముందు వచ్చిన ప్రవక్తల గురించి వివరించారు. ప్రవక్త ముహమ్మద్ (స) కన్నా ముందు వచ్చిన ఇరవై నలుగురు ప్రవక్తల గురించి దివ్యఖుర్ఆన్ ప్రస్తావించింది.

6. మైత్రేయకు ఈ ప్రపంచంలో ఉపాధ్యాయుడు ఎవరు ఉండరు. ప్రవక్త ముహమ్మద్ (స) నిరక్షరాస్యులు. ఆయనకు ప్రపంచంలో ఉపాధ్యాయుడు ఎవరు లేరు. ఆయనకు లభించిన జ్ఞానమంతా దైవిక అవతరణల వల్ల లభించింది.

కాబట్టి, ప్రవక్త ముహమ్మద్ (స) విశ్వసనీయతకు ప్రమాణాలు ఆయన వ్యక్తిత్వంలో, ఆయన తీసుకువచ్చిన సందేశంలో, ఆయన ఉద్యమం వల్ల మానవనాగరికతలో వచ్చిన అద్భుతమైన మార్పుల్లో, ప్రధాన మతగ్రంథాల్లో ఆయన రాక గురించి ఉన్న ప్రస్తావనల్లో కనిపిస్తున్నాయి.



*మదీనాలో ప్రవక్త మస్జిదు (మస్జిదున్నబవీ). ఈ మస్జిదును ప్రవక్త ముహమ్మద్ (స) సామాన్యశకం **622**లో నిర్మించారు. తన ఇంటికి పక్కన ఉన్న భూభాగంపై కట్టారు. సంవత్సరాల కాలగమనంలో అనేకసార్లు విస్తరణ జరిగింది. ఇప్పుడు ప్రపంచంలోని అతిపెద్ద మస్జిదుల్లో ఇది ఒకటి. మక్కాలోని పవిత్ర మస్జిదు (మస్జిదల్ హరం) తర్వాత రెండవ అత్యంత పవిత్రమైన మస్జిదు.*

# దివ్యఖుర్ఆన్ సందేశం చరిత్ర

దైవదూత జిబ్రయీల్ ద్వారా ప్రవక్త ముహమ్మద్ (స)కు అల్లాహ్ పంపించిన దైవగ్రంథం దివ్యఖుర్ఆన్. సర్వకాలాలకు యావత్తు మానవాళికి అల్లాహ్ తరఫున అవతరించిన చిట్టచివరి మార్గదర్శక గ్రంథం ఇది. అల్లాహ్ మానవాళికి తన సందేశాన్ని సంపూర్ణం చేయడానికి, గతకాలాల్లోని దైవగ్రంథాలను ధృవీకరించడానికి, గత దైవగ్రంథాల్లో ఇప్పుడున్న వాటిలో జరిగిన మార్పులు చేర్పులను సవరించడానికి దివ్యఖుర్ఆన్ అవతరించింది[11].

## దివ్యఖుర్ఆన్ అవతరణ

దివ్యఖుర్ఆన్ సామాన్యశకం 610 నుంచి 632 మధ్యకాలంలో, 23 సంవత్సరాల పాటు వివిధ దశల్లో అరబీ భాషలో అవతరించింది. విభిన్న పరిస్థితుల్లో విశ్వాసులకు అవసరమైన మార్గదర్శకత్వాన్నివ్వడానికి క్రమబద్ధమైన రీతిలో ప్రవక్త వద్దకు ఈ దైవగ్రంథం అవతరించింది. అల్లాహ్ చట్టాలను ప్రభావవంతంగా విశ్వాసుల జీవితాల్లో లీనమైపోయేలా ఈ గ్రంథం అవతరించింది.

## దివ్యఖుర్ఆన్ రాయడం, భద్రపరచడం

ప్రవక్త ముహమ్మద్ (స) వద్దకు దివ్యఖుర్ఆన్ అవతరించిన వెంటనే ఆ వాక్యాలను ఆయన లేఖకులకు చెప్పి రాయించేవారు. ఆయన స్వయంగా సూచనలిచ్చి పర్యవేక్షించి రాయించేవారు. అదేసమయంలో, ప్రవక్త, ఆయనతో పాటు అనేకమంది అనుచరులు, స్త్రీలు, పురుషులు దివ్యఖుర్ఆన్ అవతరించిన వెంటనే కంఠస్థం చేసేవారు. ఈ విధంగా దివ్యఖుర్ఆన్ రాయడం, కంఠస్థం చేయడం జరిగింది. ప్రవక్త ముహమ్మద్ (స) జీవితకాలంలోనే దివ్యఖుర్ఆన్ రాయించడం, కంఠస్థం చేయించడం జరిగాయి. దివ్యఖుర్ఆన్‌ను కంఠస్థం చేసే ఈ సంప్రదాయం నేడు కూడా కొనసాగుతోంది. ఇస్లాం చరిత్రలో ఏ కాలంలో అయినా సరే లక్షలాది ముస్లిములు పూర్తి దివ్యఖుర్ఆన్ కంఠస్థం చేసినవారు మనకు కనిపిస్తారు. నేడు దాదాపు రెండు కోట్ల మంది ముస్లిములు పూర్తి దివ్యఖుర్ఆన్‌ను కంఠస్థం చేసినవారున్నారని అంచనా. దివ్యఖుర్ఆన్‌లోని కొన్ని భాగాలను కంఠస్థం చేసినవారు కూడా కోట్లాది మంది ఉన్నారు.

## దివ్యఖుర్ఆన్ లోని విషయాలు

దివ్యఖుర్ఆన్ లో మొత్తం 114 అధ్యాయాలున్నాయి. కేవలం 3 వాక్యాలున్న అధ్యాయాలు (అధ్యాయం 103, అధ్యాయం 108). మొదలు 286 వాక్యాలున్న అధ్యాయాలు (అధ్యాయం 2) వరకు ఇందులో ఉన్నాయి. దివ్యఖుర్ఆన్ మార్గదర్శక గ్రంథం.

హెచ్చరికలు, శుభవార్తలు, గతజాతుల చరిత్ర, ఆయా జాతుల్లో అవతరించిన ప్రవక్తల గురించి తెలియజేసే గ్రంథం. అంటే దివ్యఖుర్‌ఆన్ లో స్థూలంగా నాలుగు విషయాలు కనిపిస్తాయి.

**మొదటిది, ఖుర్‌ఆన్** మనకు అల్లాహ్ గురించి, ఆయన స్వభావం, లక్షణాల గురించి తెలియజేస్తుంది. ఉదాహరణకు, ఈ పుస్తకం విభాగం 2లో మనం అధ్యాయం 112 గురించి చదివాము. అందులో అల్లాహ్ ఒకే ఒక్కడనేది తెలుసుకున్నాము (తౌహీద్). అలాగే ఆయన విశిష్ట గుణగణాలు, ఆ గుణగణాలు ఆయనకే ప్రత్యేకమని, ఎవరికీ ఎలాంటి భాగస్వామ్యం లేదని తెలుసుకున్నాం. క్రింద ఇచ్చిన వాక్యాన్ని సింహాసనవాక్యం, అరబీలో ఆయతుల్ కుర్సీ అంటారు. అల్లాహ్ గుణగణాలు వర్ణించే మరో ఉదాహరణ ఇది.



*అల్లాహ్ – ఆయనతప్ప ఆరాధ్యదైవం ఎవ్వడూ లేడు. సకల చరాచర సృష్టికి మూలాధారం అయిన ఆయన సజీవుడు, నిత్యుడు, అనంతుడు. ఆయన నిదురపోడు, ఆయనకు కునుకూ రాదు. భూమ్యాకాశాలలో ఉన్నసమస్తమూ ఆయనదే. ఆయన సమ్ముఖంలో ఆయన అనుజ్ఞ లేకుండా సిఫారసు చెయ్యగలవాడెవ్వడు? ప్రజల ముందు ఉన్నదానినీ ఆయన ఎరుగును. వారికి గుప్తంగా ఉన్నదీ ఆయనకు తెలుసు. ఆయన స్వయంగా తెలియజెయ్యాలని అభిలషిస్తే తప్ప ఆయనకున్నజ్ఞానవిశేషాలలోని ఏ విషయమూ వారి గ్రహణ పరిధిలోకి రాదు. ఆయన రాజ్యాధికారం ఆకాశాలనూ భూమిని పరివేష్టించి ఉన్నది. వాటి సంరక్షణ ఆయనకు ఎంత మాత్రం అలసట కలిగించదు. ఆయన మాత్రమే సర్వాధికుడు, సర్వోత్తముడూను. (దివ్యఖుర్‌ఆన్2 : 255)*

**రెండవది,** ఇందులో మొదట అల్లాహ్ తో మన సంబంధాన్ని వర్ణించడం జరిగింది. ఆయన ఎందుకు మనలను సృష్టించాడు, ఆయన విషయంలో మనకు ఉన్న బాధ్యతలేమిటో తెలియజేస్తుంది. దివ్యఖుర్ఆన్ 51:56లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

*"నేను జిన్నులను, మానవులను కేవలం నా ఆరాధన కొరకు సృష్టించాను".*

ఇక్కడ 'ఆరాధన' అనే పదం సృష్టికర్తను సేవించడాన్ని, ఆయన ఆదేశాల ప్రకారం జీవించడాన్ని సూచిస్తుంది. ఆ తర్వాత దివ్యఖుర్ఆన్ మనిషికి మిగిలిన సృష్టితో ఉన్న సంబంధాన్ని వర్ణిస్తుంది. అంటే దైవదూతలు, జిన్నులు, జంతుకోటి ఇతర భౌతిక ప్రపంచంతో మన సంబంధాన్ని తెలియజేస్తుంది. మన ఉనికికి సంబంధించి వాటన్నింటి ప్రాసంగికత, వాటితో మన పరస్పర చర్యలు అన్ని ఇందులో ఉన్నాయి[12].

**మూడవది,** చట్టాలు, ఉత్తర్వుల రూపంలో దివ్యఖుర్ఆన్ మనకు మార్గదర్శనం ఇస్తుంది. నైతికత, సదాచారజీవనాలకు సంబంధించిన ప్రమాణాలను నెలకొల్పుతుంది. మనం అల్లాహ్‌ను ఎలా ఆరాధించాలి? మన జీవితాలను ఎలా గడపాలన్నది తెలియజేస్తుంది. అల్లాహ్ అభీష్టం ప్రకారం జీవించిన వారికి శాశ్వత బహుమానం, తిరస్కరించిన వారికి శాశ్వత శిక్షల గురించి తెలియజేస్తుంది[13].

**చివరకు,** ప్రవక్తల ద్వారా ప్రతి జాతిలోను అల్లాహ్ మార్గదర్శకత్వం పంపించాడని ఖుర్ఆన్ తెలియజేస్తుంది. ఉదాహరణకు 10:47లో అల్లాహ్ ఇలా తెలియజేశాడు.

*"ప్రతి సంఘానికి ఒక ప్రవక్త ఉంటాడు. కనుక ఒక సంఘం వద్దకు దాని ప్రవక్త వచ్చినప్పుడు ఆ సంఘం విషయంలో పూర్తి న్యాయంతో కూడుకున్న తీర్పు చెయ్యబడుతుంది. దానికి రవ్వంత అన్యాయం కూడా జరగదు."*

ఆ విధంగా, మానవాళికి గుణపాఠాలు గరపడానికి దివ్యఖుర్ఆన్ గతజాతుల పట్ల అల్లాహ్ ఎలా వ్యవహరించాడో తెలియజేస్తుంది. ఉదాహరణకు, నూహ్ ప్రవక్త సంఘర్షణ గురించి మనకు తెలియజేస్తుంది. ఎలా తన జాతివారికి నచ్చచెప్పే ప్రయత్నాలు చేశారో, ఎలా చివరకు వరద ముంచెత్తిందో వివరిస్తుంది. అలాగే ప్రవక్త మూసా తన జాతి ప్రజలకు, పాలకుడు ఫారోకు దైవసందేశం చెప్పడానికి చేసిన సంఘర్షణ గురించి తెలియజేస్తుంది. ఆ తర్వాత అన్నింటికన్నా ముఖ్యమైన కథ ప్రవక్త జోసెఫ్ (యూసుఫ్) గురించి తెలియజేస్తుంది. మొత్తం 25 మంది ప్రవక్తలు, అల్లాహ్ మానవాళి వద్దకు వివిధ కాలాల్లో పంపిన ప్రవక్తల కథలు దివ్యఖుర్ఆన్ వివరిస్తుంది[14].



**దివ్యఖుర్ఆన్ పారాయణం ఇస్లాములో ఒక ఆరాధన. ఆవిధంగా ప్రపంచంలో ఈ రోజు అత్యధికంగా చదవబడుతున్న పుస్తకం దివ్యఖుర్ఆన్.**

## ఆధునిక విజ్ఞాన శాస్త్రం – దివ్యఖుర్ఆన్

దివ్యఖుర్ఆన్ పద్నాలుగు వందల సంవత్సరాల క్రితం అవతరించిన గ్రంథం. అయినా అందులో అనేక వైజ్ఞానిక వాస్తవాలు మనకు కనబడతాయి. సైన్సు ఇటీవల కనిపెట్టిన విషయాలు అందులో కనిపిస్తాయి. ఇవి అనేక వైజ్ఞానికశాస్త్ర విభాగాలకు సంబంధించినవి. ఖగోళశాస్త్రం, భూగర్భశాస్త్రం, భౌతికశాస్త్రం, జీవశాస్త్రం, వృక్షశాస్త్రం, జంతుశాస్త్రం తదితర శాస్త్రాలకు సంబంధించిన వాస్తవాలు. అందులో కొన్ని ఇప్పుడు చూద్దాం.

# విశ్వసృష్టి

దివ్యఖుర్ఆన్ (21:30) లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

> *(ప్రవక్త మాటలను విశ్వసించకుండా) తిరస్కరించిన వారు ఈ విషయాలను గురించి ఆలోచించరా? ఆకాశాలూ భూమీ పరస్పరం కలసి ఉండేవనీ, తరువాత మేము వాటిని వేరు చేశామనీ, ప్రాణం ఉన్న ప్రతిదానిని నీళ్లతో సృష్టించామనీ? వారు (సృష్టించే మా ఈ శక్తిని) అంగీకరించరా?*

అంతేకాదు, అధ్యాయం 51, వాక్యం 47లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

> *ఆకాశాన్ని మేము మా శక్తితో నిర్మించాము. నిస్సందేహంగా దాన్ని విస్తరిస్తున్నాము.*

ఈ వాక్యాలు ఆధునిక సైన్సుకు అనుగుణంగా ఉన్నాయి. ఈ విశ్వం ఒక పొగలాంటి స్థితి నుంచి ఏర్పడిందని, తర్వాత ఒక మహావిస్ఫోటంతో గ్యాలక్సీలు ఏర్పడ్డాయని అర్థమవుతుంది. దీన్ని బిగ్ బ్యాంగ్ సిద్ధాంతం అంటున్నారు. అంతేకాదు, ఆధునిక సైన్సు ప్రకారం మన విశ్వం ఆ మొదటి పేలుడు తర్వాత ఇంకా వ్యాకోచిస్తూనే ఉంది.



**అల్లాహ్ సృష్టిలోని లక్షలాది గ్యాలక్సీల్లో ఆంద్రోమేడా గ్యాలక్సీ ఒకటి. ఈ గ్యాలక్సీని సామాన్యశకం 964లో పర్షియాకు చెందిన ఖగోళశాస్త్రవేత్త అబ్దుర్రహ్మాన్ అల్ సూఫీ కనిపెట్టారు.**

# మానవ పిండవికాసం

తల్లిగర్భంలో మానవ పిండ వికాసక్రమాన్ని దశలవారిగా దివ్యఖుర్ఆన్ వివరించింది. ఉదాహరణకు ;

> ***మేము మానవుణ్ణి మట్టి యొక్క సారంతో సృష్టించాము. తరువాత అతనిని ఒక సురక్షితమైన స్థానంలో పడే బిందువుగా మార్చాము, ఆ తరువాత ఈ బిందువుకు ముద్ద ఆకారాన్ని ఇచ్చాము, ఆపైన ముద్దను కండగా చేశాము, తరువాత మాంసపుకండను ఎముకలుగా చేశాము, ఆ తరువాత ఎముకలకు మాంసాన్ని తొడిగాము, ఆపైన దానిని భిన్నమైన సృష్టిగా చేసి నిలబెట్టాము. కనుక అల్లాహ్ ఎంతో శుభప్రదుడు, సృజనకారులందరిలోకెల్లా ఉత్తమ సృజన కారుడు.***

ఈ వాక్యాలు గర్భంలో పిండం అభివృద్ధిని ప్రారంభం నుంచి దశలవారీగా వివరణాత్మకంగా తెలియజేస్తున్నాయి. ప్రతి దశను ఖచ్చితమైన అరబీ పదంతో వర్ణించడం జరిగింది. మొదట, ఫలదీకరణం చెందిన అండం ఒక రక్తపు ముద్దగా మారుతుంది (అలఖా). తర్వాత అది ఒక మాంసపు ముద్దగా మారుతుంది (ముద్గా). ఆ తర్వాత అందులో ఎముకలు అభివృద్ధి చెందడం ప్రారంభం అవుతుంది. చివరకు, ఎముకల చుట్టు కండరాలు ఏర్పడుతాయి. గర్భంలో శిశువు అభివృద్ధిని దివ్యఖుర్ఆన్ వివరించిన క్రమం ఇది.

ఈ వాక్యంలో ఉపయోగించిన రెడు అరబీ పదాలు, అలఖా, ముద్గా రెండు ఖచ్చితంగా పిండం స్థితిని వర్ణించాయి.

గడ్డకట్టిన రక్తం అనే అర్థమే కాకుండా అలకా అనే పదానికి అతుక్కుని వేలాడేది అనే అర్థం కూడా ఉంది. అలాగే జలగవంటిది అనే అర్థం కూడా ఉంది. తల్లిగర్భంలో పిండాన్ని ప్రారంభదశలో పరిశీలిస్తే తల్లి గర్భాశయం గోడలకు అతుక్కుని వేలాడుతూ ఉంటుంది, అది తేలుతూ ఉండదు. అంతేకాదు, అది ఒక జలగలా కనబడుతుంది. జలగ ఏదన్నా జంతువు చర్మానికి అతుక్కుని రక్తం పీల్చుకుంటుంది. పిండం కూడా తల్లి నుంచి ఈవిధంగానే గర్భంలోని మాయ ద్వారా రక్తాన్ని పొందుతుంది.

ఈ అలఖా ఆ తర్వాత ముద్గాగా మారుతుంది. ముద్గా అంటే ''నమిలిన మాంసం ముద్ద''. 'అలకా' దశ తర్వాతి దశలో పిండాన్ని మనం పరిశిలిస్తే నమిలిన చూయింగ్ గమ్ లా, పళ్ల గుర్తులతో కనిపిస్తుంది.

ఇది అబ్బురపరిచే, దృశ్యాత్మక వర్ణన. 7వ శతాబ్దంలో దివ్యఖుర్ఆన్ పిండం పెరుగుదలను ఈ విధంగా వర్ణించింది. ఈ దశల్లో పిండం పెరుగుదల ఇలా ఉంటుందని 19వ శతాబ్దం తర్వాత వైద్యపరికరాలు, ఇమేజింగ్ పరికరాలు కనిపెట్టిన తర్వాత మాత్రమే నిర్ధారించగలిగారు.

దివ్యఖుర్ఆన్‌లో ప్రస్తావించిన మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, పిండం గర్భంలో మూడు పొరల చీకట్ల మధ్య భద్రంగా ఉంటుంది. దివ్యఖుర్ఆన్ 39:6లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

> ***మీ తల్లుల గర్భాలలో మూడేసి చీకటి తెరలలో మీకు ఒక రూపం తరువాత మరొక రూపాన్ని ఇస్తూపోతున్నాడు.***

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా మనకు ఇప్పుడు తెలిసిందేమిటంటే, పిండం తల్లి పొత్తికడుపు గోడలు, గర్భాశయం గోడలు, ఆమినోకోరియానిక్ పొరల మధ్య ఉంటుంది. అంటే మూడు పొరల్లోపల ఉంటుంది. దివ్యఖుర్ఆన్ ఎంత ఖచ్చితంగా వర్ణించిందో దీన్ని బట్టి తెలుస్తోంది.






**ఎడమవైపు చిత్రం "ముద్గా" దశలో పిండం. ఇది నమిలిన చూయింగ్ గమ్ లా కనిపిస్తుంది. కుడివైపున ఉన్న చిత్రం గర్భాశయం గోడకు అతుక్కుని ఉన్న పిండం. ఇది మూడు పొరల్లో భద్రంగా ఉంటుంది.**

# పర్వతాలు చేసే పని

పర్వతాలు భూమిపై చాలా అద్భుతంగా, గంభీరంగా, హుందాగా కనిపిస్తాయి. కాని, నిజానికి ఇవి భూమి పొర స్థిరంగా ఉండేలా కీలకమైన పాత్ర పోషిస్తాయి. భూమి పొర క్రింద ఉండే పదార్థం తక్కువ సాంద్రతతో ద్రవరూపంలో ఉంది. అందువల్ల భూమి పొర అంటే క్రస్ట్ స్థిరంగా ఉండాలంటే ఏదన్నా ఆధారం అవసరం. భూమి పొరను స్థిరంగా ఉంచుతున్నది పర్వతాలేనని శాస్త్రవేత్తలు కనిపెట్టారు. పర్వతాల శిఖరాలు భూమి పొరపైకి చొచ్చుకు వచ్చాయి. పర్వతాల వేళ్ళు భూమి పొర అంటే క్రస్ట్ కన్నా లోపలికి చొచ్చుకుపోయి ఉంటాయి. ఆ విధంగా పర్వతాలు మేకుల్లా పనిచేస్తున్నాయి.

అల్లాహ్ దివ్యఖుర్ఆన్ (21:31)లో ఇలా చెప్పాడు:

> ***మేము భూమిపై పర్వతాలను పటిష్ఠంగా నిలబెట్టాము, అది వాటితో దొర్లిపోకుండా ఉండాలని.***

అలాగే అధ్యాయం 78, వాక్యం 6, 7లలో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

> ***మేము భూమిని పాన్పుగా చేశాము అందులో పర్వతాలను మేకులుగా పాతాము.***

దివ్యఖుర్ఆన్ లో పర్వతాలు చేసే పని గురించి ఉన్న ఈ వాక్యాలు ఆధునిక సైన్సు కనిపెట్టిన వాస్తవాలకు పూర్తి అనుగుణంగా ఉన్న వాక్యాలు. పర్వతాలకు వేళ్ళు ఉన్నాయన్నది 1865లో మొదట సిద్ధాంతీకరించడం జరిగింది. ఆ తర్వాత 20వ శతాబ్దంలో ఈ పర్వతాల వేళ్ళు భూమిపొరకు స్థిరత్వాన్నిస్తున్నాయని కనిపెట్టారు[15].




***భూమి మాంటిల్ లోపలికి లోలోతున పర్వతాల వేళ్ళను చూపించే చిత్రం.***

# జలం జీవం

జలమే జీవానికి ఆధారం అని అందరికీ తెలుసు. అయితే, దివ్యఖుర్ఆన్ మరింత వివరంగా, లోతుగా ఈ విషయాన్ని తెలియజేసింది. ప్రతి ప్రాణి నీటితోనే సృష్టించబడిందని చెప్పింది. దివ్యఖుర్ఆన్ లో 21:30 గురించి పైన చదివాము, 25:54లో ఇలా చెప్పడం జరిగింది.

> *ఆయనే నీటితో మానవుణ్ణి సృష్టించాడు. తరువాత అతని ద్వారా (తన) వంశము, అత్తవారి వంశము అనే రెండు వేర్వేరు బంధుత్వపు క్రమాలను రూపొందించాడు. నీ ప్రభువు సర్వశక్తి సంపన్నుడు.*

జీవకణంలో 80శాతం నీటితోనే తయారైందని నేడు శాస్త్రవేత్తలందరూ ఒప్పుకుంటున్న వాస్తవం. ప్రాణులన్నింటిలోను కనీసం 50 శాతం నీరే ఉంటుంది. అంతేకాదు, ప్రాణులన్నింటి మనుగడకు నీరు చాలా అవసరం.



*జలం జీవం : ప్రపంచవ్యాప్తంగా మారుతున్న వాతావరణ పరిస్థితులు, ఫలితంగా నీటికరువు, వర్షాభావం వల్ల ప్రపంచంలోని చాలా ప్రాంతాల్లో జంతు,వృక్ష జీవం తుడిచిపెట్టుకుపోతోంది.*

ప్రజలకు ఖగోళశాస్త్రం, భౌతికశాస్త్రం, జీవశాస్త్రాల గురించి చాలా తక్కువ తెలిసిన కాలంలో, 1400 సంవత్సరాల పూర్వం అవతరించిన దివ్యఖుర్ఆన్‌లో ఉన్న అనేకానేక వైజ్ఞానిక వాస్తవాల్లో పైన చెప్పినవి కొన్ని మాత్రమే. ఈ వాక్యాలు ఆధునిక సైన్సు ఆవిష్కరణలకు పూర్తిగా అనుగుణంగా ఉన్నాయి. ఇందులో చాలా విషయాలను గత శతాబ్దకాలంలోనే, అంటే సైన్సు అభివృద్ధి చెందిన తర్వాత మాత్రమే కనిపెట్టడం జరిగింది[16].

# దివ్యఖుర్ఆన్ ప్రామాణికత

దివ్యఖుర్ఆన్ నిజంగా దైవం తరఫున ఆవిష్కరించిన గ్రంథమా? ఈ ప్రశ్న చాలా ముఖ్యమైనది, సముచితమైనది. ఎందుకంటే, నేడు ప్రపంచంలో అనేక మతగ్రంథాలున్నాయి. అందులో పరస్పర విరుద్ధాంశాలున్నాయి. అన్ని గ్రంథాలు దైవవాక్కులుగానే చెబుతారు. ఈ ప్రశ్నకు కొనసాగింపుగా మరికొందరు అడిగే మరో ప్రశ్న, శతాబ్దాలుగా దివ్యఖుర్ఆన్ మార్పు చెందకుండా ఉందని ఖచ్చితంగా ఎలా చెప్పగలం అంటారు.

ఈ ప్రశ్నలకు దివ్యఖుర్ఆన్ లోనే జవాబులున్నాయి. ఈ జవాబులు సత్యాన్ని నిర్ధారించుకోడానికి మూడు ప్రమాణాలను చెబుతున్నాయి.

## మొదటి ప్రమాణం

దైవం తరఫున అవతరించిన నిజమైన దైవగ్రంథంలో వైరుధ్యాలు ఉండవు. పూర్తిగా పొందిక ఉంటుంది. అల్లాహ్ దివ్యఖుర్ఆన్ 4:82లో ఇలా సెలవిచ్చాడు :

> *ఈ ప్రజలు ఖురానును గురించి ఆలోచన చెయ్యరా? ఇది అల్లాహ్ తరఫు నుండి కాక వేరొకరి తరఫునుండి వచ్చి ఉన్నట్లయితే ఇందులో ఎన్నో పరస్పర విరుద్ధాలైన విషయాలు ఉండేవి.*

వైరుధ్యాలు, లోపాలు, తప్పులు ఉన్న మతగ్రంథం ఏదైనా గాని అది దైవం తరఫున అవతరించింది కాదు. దివ్యఖుర్ఆన్లో ఇలాంటి వైరుధ్యాలు, లోపాలు ఏవీ లేవు. శతాబ్దాలుగా మానవుల వల్ల మార్పులు చేర్పులు కూడా జరగలేదని తెలుస్తోంది. దివ్యఖుర్ఆన్ విమర్శకులు కొందరు తరచు చూపించే వైరుధ్యాలు నిజానికి దివ్యఖుర్ఆన్ లోని అరబీ భాషకు సంబంధించిన పరిజ్ఞానం లేనందువల్ల, ఖుర్ఆన్ లోని ఆ వాక్యాలు అవతరించిన నేపథ్యం గురించిన అవగాహన లేకపోవడం వల్ల తలెత్తిన అభిప్రాయాలు.

## రెండ ప్రమాణం

నిజమైన దైవగ్రంథం మానవసామర్థ్యాన్ని మించినదై ఉంటుంది. సమగ్రంగా మానవ అవసరాలకు అనుగుణంగా రాయబడి ఉంటుంది. చట్టాలు, నైతిక ప్రమాణాలు, ఆధ్యాత్మిక మార్గదర్శనాలకు సంబంధించి మానవ అవసరాలకు అనుగుణంగా ఉండడంతో పాటు వాదనాపటిమ, హేతుబద్ధత, వాగ్ధాటి, శైలి ఇవన్నీ మానవసామర్థ్యానికి మించి ఉంటాయి. ఈ సందర్భంగా అల్లాహ్ స్వయంగా మానవాళిని సవాలు చేసాడు. ఖుర్ఆన్ మాదిరి రచన తీసుకురమ్మని దివ్యఖుర్ఆన్ 2:23,24 వాక్యాల్లో చెప్పాడు.

*మేము మా దాసునిపై అవతరింపజేసిన గ్రంథం గురించి, అది మా గ్రంథం అవునో కాదో అని మీకు సందేహం ఉన్నట్లయితే దానివంటి ఒక్క సూరానైనా మీరు రచించి తీసుకురండి. మీ సహచరులందరినీ పిలుచుకోండి. ఒక్క అల్లాహ్ తప్ప మరెవరి సహాయాన్నయినా పొందండి. మీరు సత్యవంతులే అయితే ఈ పని చేసిచూపించండి. కాని మీరు అలా చెయ్యకపోతే – నిశ్చయంగా ఎన్నటికీ చెయ్యలేరు– భయపడండి, మానవులు, రాళ్ళు ఇంధనంకాగల ఆ అగ్నికి. అది సత్యతిరస్కారుల కొరకు తయారు చెయ్యబడింది.*

అల్లాహ్ ఈ సవాలును దివ్యఖుర్ఆన్ లోని 17:88 వాక్యంలో పునరుద్ఘాటించాడు:

*ఇలా అను: "ఒకవేళ మానవులూ, జిన్నాతులూ, అందరూ కలసి ఈ ఖురాను వంటి దానిని దేనినయినా తీసుకువచ్చే ప్రయత్నం చేసినప్పటికీ తీసుకురాలేరు, వారందరూ ఒకరికొకరు సహాయకులైనప్పటికిని".*

సకలజ్ఞాన సంపన్నుడైన సృష్టికర్త మాత్రమే ఇలాంటి సవాలు చేయగలడు. మనిషి ఒక పుస్తకం రాసి, మరెవ్వరు అలాంటి పుస్తకం భవిష్యత్తులో కూడా రాయలేరని సవాలు చేయలేడు. అంతేకాదు, ఒకవేళ శతాబ్దాల కాలక్రమంలో మానవుల వల్ల దివ్యఖుర్ఆన్ మార్పు చేర్పులకు గురై ఉంటే, అలాంటి పుస్తకాన్ని రాసి తీసుకురాగలిగి ఉండేవారు. 1400 సంవత్సరాల క్రితం చేసిన ఈ సవాలు నేటికి ఎలాంటిది అలాగే ఉంది.

## మూడవ ప్రమాణం

దైవం తరపున అవతరించిన దైవవాక్కు కాలం విసిరే సవాలును తట్టుకుని నిలబడాలి. మానవ జ్ఞానానికి, ప్రగతికి, మానవ అవసరాలకు, మార్పులకు, అభివృద్ధికి అన్నింటికి ప్రాసంగికత కలిగి ఉండాలి. దివ్యఖుర్ఆన్ పేర్కొన్న శాసన న్యాయ సూత్రాలు, ఆర్థిక సూత్రాలు, సామాజిక వ్యవస్థ, నైతిక ప్రమాణాలు 1400 సంవత్సరాల క్రితం ఎంత ప్రాసంగికత కలిగి ఉన్నాయో నేడు కూడా అంతే ప్రాసంగికత కలిగి ఉన్నాయి. అంతేకాదు, విభాగం 6లో చెప్పినట్లు దివ్యఖుర్ఆన్ ఆధునిక సైన్సుకు పూర్తిగా అనుగుణమైనది.

దివ్యఖుర్ఆన్ దైవం తరపున అవతరించింది కానట్లయితే, లేదా మార్పు చేర్పులకు గురై ఉన్నట్లయితే గతించిన కాలాలతో పాటు ప్రాసంగికత కూడా కనుమరుగై ఉండేది. కాని దివ్యఖుర్ఆన్ మానవ జ్ఞానం, అవసరాలకు ఎల్లప్పుడు ప్రాసంగికత కలిగి ఉంది.

ఈ ప్రమాణాలు, వీటితో పాటు దివ్యఖుర్ఆన్‌లోని అవతరణలు, మానవ అవసరాలు, మానవ మార్గదర్శకత్వానికి సంబంధించి దీర్ఘకాలిక ప్రభావం కలిగిన ఖుర్ఆన్ వాక్యాలు, దివ్యఖుర్ఆన్ మహిమాన్వితమైనదని రుజువు చేస్తున్నాయి. ప్రవక్త ముహమ్మద్ (స) చెప్పినట్లు ఆయన ప్రదర్శించిన ఒకే ఒక్క మహత్యం దివ్యఖుర్ఆన్. నిజానికి ప్రవక్త అల్లాహ్ అనుజ్ఞతో అనేక మహత్యాలు ప్రదర్శించారు. కాని దివ్యఖుర్ఆన్ గురించి తన మహత్యమని చెప్పుకున్నారు.




**దివ్యఖుర్ఆన్ అధ్యాయం 7, వాక్యాలు 86-87 మూలలిపిలో (కుడి) తర్వాతి లిపిలో (ఎడమ) ప్రవక్త కాలంలో అరబీ లిపిలో కేవలం మౌలికమైన గుర్తులు మాత్రమే ఉండేవి. అచ్చులు, ఉచ్ఛారణ చిహ్నాలు ఏవీ ఉండేవి కావు. వీటిని అరబీ భాషలో తష్కీల్, ఈజామ్ అంటారు. ఇస్లాం ఇతర ప్రాంతాలకు, అరబ్బేతర ప్రాంతాలకు విస్తరించిన తర్వాత దివ్యఖుర్ఆన్ చదవడంలో తప్పులు, ఉచ్ఛారణ తప్పులు ముందుకు వచ్చాయి. ఈ ప్రమాదాలను నివారించడానికి అచ్చులు, ఉచ్ఛారణ చిహ్నాలు ప్రవేశపెట్టడం జరిగింది. ప్రవక్త మరణించిన ఆరుదశాబ్దాలకు లిపిని ఈ విధంగా మార్చారు.**

# ప్రవక్త సంప్రదాయాలు

ప్రవక్త సంప్రదాయాలు (సున్నాహ్ లేదా సునన్ అంటారు అరబీలో) ప్రవక్త బోధనలు, ఆయన జీవితంలోని ఉదాహరణలు. ఇవి దైవిక ప్రేరణ కలిగినవి, (దివ్యఖుర్ఆన్ 53:3). వీటిని ఆయన అనుచరులు తర్వాతి తరాలకు అందించారు. దివ్యఖుర్ఆన్‌కు వీటికి తేడా ఉంది. ఇవి వేరు. దివ్యఖుర్ఆన్ ఇస్లాములో ప్రథమ ధార్మిక వనరు, ప్రవక్త సంప్రదాయాలు ఆ తర్వాతి స్థానంలో వస్తాయి.

దివ్యఖుర్ఆన్ ప్రవక్తకు దైవం తరపున అవతరించిన దైవగ్రంథం. దివ్యఖుర్ఆన్ అప్పటికప్పుడు రాయించడం, సంకలనం చేయడం ప్రవక్త జీవితకాలంలోనే జరిగింది. కాని ప్రవక్త సంప్రదాయాలు అలా కాదు. ప్రవక్త మరణం (సామాన్యశకం 632) తర్వాత ప్రవక్త సంప్రదాయాలను సేకరించడం, సంకలనం చేయడం ప్రారంభమయ్యింది. ముఖ్యంగా 8వ శతాబ్దం మధ్యకాలం నుంచి ఈ సేకరణ చాలా శ్రద్ధగా జరిగింది. 9వ శతాబ్దంలో చాలా పెద్దస్థాయిలో జరిగింది. ఆ విధంగా మస్నద్ అర్రాబీ బిన్ హబీబ్ 8వ శతాబ్దం చివరి నాటికి సంకలనం చేశారు. 9వ శతాబ్దంలో సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లిం గ్రంథాల సంకలనం జరిగింది.

ప్రవక్త సంప్రదాయాలను అనేక తరాలకు చెందిన వారు ఒకరి నుంచి మరొకరు ఉల్లేఖించడం జరిగింది కాబట్టి, ప్రవక్త సంప్రదాయాలుగా సంకలనంలో చేర్చడానికి కఠినమైన, విస్తృతమైన ధృవీకరణ పద్ధతి పాటించారు. ఈ పద్ధతి ప్రకారం ఒక హదీసు అంటే ప్రవక్త బోధన ఎవరు ఉల్లేఖించారు, వారి తర్వాత ఎవరికి ఉల్లేఖించారనే క్రమాన్ని పరిశీలించడం, ఆయా ప్రవక్త సంప్రదాయంలో పేర్కొన్న విషయం, ఆ ప్రవక్త సంప్రదాయానికి సంబంధించిన నేపథ్యం వంటి అనేక విషయాలు పరిశీలించారు. ఈ పద్ధతి ద్వారా ప్రవక్త సంప్రదాయాలను అనేక విభాగాలుగా విభజించారు. ధృవీకరణకు సంబంధించిన ఈ పద్ధతి (అరబీలో ఇస్నాద్) నేటికి కూడా ప్రవక్త సంప్రదాయాల ప్రామాణికత ధృవీకరించడానికి పాటించడం జరుగుతుంది. మూల సంకలనంలో ఏదన్నా మార్పు లేదా చేర్పు జరిగితే ఈ పద్ధతి ద్వారా నిర్ధారిస్తారు.

ప్రవక్త సంప్రదాయాలు ఇస్లామీయ మార్గదర్శకత్వంలో, ఇస్లామీయ శాసనాల నిర్మాణంలో క్రింది పాత్ర పోషిస్తాయి :

1. దివ్యఖుర్ఆన్‌లో అవతరించిన వాక్యాల ఉద్దేశ్యాన్ని వివరిస్తాయి. దివ్యఖుర్ఆన్ వాక్యాలకు వివరణ ఇస్తాయి.
2. దివ్యఖుర్ఆన్ తర్వాత ఇస్లామీయ శాసనాల్లో రెండవ ముఖ్యమైన వనరులు ఇవి. ధర్మంలో అనుమతించబడినవి, నిషేధించబడినవి నిర్ధారించే విషయంలో ప్రవక్త సంప్రదాయాలకు దాదాపు దివ్యఖుర్ఆన్‌తో సమాన స్థాయి ఉంది.

3. దివ్యఖుర్ఆన్ ఆదేశాలను ప్రవక్త సంప్రదాయాలు బలపరుస్తాయి. ఆ విధంగా ఆయా ఆదేశాలను నిర్ధారిస్తాయి.

4. దివ్యఖుర్ఆన్ ఆదేశించిన ఆరాధనలకు సంబంధించిన ఆచరణలను వివరిస్తాయి.

5. దివ్యఖుర్ఆన్ ప్రస్తావించిన నైతిక ప్రమాణాలను జీవితంలో పాటించడానికి సంబంధించి ఉదాహరణలతో వివరిస్తాయి.

ప్రవక్త సంప్రదాయాలకు సంబంధించి మూడు ఉదాహరణలు క్రింద ఇవ్వడం జరిగింది.

> *అబూఉబైదా కథనం. ఆయనకు జాబిర్ బిన్ జైద్ చెప్పారు. ఆయనకు ఇబ్నె అబ్బాస్ (దైవం ఆయనతో ప్రసన్నుడవు గాక) చెప్పారు. ఇబ్నె అబ్బాస్ (రజి)తో ప్రవక్త ముహమ్మద్ (స) ఇలా చెప్పారు, "మోసం చేసేవారు మనలోని వారు కాదు. పిల్లల పట్ల కారుణ్యం చూపనివారు, పెద్దల పట్ల మర్యాద చూపనివారు మనలోని వారు కాదు." (ముస్నద్ అర్రాబి బిన్ హబీబ్, హదీస్ నెం. 582.)*

> *అబూ అల్ మిన్ హాల్ ఇలా అన్నారు, 'నేను అల్ బరా బిన్ ఆజిబ్, జైద్ బిన్ అర్ఖములతో నగదు మార్పిడి గురించి ప్రశ్నించాను, వారు జవాబిస్తూ 'దైవప్రవక్త (స) కాలంలో మేము వర్తకులం. ఆయన్ను మేము నగదు మార్పిడి గురించి అడిగాము. ఆయన మాకు జవాబిస్తూ 'అది ఒక చేతి నుంచి మరో చేతికి అయితే అందులో హాని లేదు, అలా కాకపోతే అనుమతి లేదు' అన్నారు". (సహీహ్ అల్ బుఖారీ, విక్రయాల పుస్తకం, హదీస్ నెం: 276)*

> *ప్రవక్త ముహమ్మద్ (స) చెప్పిన క్రింది మాటలను అబూ హురైరా తెలియజేశారు: "ఒక మహిళతో సంప్రదించకుండా ఆమెకు వివాహం చేయరాదు. కన్య నుంచి అనుమతి తీసుకోకుండా వివాహం చేయరాదు." కన్య సమ్మతి ఎలా తెలుస్తుందని అడిగితే ప్రవక్త జవాబిస్తూ 'ఆమె మౌనంగా ఉంటుంది' అన్నారు. (సహీహ్ ముస్లిం, వివాహపుస్తకం, పుస్తకం 008, నెంబరు 3303)*

శాసనాలను వివరిస్తూ, సామాజిక ఆచరణలకు మార్గదర్శకత్వాన్నిచ్చే అనేక ప్రవక్త సంప్రదాయాల్లో ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే.

# మరణానంతర జీవితం

మరణం అనివార్యం, కాబట్టి మరణానంతర జీవిత వాస్తవాన్ని ప్రతి మనిషి ఎదుర్కోవలసి ఉంటుంది. మనిషి మరణానంతర జీవితం అనే భావనను పూర్తిగా తిరస్కరించి, మరణానంతరం ఏమీ ఉండదని భావించవచ్చు. లేదా మరణానంతర జీవితాన్ని నిర్లక్ష్యం చేసి తనకు అంతా మంచి జరుగుతుందని భావించవచ్చు. కాని ఇలా చేసేవారు చాలా నష్టదాయకమైన ప్రమాదాన్ని కొని తెచ్చుకుంటున్నారు. ఎందుకంటే, మరణానంతర జీవితం అనేది శాశ్వతమైనది. అంటే చాలా తీవ్రమైన విషయం. మనిషి తెలివిగా ఆలోచిస్తే మరణానంతర జీవితాన్ని ముందుగా గుర్తించాలి. దాని కోసం ఏమైనా చేయాలి. ఇదే మతం చెప్పేది. మరణానంతరం శాశ్వత జీవితానికి చేసుకునే ఏర్పాటు.

## మరణానంతర జీవితానికి రుజువు

మతంలో విశ్వాసంతో పాటు, హేతువు, ఇంగితజ్ఞానాలను ఉపయోగించి కూడా మరణానంతర జీవితాన్ని గుర్తించవచ్చు. క్రింది వాదనలు ఒకసారి పరిశీలించండి.

**మొదటి వాదన :** దైవసృష్టిలో ఒక్క మనిషికి మాత్రమే మేధస్సు ఉంది. హేతుబద్ధంగా ఆలోచించే శక్తి ఉంది. తన ఇష్టం ప్రకారం నడుచుకునే స్వేచ్ఛ ఉంది. ఈ లక్షణాల వల్ల ఇతర సృష్టి కన్నా ఆధ్యాత్మికంగా, భౌతికంగా అధికులమయ్యే సామర్థ్యం మనకు ఉంది. ఈ కారణం వల్లనే ఆదమ్ ను సృష్టించిన తర్వాత, ఈ గొప్ప శక్తిసామర్థ్యాలను గుర్తిస్తూ ఆయనకు సాష్టాంగపడాలని దైవదూతలను అల్లాహ్ ఆజ్ఞాపించాడు[17]. అందువల్లనే, మనిషి విశ్వం లోతులను పరిశోధించాడు. ప్రపంచంలో ఏ మూల ఉన్నవారితో అయినా మాట్లాడగలుగుతున్నాడు. జన్యుపరంగా మార్చిన ఆహారాన్ని తయారు చేసుకున్నాడు. కృత్రిమ మేధస్సును సృష్టించాడు. మానవజ్ఞానం విస్తరించిన కొద్ది మరిన్ని అద్భుతాలు సాధించగలడు. ఈ గొప్ప సృష్టి, అంటే మానవుడు, ఎలాంటి ఆధ్యాత్మిక, దైవిక ప్రణాళిక లేకుండా యాధృచ్ఛికంగా తయారు చేయబడడం జరగదు కదా. అలా బతికేసి అలా చచ్చిపోవడం మాత్రమే ఉంటుందా? ఇదే దివ్యఖుర్ఆన్ మనకు చెబుతోంది:

> *వారు ఇలా అంటారు, "జీవితం అంటే కేవలం మన ఈ ప్రాపంచిక జీవితం మాత్రమే. ఇక్కడే మన మరణం, ఇక్కడే మన జీవనం. కాల పరిభ్రమణం తప్ప, మనలను ఏదీ చంపలేదు." వాస్తవంగా ఈ విషయానికి సంబంధించిన జ్ఞానమేదీ వారివద్ద లేదు. వారు కేవలం ఊహ ఆధారంగా ఈ మాటలు అంటున్నారు. (45:24)*

మరణానంతరం ఏదీ లేదని చెప్పడం ఒక ఊహ మాత్రమే.

**రెండవ వాదన :** దైవానికి సంబంధించిన జ్ఞానము, ఆయన ప్రణాళికలో పరిపూర్ణమైన ఖచ్చితత్వము విశ్వంలోని ప్రతిదానిలోను కనబడుతుంది. అయినా, మనిషి ఈ ప్రపంచంలో మరింత సంతృప్తికరమైన జీవితం కోసం ఆశిస్తూ బతుకుతుంటాడు. అంటే సమాంతరంగా మరో జీవితం మరింత మెరుగైనది కావాలనుకుంటాడు. అంటే మన ప్రాపంచిక ఉనికిలో అసమగ్రత ఉందని దీన్ని బట్టి తెలుస్తోంది. ప్రాపంచిక జీవితం ఎంత సుఖప్రదంగా ఉన్నప్పటికీ, ఎంత విలాసంగా ఉన్నప్పటికీ ఇది నిజం. మానవులు ఎల్లప్పుడు ఆదర్శవంతమైన జీవితం కోసం ఆకాంక్షిస్తారు. కాని దాన్ని ఖచ్చితంగా నిర్వచించడం కూడా చేయలేరు. అందువల్ల దాన్ని అందుకోవడం కూడా జరగదు. ఫలితంగా దుఃఖం, నిరాశ చోటు చేసుకుంటాయి. మనిషి తీవ్రంగా కాంక్షించే ఈ సమాంతర జీవితం నిజానికి మరణానంతర జీవితం. అక్కడ మాత్రమే దైవసృష్టిలోని శాశ్వత సంతృప్తి అనేది సాధ్యపడుతుంది. ఈ ప్రపంచంలో మన ఉనికి అసంపూర్ణమైనది. ఇది తాత్కాలికమైనది. మరణానంతర జీవితం కోసం మనలను తయారు చేయడానికి ఉద్దేశించినది. మరణానంతర జీవితం శాశ్వతమైనది, సమగ్రమైనది.

**మూడవ వాదన :** మనుషులు ఎంపిక స్వేచ్ఛతో సృష్టించబడ్డారు. కొందరు సన్మార్గాన ఉండవచ్చు, కొందరు దుర్మార్గాన ఉంటారు. దుర్మార్గులు తోటివారిని అనేకవిధాలుగా వేధిస్తారు. దౌర్జన్యాలు చేసి కూడా అనేక కారణాల వల్ల తప్పించుకుని తిరుగుతుంటారు. వారి అధికారం, పలుకుబడి, మానవనిర్మిత చట్టాల్లోని బలహీనతలు, న్యాయవ్యవస్థలోని అవినీతి తదితర కారణాల వల్ల వాళ్ళు తప్పించుకోవచ్చు. అలాగే మరికొందరు మహాఘోరమైన నేరాలు చేస్తారు. అలాంటి వారికి తగిన శిక్ష విధించడం మానవనిర్మిత న్యాయవ్యవస్థకు సాధ్యంకాకపోవచ్చు. ఉదాహరణకు, లక్షలాది మంది అమాయకుల మరణాలకు కారణమైన వ్యక్తికి ఎలాంటి శిక్ష విధిస్తే న్యాయం జరుగుతుంది. కాబట్టి తుదితీర్పు, శాశ్వత న్యాయం అనేది ఈ ప్రపంచంలో సాధ్యం కాదు. మరణానంతర జీవితంలోనే మనం అభిలషించే నిజమైన న్యాయం జరుగుతుంది. నిజానికి, మరణానంతర జీవితం అనేది లేకపోతే అంతకన్నా అన్యాయం మరొకటి లేదు.

**నాల్గవ వాదన :** సృష్టిలో ప్రతి ఒక్కటి జంటగా సృష్టించబడిందని దివ్యఖుర్ఆన్ తెలియజేస్తోంది. ఆడమగ, పుట్టుక, మరణం, ఆకాశం భూమి, రాత్రిపగలు మొదలైనవి జంటలే. మన ఉనికి విషయంలోను, ఇహలోకం, పరలోకం జంట. ఈ ప్రపంచంలో తాత్కాలిక ఉనికి, పరలోకంలో శాశ్వత జీవితం ఇది ఒక జంట.

**ఐదవ వాదన :** దివ్యఖుర్ఆన్ మరికొన్ని విషయాలు వివరిస్తుంది. (1) విజ్ఞానశాస్త్రానికి సంబంధించి అనేక దృష్టాంతాలు చూపిస్తుంది. (2) చారిత్రక సంఘటనలు (3) మానవనాగరికతను సమూలంగా మార్చివేసిన శాసనాలు, నైతిక ప్రమాణాలు, నేటికి కూడా బలమైన ప్రభావం వేస్తున్న శాసనాలు, నైతికత మొదలైనవాటి గురించి చెబుతుంది. ఈ వివరణలు ఏవి కూడా అసత్యాలుగా లేదా అసంబద్ధమైనవిగా ఎవరు చెప్పలేరు. దివ్యఖుర్ఆన్ వాక్యాల్లోని ఈ వాస్తవాల దృష్ట్యా, దివ్యఖుర్ఆన్ నొక్కి చెబుతున్న మరణానంతర జీవితాన్ని ఎవరైనా ఎలా ప్రశ్నించగలరు?

మరణానంతర జీవితం ఒక వాస్తవమే కాదు, ఇది ఒక అవసరం కూడా. ఈ విషయం పై వాదనల వల్ల స్పష్టంగా అర్థమవుతోంది.

## మరణం – మరణానంతర జీవితం – ఇస్లామీయ బోధనలు

మానవఆత్మ శాశ్వత ఉనికి క్రమంలో అనేక దశలను అనుభవిస్తుంది. ఈ లోకంలో మన జీవితం మరో లోకంలో మన ఉనికికి చేసుకునే ఏర్పాటు. మరణం అనేది తర్వాతి దశకు ప్రారంభం. ఈ తర్వాతి దశ, ఈ లోకంలో జీవితానికి, పరలోకంలో జీవితానికి మధ్యన ఉండే మధ్యస్థ దశ. అరబీలో దీన్ని బర్జఖ్ అంటారు. ఇది సమాధిలో గడిపే కాలం. ఈ దశలో మనిషి భౌతికలోకంతో సంబంధంలేని బర్జఖ్‌లో, పూర్తి ఆధ్యాత్మిక స్పృహతో కళ్ళు తెరుస్తాడు. ఇహలోక జీవితంలో పరలోకం కోసం ఏర్పాట్లు చేసుకున్నవారు భవిష్యత్తులో వారికి లభించే సంతృప్తి, సంతోషాల సూచనలతో ఆనందంగా, ఉల్లాసంగా ఉంటారు. కాని మరణానంతర జీవితం వాస్తవాన్ని నిరాకరించినవారు తీవ్రమైన నిరాశలో కూరుకుపోతారు. వారికి ఎదురయ్యే శిక్షల ఆలోచన వారిని తీవ్ర దుఃఖానికి గురి చేస్తుంది. దివ్యఖుర్ఆన్ ప్రకారం మరణం సంభవించిన వెంటనే దైవదూతలు ఆత్మకు వారికి ఎదురయ్యే పరిస్థితి ఏమిటో తెలియజేస్తారు.

> *అల్లాహ్ మాకు ప్రభువు అని చెప్పినవారు, ఆ విశ్వాసంపై స్థిరంగా ఉన్నవారు మరణించిన తర్వాత వారి వద్దకు దైవదూతలు వస్తారు. "భయపడకండి, బాధపడకండి మీకు వాగ్దానం చేయబడిన స్వర్గం అనే శుభవార్తను విని ఆనందించండి." అంటారు. (దివ్యఖుర్ఆన్ 41:30)*

*దైవదూతలు, హతులైన అవిశ్వాసుల ప్రాణాలను తీస్తున్నప్పటి స్థితిని నీవు గనక చూడగలిగితే ఎంత బాగుండేది! వారు వారి ముఖాలపైని, పిరుదులపైనికొడుతూ ఇలా అంటారు: "ఇదో, కాల్చే శిక్షను అనుభవించండి. ఇది స్వయంగా మీ చేతులే ముందుగా సేకరించి పెట్టినదానికి ప్రతిఫలం (దివ్యఖుర్ఆన్ 8 : 50)*

మరణానంతర జీవితంలోని మొదటి దశ సమాధిలో గడిపే బర్జఖ్ దశ. ఇహలోకంలో, ఈ భూమిపై జీవితంలో మనం తీసుకున్న నిర్ణయాల పర్యావసానాల సూచనలు ఇక్కడే లభిస్తాయి. ఈ విషయమై ప్రవక్త (స) చెప్పిన మాటలు, "మరణానంతర జీవితంలో మొదటి దశ సమాధి. ఈ దశను మనిషి సురక్షితంగా దాటగలిగితే, తర్వాత వచ్చేది తేలికగా ఉంటుంది. కాని ఈ దశలో విఫలమైతే, దీని తర్వాత వచ్చే దశ మరింత కఠినంగా ఉంటుంది."

సమాధిదశలో ఆత్మలు కాలం ముగిసేవరకు అంటే ప్రళయం వచ్చే వరకు ఉంటాయి. అప్పుడు ఈ భౌతికంగా కనిపిస్తున్న సృష్టి యావత్తు మరో ఉనికిలోకి మారిపోతుంది. కొత్త ప్రపంచం. ఈ సంఘటనను దివ్యఖుర్ఆన్ స్పష్టంగా వర్ణించింది. ఉదాహరణకు 22:1–2 వాక్యాల్లో చూడండి.

*మానవులారా! మీ ప్రభువు ఆగ్రహం నుండి మిమ్మల్ని మీరు రక్షించుకోండి. యదార్థం ఏమిటంటే, ప్రళయం నాటి భూకంపం మహా (భయంకరమైన) విషయం. దానిని మీరు చూచినప్పుడు దాని స్థితి ఎలా ఉంటుందంటే పాలు పట్టే ప్రతి స్త్రీ పాలు త్రాగే తన పాపను మరచిపోతుంది, ప్రతి గర్భిణి యొక్క గర్భం పడిపోతుంది, ప్రజలు మీకు మత్తులో ఉన్నట్లు కనిపిస్తారు, వాస్తవానికి వారు త్రాగి ఉండరు. కాని అల్లాహ్ శిక్షయే అంత తీవ్రంగా ఉంటుంది.*

కఠినమైన రోజున, మరో అవకాశం ఇచ్చి తమను భూమిపైకి పంపించాలని వారు మొరపెట్టుకుంటారు. తాము ఈ సారి సన్మార్గాన్ని పాటిస్తామని అంటారు. విశ్వాసులకు ఆ రోజున భయపడేది ఏదీ ఉండదు[18].

ఆ తర్వాత యావత్తు మానవాళిని తుది తీర్పు కోసం సమావేశపరచడం జరుగుతుంది. ఇది తీర్పుదినం. ఈ తీర్పుదినాన్ని దివ్యఖుర్ఆన్ అనేక విధాలుగా వర్ణించింది. దుఃఖదినం (19:39), సాఫల్యదినం (32:29), విపత్తుల దినం (76:10), బరువైన దినం (76:27), మహాదినం (19:37), లెక్కలదినం (38:16, 40:27) ఇలా అనేక విధాలుగా వర్ణించింది. తీర్పుదినం నాడు మన ఆధ్యాత్మిక విలువను మన ప్రభువు నిర్ణయిస్తాడు. సన్మార్గంపై నడిచిన వారికి ఈ రోజు చాలా సంతోషకరమైన రోజు. దైవాన్ని, తీర్పుదినాన్ని నిరాకరించినవారికి ఇది చాలా బాధాకరమైన రోజు. ఈ రెండు పరిస్థితులను దివ్యఖుర్ఆన్ ఇలా తెలియజేసింది.

> *ఓ మానవుడా! నీవు భారంగా, బలవంతంగా నీ ప్రభువు వైపునకు వెళుతున్నావు, ఆయనను కలుసుకోబోతున్నావు. ఆ తరువాత, కర్మల పత్రం కుడిచేతికి ఇవ్వబడిన వ్యక్తినుండి తేలికపాటి లెక్క తీసుకోబడుతుంది. అప్పుడు అతను తెగ సంతోషపడుతూ తన వారి వైపునకు మరలిపోతాడు. ఇక కర్మల పత్రం వీపు వెనుకనుండి ఇవ్వబడే వ్యక్తి మాత్రం చావును పిలుస్తూ మండుతున్న అగ్నిలోకి పోయి పడతాడు. అతడు తన కుటుంబ సభ్యుల మధ్య సుఖసంతోషాలలో మునిగి ఉండేవాడు. తాను ఎన్నడూ (తన ప్రభువు వైపునకు) మరలిపోనని అతడు భావించేవాడు. (84 : 6-14)*

మరణానంతర జీవితంలో సన్మార్గంపై నడుచుకున్నవారు కలుసుకుంటారని, తమ కుటుంబాల్లోను, తమకు సన్నిహితుల్లోను సన్మార్గంపై ఉన్నవారిని తిరిగి కలుస్తారని ఇస్లాం తెలియజేస్తోంది [19]. మన తల్లిదండ్రులను, మన సోదరులను, సోదరీమణులను, మన పిల్లలను, మిత్రులను స్వర్గంలో కలుసుకోవడం ఎంత అపరిమితమైన ఆనందాన్నిస్తుందో ఒక్కసారి ఆలోచించండి. కాని దుర్మార్గులకు ఇది చాలా బాధాకరమైన పరిస్థితిగా ఉంటుంది. అసలు తాము పుట్టకుండా ఉంటే బాగుండేదని వారు అనుకుంటారు.

> *సమీపంలోనేఉన్నశిక్షను గురించి మేము మిమ్మల్ని హెచ్చరించాము. ఆ రోజున మనిషి తన చేజేతులాచేసుకుని ముందుకు పంపుకున్నదంతా ప్రత్యక్షంగాచూస్తాడు. (అప్పుడు) సత్యతిరస్కారి "అయ్యో! నేను మట్టినై ఉంటే ఎంతబాగుండేది" అని గగ్గోలుపెడతాడు. (దివ్యఖుర్ఆన్ 78 :40)*



ఒమ్మాన్ లోని సుల్తాన్ ఖబూస్ గ్రాండ్ మస్జిదు వద్ద తివాచీ

# ఇతర మతాల గురించి ఇస్లాం

మానవులు సహజంగానే దేవుని గుర్తించే ప్రవృత్తితో పుట్టించబడ్డారు. మనిషిలో అంతర్గతంగా మౌలికమైన నైతిక ప్రమాణాలు ఉంటాయి. దీన్ని అరబీ భాషలో ఫిత్రత్ అంటారు. మానవాళి చరిత్రలో దైవం వరుసగా ప్రవక్తలను అన్ని జాతుల వద్దకు వరుసగా పంపుతూ వచ్చాడు. మనిషిలో ఉన్న ఈ సహజప్రవృత్తిని మేల్కొలిపే ప్రయత్నం చేశారు ప్రవక్తలు. వివిధ ప్రవక్తలు తీసుకువచ్చిన సామాజిక చట్టాలు, ఆరాధనారీతులు వేరయినప్పటికీ, ఈ ప్రవక్తలందరూ ప్రచారం చేసిన దైవసందేశం మౌలిక విశ్వాసం విషయంలో ఒక్కటే సందేశం. అంటే దైవం ఒక్కడే, మరణానంతర జీవితాన్ని విశ్వసించడం, సన్మార్గాన నడవడం[20]. దివ్యఖుర్‌ఆన్ 42:13లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

> ***ఆయన నూహ్ ప్రవక్తకు ఆజ్ఞాపించిన ధర్మాన్నే నీకు కూడా నిర్ణయించాడు. దానినే (ముహమ్మద్ (స) ఇప్పుడు నీవైపునకు మేము వహీద్వారా పంపాము దానినే మేము ఇబ్రాహీమ్‌కు, మూసాకు, ఈసాకు బోధించాము ఈ ధర్మాన్ని స్థాపించండి అనీ, దానిని గురించి విభేదాలకు లోనుకాకండి అనీ తాకీదు చేస్తూ. ఈ విషయమే ఈ బహుదైవారాధకులకు ఎంతో అసహనం కలిగించింది. దానివైపునకే (ముహమ్మద్ (స) నీవు వారిని ఆహ్వానిస్తున్నావు. అల్లాహ్ తానుకోరినవారిని తన వారుగా చేసుకుంటాడు. ఆయన తన వైపునకు మరలేవారికి మాత్రమే తనవైపున కువచ్చేమార్గాన్నిచూపుతాడు.***

కాలక్రమేణ అసలు దైవసందేశం నుంచి పక్కకు తొలగడం వల్ల మతంలోను, విశ్వాసంలోను మార్పులు చేర్పులు చోటు చేసుకున్నాయి. అల్లాహ్ దివ్యఖుర్‌ఆన్లో మానవాళిని మౌలికమైన ఇబ్రాహీం విశ్వాసానికి తిరిగి రావాలని పిలుపునిచ్చాడు. ఇబ్రాహీం ప్రవక్త విశ్వాసం విషయంలో నిజమైన ఏకదైవారాధకులు. మానవచరిత్రలో తర్వాత వచ్చిన అనేకమంది ప్రవక్తలకు ఆయన పూర్వికుడు. కాబట్టి ఇస్లామీయ దృక్కోణంలో విభిన్న మతాలు ముఖ్యంగా రెండు తరగతులు.

## 1. ఏకదైవారాధక మతాలు

యూదమతం, క్రయిస్తవం, ఇస్లాం మతాలు ఒకేవిధమైన ఏకదైవారాధక సంప్రదాయాలు కలిగి ఉన్నాయి. స్వచ్ఛమైన రూపాల్లో ఈ మతాలను పరిశీలిస్తే ఇవి ప్రవక్త ఇబ్రాహీం (ఆయనపై శాంతి కురియుగాక) సంప్రదాయాలను పాటించే మతాలు. ఈ మూడు మతాలు విశ్వాసానికి, మతానికి సంబంధించి ఒకేమాదిరి మౌలికమైన సూత్రాలు కలిగి ఉన్నాయి.

యూదులను, క్రయిస్తవులను దివ్యఖుర్ఆన్ అనేక వాక్యాల్లో "గ్రంథప్రజలు"గా అని పిలిచింది[21]. అంటే, దైవిక గ్రంథాలు కలిగి ఉన్న ప్రజలని అర్థం. ఈ దైవగ్రంథాలు ఏవంటే, తౌరాత్, ఇంజీల్ (గోస్పెల్) గ్రంథాలు. అయితే ఈ రెండు గ్రంథాలు మూల రూపంలో లేవు. మూసా, ఈసా ప్రవక్తలు తీసుకువచ్చిన స్వచ్ఛమైన సందేశాలు ఈ గ్రంథాల్లో మార్పులు చేర్పులకు గురయ్యాయి[22]. అందువల్ల ఇస్లాం ఈ రెండు మతాలు ఇప్పుడు మూసా, ఈసా ప్రవక్తల బోధనలకు అనుగుణంగా ఉన్నాయని భావించడం లేదు.

మూసా, ఈసా ప్రవక్తలు (వారిపై శాంతి కురియుగాక) తీసుకువచ్చిన దైవగ్రంథాలను ధృవీకరించడానికి మాత్రమే దివ్యఖుర్ఆన్ అవతరించలేదు, ఈ గ్రంథాల్లో చోటు చేసుకున్న మార్పులు చేర్పుల నేపథ్యంలో అసలైన దైవసందేశాన్ని అందించడానికి వచ్చింది[23]. అందువల్ల, ఇస్లాం ప్రకారం, మూసా, ఈసా ప్రవక్తలకు నిజమైన అనుయాయులు దివ్యఖుర్ఆన్‌ను అనుసరించేవారే.

## 2. ఇతర మతాలు

యూద, క్రయిస్తవ మతాలు కాక ఇతర మతాలకు సంబంధించి, అంటే హిందూ, బౌద్ధ తదితర మతాలకు సంబంధించి, ఈ మతాలు ప్రవక్తల సందేశాలకు దూరంగా ఉన్న మతాలుగా ఇస్లాం భావిస్తుంది. అందువల్ల ఇబ్రాహీం ప్రవక్త సంప్రదాయాలతో సంబంధమున్న మతాలు కావు. ఇందులో కొన్ని మతాలు నాస్తికత్వం వైపునకు మొగ్గు చూపిస్తాయి. ఇతర మతాలు ఒకే ఒక్క నిజమైన దైవాన్ని ఆరాధించే మార్గాన్ని పూర్తిగా వదిలేస్తాయి. ఒకే దైవానికి భాగస్వాములుగా అనేకమంది దేవుళ్ళను నిలబెట్టడం జరుగుతుంది. ఇది ఒకే దేవుడనే మౌలికమైన విశ్వాసానికి పూర్తి విరుద్ధమైన విషయం (చూడండి విభాగం 3).

ఈ విభేదాలు ఉన్నప్పటికీ, ఇస్లాం అన్ని మతాలను గౌరవిస్తుంది. ఈ మతావలంబీకులందరినీ గౌరవిస్తుంది. ఎందుకంటే, మానవాళిని సృష్టించిన దైవం ఒక్కడే. ఆయన మతం విషయంలో మనిషికి పూర్తి స్వేచ్ఛ ఇచ్చాడు. దివ్యఖుర్ఆన్ 10:99లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు;

> *నీ ప్రభువు అభీష్టం గనక ఇదే అయితే (అంటే భూమిపై ఉండేవారంతా విశ్వాసులూ, విధేయులూ అవ్వాలి అనేది) సమస్తభూవాసులూ విశ్వసించి ఉండేవారే. అలాంటప్పుడు నీవు ప్రజలను విశ్వాసులుగా మారండి అని బలవంతం చేస్తావా?*

ఇదే విషయాన్ని మరో చోట, 2:256లో చెప్పడం జరిగింది.

*ధర్మం విషయంలో నిర్బంధంకానీ, బలాత్కారంకానీ లేవు.*

కాబట్టి మతాల వైవిధ్యం అన్నది అల్లాహ్ సృష్టిలోనే ఉన్నది[24]. ఈ విషయాన్ని గుర్తించడం వల్ల, ముస్లిములు చరిత్రలో ఇతర మతాల ప్రజలతో శాంతియుతంగా, ప్రేమాభిమానాలు, సౌహార్దభావాలతో కలిసిమెలిసి జీవించారు. ఇస్లాం మానవ గౌరవమర్యాదలను కాపాడుతుంది. మనుషులంతా ఒక్కటే, మతస్వేచ్ఛల పునాదులపై నైతిక విలువలను అమలు చేస్తుంది.



**ఏటా మక్కా యాత్రకు 30 లక్షల కన్నా ఎక్కువ మంది వెళుతుంటారు. అన్ని దేశాలు, జాతులకు చెందిన ప్రజలు ఒకే ఒక్క దైవం అల్లాహ్‌ను ఆరాధించడానికి మక్కా నగరానికి చేరుకుంటారు. మనుషులంతా ఒక్కటే, మతం ఒక్కటే, దైవం ఒక్కటే అని చాటి చెప్పే ఆచరణాత్మకమైన సన్నివేశం ఇది.**

# ఇస్లాంలో ఏసుక్రీస్తు

ఇస్లామీయ విశ్వాసాల్లో ఒక ముఖ్యమైన సూత్రమేమిటంటే, అల్లాహ్ పంపిన ప్రవక్తలందరినీ ముస్లిములు విశ్వసించాలి. ఏసుక్రీస్తు (ఆయనపై అల్లాహ్ శాంతికురియుగాక) అల్లాహ్ పంపిన గొప్ప ప్రవక్తలలో ఒకరు.

ఏసుక్రీస్తు జీవితం, ఆయన బోధనలు, బైబిల్లో ఉన్నవి ఆయన స్వర్గస్థులైన చాలా దశాబ్దాల తర్వాత రాయబడ్డాయి. కాబట్టి అవి ఒకవిధమైన మిస్టరీలో ఉన్నాయి. దివ్యఖుర్ఆన్ లో ఏసుక్రీస్తును గురించి 25 సార్లు ప్రస్తావించడం జరిగింది. ఈ మిస్టరీని వివరించడానికి, ఏసుక్రీస్తు వ్యక్తిత్వం, బోధనల చుట్టు అల్లుకుని ఉన్న అనేక మూఢనమ్మకాలను తొలగించడానికి, ఆయనకు, ఆయన మాతృమూర్తికి ఆపాదించిన అబద్ధాలను తొలగించడానికి, ఆయన్ను, ఆయన మాతృమూర్తిని (అల్లాహ్ వారి పట్ల ప్రసన్నుడవుగాక) నిజమైన అల్లాహ్ దాసులుగా గౌరవించడానికి దివ్యఖుర్ఆన్ ప్రయత్నించింది. దివ్యఖుర్ఆన్ ఈ విషయమై చేసే బోధన :

1. ఏసుక్రీస్తు (ఆయనపై శాంతి కురియుగాక) కన్య మేరీకి దైవమహత్యం వల్ల జన్మించారు. అందువల్ల, ఆయనకు తండ్రి లేరు. అందువల్ల ఆయనకు తండ్రితరపు వంశవృక్షం లేదు. కేవలం తల్లికి సంబంధించిన గౌరవోన్నతులు గల వంశవృక్షం మాత్రమే ఉంది. ఎందుకంటే కన్యమేరీ ప్రవక్తల కుటుంబం నుంచి వచ్చారు. ఆయన దైవమహత్యం వల్ల జన్మించినప్పటికీ, ఆయన కూడా ఒక మనిషి. దివ్యఖుర్ఆన్ ఈ విషయమై స్పష్టంగా తెలియజేసింది. ఆయన తాను కూడా ఒక మనిషిని మాత్రమే అన్నారు. అల్లాహ్ తనను ఒక ప్రవక్తగా నియమించారని తెలియజేశారు[25]. ఉధారణకు దివ్యఖుర్ఆన్ 5:116-117 లో అల్లాహ్ తీర్పుదినం నాటి దృశ్యాన్ని ఇలా వర్ణించాడు.

> *అల్లాహ్, "మర్యమ్ కుమారుడవైన ఈసా! నీవు మనుజ జాతితో, అల్లాహ్ ను కాదని నన్నూ, నా తల్లిని దేవుళ్ళుగా భావించండి అని బోధించావా?" అని అడిగినపుడు అతను ఇలా మనవి చేసుకుంటాడు : "నీవు అత్యంత పవిత్రుడవు! ఏ మాటను అనే హక్కు నాకు లేదో ఆ మాటను అనటం నాకు యుక్తమైన పనికాదు. ఒకవేళ నేను ఆవిధంగా అని ఉంటే, అది నీకు తప్పకుండా తెలిసివుండేది. నా మనస్సులో ఏముందో నీకు తెలుసు. నీ మనస్సులో ఏముందో నాకు తెలియదు. నీవు గుప్తంగా ఉన్న యథార్థాలన్నీ తెలిసిన మహాజ్ఞానివి. నీవు ఆదేశించిన దానిని తప్ప దేనినీ నేను వారికి*

*చెప్పలేదు. అది ఏమిటంటే అల్లాహ్ ను ఆరాధించండి. ఆయన నాకూ ప్రభువే, మీకూ ప్రభువే. నేను వారిమధ్య ఉన్నంత కాలంవరకే నేను వారిని కనిపెట్టి ఉన్నాను. నీవు నన్ను తిరిగి పిలుచుకున్న తరువాత నీవే వారిని కనిపెట్టి ఉంటున్నావు. నీవు సర్వ విషయాలను కనిపెట్టి ఉండేవాడవు.*

బైబిల్లోనే ఏసుక్రీస్తు (ఆయనపై శాంతి కురియుగాక) ఎంతో నమ్రతగా దైవం పట్ల తన దాస్యభావాన్ని ప్రకటించిన ఆధారాలున్నాయి. ఆయనెప్పుడు దైవత్వాన్ని ప్రకటించలేదు[26].

2. ఆయన మీసయ్య (క్రీస్తు), అంటే ఆయన ప్రవక్తగా అల్లాహ్ ద్వారా నియమించబడ్డారు[27].

3. ఆయన అనేక మహత్యాలు చేసి ప్రదర్శించారు. అవన్నీ ఆయన అల్లాహ్ అనుమతితోనే ప్రదర్శించారు. మొదటి మహత్యం ఆయన శిశువుగా ఉన్నప్పుడే మాట్లాడి తన తల్లికి సాక్ష్యం పలికారు. కన్యగా బిడ్డకు జన్మనిచ్చినందుకు మేరీమాతపై ఆరోపణలు వచ్చినప్పుడు శిశువుగానే మాట్లాడి జవాబిచ్చారు. ఆ తర్వాత తన జీవితకాలంలో అనేక మహత్యాలు ప్రదర్శించారు. అవన్నీ అల్లాహ్ అనుమతితోనే ఆయన చేశారు. ఉదాహరణకు చనిపోయిన వారికి ప్రాణం పోయడం, గ్రుడ్డివారిని, కుష్టురోగులను బాగు చేయడం వంటివి [28].

4. ఆయన గోస్పెల్ లేదా ఇవాంజిల్ (అరబీలో ఇంజీల్)[29] తీసుకుని వచ్చారు. ఉదాహరణకు దివ్యఖుర్ఆన్ 5:46లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

   *ఈ ప్రవక్తల తరువాత మేము మర్యమ్ కుమారుడైన ఈసాను పంపాము. ఆయన తన కాలంలో ఉన్నటువంటి తౌరాతు గ్రంథంలోని విషయాన్ని ధ్రువీకరించేవాడు. మేము ఆయనకు ఇంజీలును ప్రసాదించాము. అందులో మార్గదర్శకత్వమూ, జ్యోతీ ఉండేవి. అది కూడా ఆ కాలంలో ఉన్న తౌరాతులోని దానిని ధ్రువీకరించేది. అల్లాహ్ యందు భక్తిశ్రద్ధలు కలవారికి అది మార్గదర్శకం.*

5. ఆయన కేవలం ఇస్రాయీల్ సంతతి వారి వద్దకు మాత్రమే పంపబడ్డారు. మిగిలిన జాతుల వారి కోసం కాదు. దివ్యఖుర్ఆన్ 3:49లో అల్లాహ్ ఇలా తెలియజేశాడు:

   *"అతనిని ఇస్రాయీలు సంతతి వద్దకు తన ప్రవక్తగా పంపుతాడు."*

ఏసు (ఆయనపై శాంతి కురియుగాక) కేవలం ఇస్రాయీల్ సంతతి వారి కోసం

మాత్రమే పంపబడ్డారన్న వాస్తవం నేడు కూడా బైబిల్లో, అన్ని వర్షన్ల బైబిళ్ళలోను కనిపిస్తుంది[30].

6. ఆయన హత్యకు గురికాలేదు, ఆయన్ను శిలువ వేయడమూ జరగలేదు. అల్లాహ్ దివ్యఖుర్ఆన్ 4:157-158 లో ఇలా తెలియజేశాడు

> ***"మేము మసీహ్, మర్యమ్ కుమారుడైన ఈసా అనే దైవప్రవక్తను చంపాము" అని అన్నారు – వాస్తవానికి వారు ఆయనను చంపనూలేదు, శిలువపైకి ఎక్కించనూ లేదు. కాని ఆ విషయంలో వారు భ్రమకు గురిచెయ్యబడ్డారు. ఈ విషయం గురించి అభిప్రాయభేదం వ్యక్తం చేసిన వారు కూడా సందేహానికి లోనయ్యారు. దీనిని గురించి వారికి అసలు ఏమీ తెలియదు. వారు కేవలం ఊహనే అనుసరిస్తున్నారు. వారు అతనిని నిశ్చయంగా చంపలేదు. కాని అల్లాహ్ ఆయనను తన వైపునకు లేపుకున్నాడు. అల్లాహ్ అద్భుత శక్తి సంపన్నుడు, అత్యంత వివేకవంతుడు.***

ఏసు (ఆయనపై శాంతి కురియుగాక)ను శిలువ వేయాలని శత్రువులు కుట్రపన్నారు. కాని అల్లాహ్ తన ప్రవక్తకు పరాభవం జరగనివ్వలేదు. తన ప్రవక్తను ఆయన కాపాడాడు, రక్షించాడు.



**జెరుసలేంలోని అల్ అక్సా మస్జిదు, ఇస్లాంలో మూడవ పవిత్రమైన మస్జిదు. దివ్యఖుర్ఆన్ (17:1, 53:13-18)లో ఈ విషయం స్పష్టంగా ఉంది. ప్రవక్త ముహమ్మద్ (స) ఈ మస్జిదు నుంచే సామాన్యశకం 621లో గగనారోహణ (మేరాజ్ యాత్ర) చేశారు.**

# ఇస్లాం మాత్రమే ఎందుకు? ఇతర మతాలు ఎందుకు్కాదు?

మనుషుల్లో మంచిని, సౌహార్దతను, ప్రేమను ప్రోత్సహించే మతమేదైనా సరే దైవం వద్దకు దైవత్వం వద్దకు తీసుకువెళుతుందని, కాబట్టి అలాంటి ఏ మతమైనా ఒక్కటే అని చాలా మంది భావించే అపోహ ఒకటి ఉంది. మరోవిధంగా చెప్పాలంటే, అన్ని మతాలు మౌలికంగా మంచివే. అన్ని ఒక్కటే, సమానమైనవే, కాబట్టి మనిషి ఏదో ఒక ప్రత్యేకమైన మతాన్ని అవలంబించవలసిన అవసరం లేదు. ఈ ఆలోచనాసరళిలో లోపం ఉంది. దీనికి రెండు కారణాలున్నాయి.

**మొదటి కారణం :** మతం అనేది సృష్టికర్త అల్లాహ్ పట్ల మన శ్రద్ధ నిబద్ధతలకు సంబంధించింది. మనం దైవంతో ఎలాంటి సంబంధం కలిగి ఉన్నామన్నదే మతం. ఎలా మనం దైవాన్ని ఆరాధిస్తున్నాం, భూమిపై మన జీవితాలను దైవాభీష్టం మేరకు ఎలా గడుపుతున్నాం అన్నదే మతం. ఈ ప్రశ్నలన్నింటికి జవాబు సృష్టికర్త నుంచి వచ్చాయి. కాబట్టి నిజమైన, సత్యమైన మతం సృష్టికర్త చెప్పింది మాత్రమే.

**రెండవ కారణం :** ఇప్పుడు ఉన్న సమస్త మతాలు సత్యమైన మతాలని చెప్పడం, సృష్టికర్త పంపిన నిజమైన మతాలని చెప్పడం సరయిన విషయం కాదు. ఎందుకంటే ఈ మతాల మధ్య సైద్ధాంతికంగా, ఆచరణాత్మకమైన పెద్ద పెద్ద విభేదాలున్నాయి. ఉదాహరణకు, చాలా మతాలు, ఇప్పుడు ఆయా మతానుయాయులు అవలంబిస్తున్న తీరును పరిశీలిస్తే సృష్టికర్త ఒక్కడే (ఏకదైవారాధన) అనే విశ్వాసాన్ని అంగీకరించవు. అలాగే సాఫల్యానికి సంబంధించి విభిన్న మతాల మధ్య చాలా విభేదాలున్నాయి. అలాగే చట్టబద్ధమైన ఆచరణలు, నిషేధాల విషయంలోను మతాల మధ్య చాలా తేడాలున్నాయి.

సృష్టికర్త నిస్సందేహంగా పరస్పర విరుద్ధ విషయాలు చెప్పడం జరగదు. కాబట్టి ఆయన పంపిన ధర్మం యావత్తు మానవాళికి ఒకేతీరులో ఉంటుంది. మౌలిక విశ్వాసాలు, ఆచరణలన్నీ ఒకేలా ఉంటాయి. మనిషి జ్ఞానం, హేతువు ఉపయోగించి సత్యాన్ని గ్రహించవలసి ఉంటుంది. అన్ని మతాలు మంచివే, కాబట్టి అన్ని మతాలు సృష్టికర్త ఆమోదించినవే అనే అపోహలో ఉండరాదు. సృష్టికర్త ఆమోదించే ఒకే ఒక్క మతం ఆయన పంపిన మతం.

ఇస్లాం మూలమతమని కూడా చెప్పడం జరగలేదు. మానవాళి గత తరాలన్నింటి వద్దకు పంపబడిన మతం ఇది ఒక్కటే. చరిత్ర కాలగతిన, ప్రవక్తలు తీసుకువచ్చిన మూల

సందేశం నుంచి కాలక్రమేణా మనుషులు దూరం కావడం వల్ల మతాల్లో అనేక తేడాలు వచ్చాయి. చిట్టచివరి ప్రవక్త ముహమ్మద్ (స), చిట్టచివరి సందేశం దివ్యఖుర్ఆన్ మనుషులను ఆ మూలసందేశం వైపు మార్గదర్శనం చేయడానికి వచ్చింది. అందువల్ల, సృష్టికర్త ఆమోదించే ఒకేఒక్క మతం, ఈ చిట్టచివరి సందేశాన్ని ధృవీకరించే మతం మాత్రమే. అది ఇస్లాం. అంటే అర్థం దైవాభిష్టానికి పూర్తిగా విధేయత చూపించడం. అల్లాహ్ ఈ విషయమై దివ్యఖుర్ఆన్ 3:85లో ఇలా వివరించాడు :

> ***ఎవడైనా ఈ విధేయతా విధానాన్ని (ఇస్లామ్) కాక మరొక విధానాన్ని అవలంబించదలిస్తే, ఆ మార్గం ఎంతమాత్రం ఆమోదించబడదు. అతడు పరలోకంలో విఫలుడౌతాడు, నష్టపోతాడు.***

దైవ ప్రవక్తలందరూ తీసుకువచ్చిన మతం ఇస్లాం. ఈ ప్రవక్తలు చిట్టచివరి ప్రవక్త ముహమ్మద్ (స) కన్నా ముందు వచ్చారు. ఇబ్రాహీం (అబ్రహం), మూసా, ఈసా (వారందరిపై శాంతి కురియుగాక) ప్రవక్తలందరూ తీసుకువచ్చిన సందేశం ఇదే. ఎందుకంటే వారంతా సృష్టికర్తకు దాసులుగా, దైవాభిష్టానికి పూర్తి విధేయత చూపించారు. గత ప్రవక్తలను నిజాయితిగా అనుసరించే, తమ తమ ప్రవక్తల నిజమైన బోధనలను పాటించేవారందరి మతం ఇస్లాం.



# నాస్తికత్వం సంశయవాదాల ఖండన

నాస్తికత్వం అంటే మానవాతీతశక్తి (దైవం) ఉందన్న అస్తిత్వాన్ని నిరాకరించడం. అంటే మరణానంతర జీవితాన్ని తిరస్కరించడం. అలాగే సంశయవాదం అంటే మానవాతీత శక్తి (దైవం) ఉనికి పట్ల సంశయం కలిగి ఉండడం. నాస్తికత్వం, సంశయవాదాల్లోని తిరస్కారం, సంశయాలకు అనేక కారణాలున్నాయి. పాతకాలంలో అయితే, దైవం ఉనికిని చూడడం, గ్రహించడం సాధ్యం కాకపోవడం ఒక కారణం. అలాగే మానవకష్టాలు కూడా ఒక కారణం. దైవమే ఉంటే ఈ కష్టాలెందుకు అనే ప్రశ్న వచ్చేది. ఇక ఆధునిక కాలంలో ఈ వాదాలకు కారణాలు మరింత విస్తరించాయి. వైజ్ఞానికంగా దైవం ఉనికిని ఎందుకు నిరూపించలేము? సృష్టిలోని అనేక దృష్టాంతాలను మనం వైజ్ఞానికంగా వివరించగలిగినప్పుడు దైవం ఉనికికి ఎలాంటి భూమిక లేదనే వాదనలు మొదలైనవి వీటికి కారణాలు.

ఈ తిరస్కారం, సంశయాలకు ఇస్లాం జవాబిస్తుంది. మానవ మనస్సాక్షిని, బుద్ధి, వివేక, హేతువులను నిలదీయడం ద్వారా దైవం ఉనికిని తెలియజేస్తుంది. సృష్టికర్త, సృష్టి ఇవి రెండు వేర్వేరు. రెండింటి స్వభావాలు వేర్వేరు. అందువల్ల మానవులకు దైవాన్ని చూసే శక్తి లేదు. అంతేకాదు, దైవానికి భౌతికరూపం ఉన్నట్లయితే, మనం చూడగలిగిన రూపం ఉన్నట్లయితే, అప్పుడు దైవం స్థలకాలాల పరిధికి లోబడి ఉంటాడు. ఇది చాలా పెద్ద అసంబద్ధత. ఎందుకంటే, స్థలం, కాలం, ద్రవ్యం సృష్టించబడ్డాయి. కాబట్టి ఈ పరిధిలో సృష్టికర్తను పరిమితం చేయడం సాధ్యం కాదు. దీనికి బదులు దివ్యఖుర్‌ఆన్ మానవులు బౌద్ధికంగా సృష్టిని పరిశీలించాలని ప్రోత్సహిస్తుంది. సృష్టిని పరిశీలించడం ద్వారా మనిషి సృష్టికర్తను అర్థం చేసుకోగలడు. దివ్యఖుర్‌ఆన్‌లో దైవం ఉనికికి సంబంధించిన నిదర్శనాలను 'చిహ్నాలు'గా పేర్కొంది. (అరబీలో వాటిని ఆయాత్ అంటారు). దివ్యఖుర్‌ఆన్‌లో ఇలాంటి చిహ్నాలు వందలాది ఉన్నాయి. అధ్యాయం 41, వాక్యం 53లో అల్లాహ్ ఇలా తెలియజేశాడు :

> *మేము త్వరలోనే వారికి మా సూచనలను వారి చుట్టూ ఉన్న ప్రపంచంలోనూ చూపిస్తాము, వారిలోనూ చూపిస్తాము. చివరకు ఈ ఖురాన్ నిస్సందేహంగా సత్యమైనదని వారికి విశదమైపోతుంది. నీ ప్రభువు ప్రతిదానికి సాక్షి అనే విషయం సరిపోదా?*

ఈ విధంగా, దైవసృష్టిని పరిశీలించడం ద్వారా దైవం ఉనికికి సంబంధించిన అనేక నిదర్శనాల గురించి యోచించాలని దివ్యఖుర్‌ఆన్ మానవాళిని ప్రోత్సహిస్తుంది. ఉదాహరణకు, దివ్యఖుర్‌ఆన్ 3:190లో అల్లాహ్ ఇలా తెలియజేశాడు :

*భూమీ, ఆకాశాల సృష్టిలో రేయింబవళ్ళు ఒకదాని తరువాత ఒకటి రావడంలో, నిలుచున్నా, కూర్చున్నా, పరుండినా అన్నివేళలా అల్లాహ్ ను స్మరించే వారున్నూ, భూమీ, ఆకాశాల నిర్మాణం గురించి చింతన చేసేవారున్నూ అయిన వివేకవంతులకు ఎన్నో సూచనలు ఉన్నాయి.*

నిజానికి ఆకాశాలు, భూమి సృష్టిలో శాస్త్రవేత్తలు అనేక అబ్బురపరిచే వాస్తవాలు కనుగొన్నారు. ఉదాహరణకు, (1) ఈ విశ్వానికి ఒక ప్రారంభం ఉంది, అంటే ఇది శూన్యం నుంచి ప్రారంభమయ్యింది. (2) ఖచ్చితమైన, పరస్పరాధారిత భౌతిక నియమాలు, ప్రక్రియల ద్వారా విశ్వం పరిణామం చెందింది (3) భూమిపై జీవం సాధ్యమయ్యేలా చేసే 200 అంశాలున్నాయి. ఉదాహరణకు సూర్యుని నుంచి భూమికి మధ్య ఉన్న దూరం, భూమ్యాకర్షణ శక్తి, వాతావరణం, భూమిపై నీరు ఉండడం మొదలైనవి.

దివ్యఖుర్ఆన్‌లో మరో చోట అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

*ఆకాశం నుండి మీ కోసం నీళ్ళను కురిపించేవాడు ఆయనే. ఆ నీటిని మీరూ తనివితీరా త్రాగుతారు, ఆ నీటివల్ల మీ పశువులకు కూడా మేత మొలుస్తుంది. ఆయన ఆ నీటిద్వారా పొలాలను పండిస్తాడు. జైతూను, ఖర్జూరం, ద్రాక్ష ఇంకా రకరకాల ఇతర పండ్లను పండిస్తాడు. ఆలోచించే వారికి ఇందులో ఒక గొప్ప నిదర్శనం ఉంది. (దివ్యఖుర్ఆన్ 16:10-11)*

ఈ ఖుర్ఆన్ వాక్యంలో దైవం ఉనికికి సంబంధించి అనేక చిహ్నాలను ప్రస్తావించడం జరిగింది. ఈ వాక్యంలో వర్షం కురవడం అనే విషయం తీసుకుంటే, దీని వెనుక వందలాది భౌతిక నియమాలు, ఖచ్చితమైన ప్రక్రియలు ఉన్నాయి. వాటి వల్ల భూమిపై తేమ నీటి ఆవిరిగా మారుతుంది. నీటి ఆవిరి ఆకాశాలకు వెళుతుంది. అక్కడ నీటి ఆవిరి నీటి బిందువులుగా ద్రవీభవనం చెందుతుంది. నీటిబిందువులన్నీ కలిసి మబ్బులుగా ఏర్పడతాయి. వేలాది టన్నులు నీటితో ఉన్న మబ్బులు ఆకాశంలో కదులుతుంటాయి, చివరకు ఈ నీటిబిందువులు వర్షంగా కురుస్తాయి. ఈ ప్రక్రియ మొత్తం ఖచ్చితమైన భౌతిక నియమాల ద్వారా జరుగుతుంది. సృష్టిలో ఇలాంటి అనేక వేలాది చిహ్నాల గురించి ఆలోచించాలని దివ్యఖుర్ఆన్ ఆహ్వానిస్తుంది. ఆలోచించే వివేకవంతులైన వారికి ఈ చిహ్నాలన్నీ ఒక మహోన్నతుడైన రూపశిల్పి, సృష్టికర్త, దైవం ఉన్నాడని సూచిస్తాయి. ఈ అద్భుతమైన, సంక్లిష్టమైన వ్యవస్థ, సృష్టిలోని ఈ ఖచ్చితత్వం, ఇందులో ఉన్న ఖచ్చితమైన ప్రక్రియలు ఇవన్నీ యాధృచ్ఛికంగా చోటు చేసుకున్నాయని భావించడం హేతువుకు

అందని విషయం. నిజానికి అనేకమంది ఆధునిక శాస్త్రవేత్తలు ఈ హేతుబద్ధమైన ఆలోచననే బలపరుస్తున్నారు[31].

మనుషులందరు ప్రకృతి సిద్ధంగా సృష్టికర్తను గుర్తించి, ఆయనకు విధేయత చూపించే ప్రవృత్తితోనే పుడతారని దివ్యఖుర్ఆన్ చెబుతుంది. దీన్ని అరబీలో ఫిత్రత్ అంటారు[32]. దీనికి రుజువు ఏమిటంటే, మనకు ఏదన్నా తీవ్రమేన సంక్షోభం వచ్చినప్పుడు, మనకు మానవమాత్రులెవ్వరు సహాయం చేయలేరని అనిపించినప్పుడు మనం సహాయానికి దైవం వైపునకే మరలుతాము. మన సృష్టికర్త ప్రవక్తలను నియమించాడు. మానవాళి కోసం దైవగ్రంథాలను పంపించాడు. ఆవిధంగా సృష్టికర్తను గుర్తించే మానవ సహజ చైతన్యాన్ని మేల్కొలపడానికి అవసరమైన ఏర్పాట్లు చేశాడు. కాని దైవం మనకు ఇష్టమొచ్చింది ఎంచుకునే స్వేచ్ఛను ఇచ్చాడు. కాబట్టి మనిషి తనలోని ఈ సహజ చైతన్యాన్ని అణిచిపెట్టగలడు. అయితే దివ్యఖుర్ఆన్‌లో దేవుడు చెప్పిందేమిటంటే, సృష్టికర్తను నమ్మకోవాలని మనస్సాక్షి ఇచ్చే పిలుపును వినేవాడికి దైవం మార్గం చూపిస్తాడు. కాని సృష్టికర్తను విశ్వసించాలని చెప్పే మనస్సాక్షిని అణిచేసే ప్రయత్నం చేసేవారిని మార్గభ్రష్టత్వంలో వదిలేస్తాడు. మన సృష్టిలో దైవం చేసిన ఏర్పాటు ఇదే [33].

చిట్టచివరి దైవగ్రంథం దివ్యఖుర్ఆన్ స్వయంగా దైవం ఉనికిని చాటి చెప్పే నిదర్శనం. దివ్యఖుర్ఆన్ అధ్యాయం 4 వాక్యం 82లో ఇలా అల్లాహ్ ఇలా తెలియజేశాడు:

> ***ఈ ప్రజలు ఖురానును గురించి ఆలోచన చెయ్యరా? ఇది అల్లాహ్ తరఫు నుండి కాక వేరొకరి తరఫునుండి వచ్చి ఉన్నట్లయితే ఇందులో ఎన్నో పరస్పర విరుద్ధాలైన విషయాలు ఉండేవి.***

నిష్పక్షపాతంగా, సత్యశోధనాభిలాషతో దివ్యఖుర్ఆన్ అధ్యయనం చేస్తే ఇది మానవరచన కాదని స్పష్టంగా తెలుస్తుంది. (విభాగం 7 చూడండి). దైవం ఉనికిని చాటి చెప్పే బలమైన నిదర్శనం దివ్యఖుర్ఆన్.

ఒక శాశ్వతమైన, దైవికమైన లక్ష్యంతో అల్లాహ్ మనలను సృష్టించాడు. తన సృష్టిలో చాలా వాటికన్నా ఎక్కువగా మనపై దయ చూపాడు [34]. భూమిపై మన జీవితం తర్వాతి జీవితంలోకి పరిణామం చెందే జీవితం. మరణానంతరం శాశ్వత నివాసానికి అవసరమైన ఏర్పాట్లు చేసుకునేది ఇహలోక జీవితం. ఈ ఏర్పాట్లలో, సృష్టికర్త పట్ల మన విశ్వాసాన్ని

పరీక్షించడం జరుగుతుంది. సంపద ద్వారా, పేదరికం ద్వారా రెండింటి ద్వారా కూడా పరీక్ష జరుగుతుంది. అంతేకాదు, మన స్వేచ్ఛను మనం ఎలా ఉపయోగిస్తున్నామో కూడా పరీక్షించడం జరుగుతుంది. ఈ స్వేచ్ఛను ఉపయోగించే తీరుతెన్నులను బట్టి మంచి చెడు ప్రాప్తిస్తాయి. చెడును చేసేది మనుషులే. దేవుడు కాదు. వీటన్నింటి నేపథ్యంలో ఆశాకిరణం ఏమంటే, చెడులు, కష్టాలు ఇవన్నీ మన విశ్వాసానికి పరీక్షలు మాత్రమే కాదు, ఇవి మనిషికి పరీక్షలు, హెచ్చరికలు కూడాను. నిజానికి కష్టకాలంలోనే మన అంతరాంతరాల్లో ఆధ్యాత్మిక చైతన్యం, నిర్మాణాత్మక ఆలోచనలు చోటు చేసుకుంటాయి.



*సూర్యగ్రహణం : ఇది ఒక అద్భుతమైన దృశ్యం. ఇది ఎలా సాధ్యపడిందంటే, భూమికి చంద్రుడికి మధ్య ఉన్న దూరం కంటే, భూమికి సూర్యుడికి మధ్య ఉన్న దూరం 400 రెట్లు ఎక్కువ. అలాగే సూర్యుడు చంద్రుడి కంటే 400 రెట్లు పెద్దవాడు. ఈ ఖచ్చితమైన నిష్పత్తులను పరిశీలిస్తే వీటన్నింటి వెనుక ఒక పక్కా ప్రణాళికతో ఈ అందమైన దృశ్యాన్ని నిర్మించిన సృష్టికర్త ఉన్నాడన్నది బోధపడుతుంది.*

# ఇస్లాంలో మహిళల హోదా

ఇస్లాం ప్రకారం సృష్టికర్త దృష్టిలో స్త్రీలు, పురుషులు సమానులు. శరీరనిర్మాణ పరంగా స్త్రీపురుషుల మధ్య తేడా ఉంది. దానికి అనుగుణంగానే కుటుంబంలో, సమాజంలో వారు పోషించే పాత్రలు కూడా వేర్వేరుగాను, పరస్పరం ఆధారపడే పాత్రలుగాను ఉన్నాయి. అయితే, ఇందులో ఎవరు అధికులు కాదు. దివ్యఖుర్‌ఆన్ (4:1) వాక్యం ఈ విషయాన్ని వివరిస్తుంది.

***మానవులారా! మీ ప్రభువుకు భయపడండి. ఆయన మిమ్మల్ని ఒకే ప్రాణి నుండి పుట్టించాడు. అదే ప్రాణి నుండి అలాంటిదే జతను సృష్టించాడు. ఇంకా ఆ జంట ద్వారా ఎంతోమంది పురుషులను, స్త్రీలను అవనిలో వ్యాపింపజేశాడు. ఏ దేవుని పేరు చెప్పుకుని మీరు పరస్పరం మీ మీ హక్కులను కోరుకుంటారో, ఆ దేవునికి భయపడండి. బంధుత్వ సంబంధాలను గౌరవించండి. అల్లాహ్ మిమ్మల్ని పరికిస్తున్నాడనే విషయాన్ని తెలుసుకోండి.***



ఈ వాక్యం చెప్పేది ఏమంటే, స్త్రీలు కూడా పురుషుల వంటి వారే. స్త్రీపురుషులకు ఒకరిపై మరొకరికి హక్కులున్నాయి. అయితే అల్లాహ్ మహిళలకు, ముఖ్యంగా తల్లులకు ప్రత్యేక గౌరవమర్యాదలు ఇవ్వాలని బోధించాడు.

ఈ అత్యున్నత సూత్రం ప్రకారం ఇస్లాం మహిళలకు ఉన్నత హోదా ఇచ్చింది. పురుషుల దాసీలుగా ఉన్న మహిళలకు స్వేచ్ఛనిచ్చింది. ఇస్లాం వచ్చిన కాలంలో, అంటే 7వ శతాబ్దంలో యావత్తు ప్రపంచంలో మహిళలను బానిసలుగా చూసే చెడు సంప్రదాయం ప్రబలంగా ఉండేది. ఇస్లాం వారికి ఆధ్యాత్మిక, సామాజిక, ఆర్థిక స్వేచ్ఛను ఇచ్చి పురుషులతో సమానం చేసింది [35].

కొన్ని ముస్లిం సమాజాల్లో మహిళలపై జరుగుతున్న దౌర్జన్యాలకు కారణం ఇస్లామ్ కానే కాదు, నిజానికి ఈ దుస్సంప్రదాయాలపై పోరాడ్డానికే ఇస్లాం వచ్చింది. ఉదాహరణకు, బలవంతంగా వివాహాలు చేయడం, బాలికలను చదువుకు దూరం చేయడం వంటి దురాచారాలు కొన్ని ముస్లిం సమాజాల్లో ఉన్నాయి. ఇవి ఇస్లామీయ చట్టాలకు విరుద్ధమైనవి.

# మతపరమైన తీవ్రవాదం, హింసాకాండ

ప్రపంచంలో అన్ని మతాల్లోను మతపరమైన తీవ్రవాదం, హింసాకాండ ఉన్నాయి. మతాలు ఎంత పాతవో ఈ రుగ్మతలు కూడా అంత పాతవి. అన్ని మతాల్లోను ఎల్లప్పుడు కొందరు తమ మతవిశ్వాసాల పట్ల తీవ్రమైన, విపరీతమైన, వక్రమైన భావాలు కలిగిన వారు ఉంటారు. ఇలాంటి వారి వల్లనే అనేక యుద్ధాలు జరిగాయి. అనేక దౌర్జన్యాలు, దుర్మార్గాలు జరిగాయి. ఇలాంటి వారి తీవ్రవాద భావాలు, వికటమనస్తత్వాల వల్ల హింసాకాండ జరిగింది. ఈ ధోరణులను నిరోధించడానికి ఇస్లాం మనిషి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దడానికి, నడవడికను సరిచేయడానికి వ్యక్తిగత స్వేచ్ఛ సూత్రం ఆధారంగా ప్రయత్నిస్తుంది. మానవ గౌరవమర్యాదలను కాపాడ్డం, అన్ని మతాలను గౌరవించడం, మానవజీవితాన్ని పవిత్రమైనదిగా భావించడం, మానవులందరి పట్ల నిష్పక్షపాతం, న్యాయం సూత్రాల ఆధారంగా ఇస్లాం ఈ రుగ్మతలను నిరోధిస్తుంది.

## వ్యక్తిగత స్వేచ్ఛ, మతాల పట్ల గౌరవం

అల్లాహ్ మనిషిని మనస్సాక్షిని అనుసరించే స్వేచ్ఛతో పుట్టించాడు. మతం విషయంలో స్వేచ్ఛను ఇచ్చాడు. కాబట్టి ఏ మతం విషయంలోను మనిషిపై బలవంతం చేయడం కుదరదు. దివ్యఖుర్ఆన్‌లో ఇంతకు ముందు చెప్పుకున్న 2:256, 10:99 వాక్యాలే కాదు (చూడండి విభాగం 10), దివ్యఖుర్ఆన్ 11:118–119 లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

> *నీ ప్రభువు సంకల్పిస్తే సర్వమానవులనూ నిస్సందేహంగా ఒకేవర్గంగా చెయ్యగలిగేవాడే కాని ఇప్పుడు వారు విభిన్నమార్గాలలోనే నడుస్తారు. కేవలం నీ ప్రభువు కరుణకు నోచుకున్న వారే అపమార్గాలకు లోనుకాకుండా ఉంటారు. ఆయన వారిని దీనికొరకే (ఎంపిక, ఆచరణల స్వాతంత్ర్యాన్నిచ్చి పరీక్షించే నిమిత్తమే) సృష్టించాడు.*

దైవం చేసిన మానవసృష్టి వ్యూహంలోనే మతవైవిధ్యం ఉంది. అంటే అన్ని మతాలు శాంతియుతంగా, సహనస్వభావంతో కలిసిమెలిసి ఉండాలన్నది కూడా ఇందులో చేరి ఉంది.

## ప్రాణం పవిత్రమైనది

అమాయకులను హతమార్చడాన్ని ఇస్లాం తీవ్రంగా ఖండిస్తుంది. అమాయకులపై హింసాకాండ, అన్యాయాలను ఖండిస్తుంది. అన్యాయంగా ఒక మనిషిని చంపడం ఇస్లాంలో చాలా పెద్ద పాపం. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

> *“హత్యకు బదులుగా గాని లేదా కల్లోలాన్ని వ్యాపింపజేసినందుకు*

*గాని కాక మరే కారణం వల్లనైనా ఒక మానవుణ్ణి చంపినవాడు సమస్త మానవులను చంపినట్లే. ఒక మానవుడి ప్రాణాన్ని కాపాడినవాడు మొత్తం మానవుల ప్రాణాలను కాపాడినట్లే." (దివ్యఖుర్ఆన్ 5:32).*

దురాక్రమణ, అణిచివేతల్లో కేవలం ఆత్మరక్షణకు మాత్రమే ఇస్లాం యుద్ధానికి అనుమతి ఇచ్చింది[36]. అయితే, ఎలాంటి న్యాయబద్ధమైన యుద్ధంలో అయినా సరే దౌర్జన్యాలకు, అణిచివేతలకు పాల్పడిన వారిపైనే పోరాటం, అమాయకులైన పౌరులు, వారి ఆస్తులపై దాడులు చేయడానికి వీలు లేదు. అంతేకాదు, యుద్ధానికి పిలుపు ఒక న్యాయబద్ధమైన ప్రభుత్వం ఇవ్వాలి. వ్యక్తులు లేదా ఏదో ఒక గ్రూపు ఈ పిలుపు ఇవ్వడానికి అనుమతి లేదు. ఇస్లాంలో యుద్ధనియమాలు చాలా కఠినమైనవి. యుద్ధఖైదీలు, అమాయకప్రజలు, వారి ఆస్తుల విషయంలో చాలా కఠినమైన నియమనిబంధనలున్నాయి[37].

## న్యాయం నిష్పక్షపాతం

న్యాయం, నిష్పక్షపాతం లేనట్లయితే తీవ్రవాద, హింసాత్మక సిద్ధాంతాలు పుట్టుకువస్తాయి. మతవివక్ష లేకుండా ప్రజలందరి పట్ల న్యాయంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలని ఇస్లాం ఆదేశిస్తుంది. దివ్యఖుర్ఆన్ లోని 60:8 వాక్యంలో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

*ఎవరైతే ధర్మం విషయంలో మీతో యుద్ధం చేయలేదో, మిమ్మల్ని మీ ఇళ్లనుండి వెళ్లగొట్టలేదో, వారిపట్ల మీరు మంచితనంతో, న్యాయంతో వ్యవహరించటాన్ని అల్లాహ్ నిరోధించడు. అల్లాహ్ న్యాయం చేసేవారిని ప్రేమిస్తాడు.*

ఇలాంటి కట్టుదిట్టమైన నియమనిబంధనలు, సూత్రాలు ఉన్నప్పటికీ తీవ్రవాదం, హింసాకాండ ఇస్లాంలో జరుగుతున్నాయంటే అర్థం, ఇస్లాం పట్ల అవగాహన లేకపోవడం వల్లనే. మతం గురించిన విపరీతమైన భావాలు, మతం కాకుండా ఇతరేతర ప్రయోజనాలు మొదలైన కారణాల వల్ల జరుగుతున్నాయి. ప్రపంచంలో నేడు మనం చూస్తున్న హింసాకాండ మౌలికంగా రాజకీయ కారణాల వల్ల పెచ్చరిల్లిన హింసాకాండ. దీనికి మతంతో లేదా మతంలోని వివిధ సముదాయాలతో ఎలాంటి సంబంధమూ లేదు. మతం పేరును వాడుకుని తమ స్వార్థ ఉద్దేశ్యాలపై ముసుగు వేస్తున్నారు. మతం పేరుతో ప్రజలను సమీకరిస్తున్నారు. ఈ ఘర్షణలు, హింసాకాండ వెనుక రాజకీయాధికారం కోసం, ప్రాబల్యం కోసం, సంపద కోసం ప్రయత్నాలు, దురాశ, పగప్రతీకారాలు, విదేశీ సైనికజోక్యాలు తదితర కారణాలున్నాయి. ఒక మతంగా ఇస్లాంకు ప్రపంచంలో నేడు మతం పేరుతో జరుగుతున్న ఈ యుద్ధాలతో, వివిధ హింసాకాండలతో ఎలాంటి సంబంధమూ లేదు.

# ఇస్లామీయ జిహాద్

'జిహాద్' అనేది అరబీ పదం. ఈ పదానికి అర్థం 'ప్రయత్నించడం' సంఘర్షించడం. 'ఏదన్నా సాధించడానికి చేసే ప్రయత్నం, సంఘర్షణ' అని అర్థం. ఇస్లామీయ పరిభాషలో దీనికి అర్థం, అల్లాహ్ మార్గంలో ప్రయత్నించడం అని. అంటే విశ్వప్రభువు సేవలో మన ప్రయత్నాలు ఉండడం. దివ్యఖుర్ఆన్‌లో అనేక వాక్యాలు అల్లాహ్ మార్గంలో పనిచేయాలని బోధిస్తున్నాయి. ఉదాహరణకు దివ్యఖుర్ఆన్ 5:35లో ఇలా ఉంది:

> ***విశ్వాసులారా! అల్లాహ్‌కు భయపడండి. ఆయన సాన్నిధ్యానికి చేరే మార్గాన్ని అన్వేషించండి. ఆయన మార్గంలో నిరంతర కృషి చెయ్యండి (అంటే జిహాద్ చేయండి). బహుశా మీకు సాఫల్య భాగ్యం లభించవచ్చు.***

కాబట్టి ఒక విశ్వాసి అల్లాహ్ ప్రసన్నత, ఆమోదం పొందడానికి చేసే ప్రతి పని 'జిహాద్' అవుతుంది. ఇందులో ఆరాధనలు, దానాలు, మనోవాంఛలను అదుపు చేసుకోవడం, జ్ఞానాన్వేషణ, జీవనోపాధికి ప్రయత్నించడం, కుటుంబాన్ని సాకడం, మంచిని ప్రోత్సహించడం, చెడును నిరోధించడం ఇవన్నీ చేరి ఉన్నాయి.

చరిత్ర పుస్తకాల్లోను, ఆధునిక మీడియాలోను 'జిహాద్' అనే పదాన్ని తరచు యుద్ధానికి, హింసాకాండకు ఉపయోగిస్తున్నారు. ఇది చాలా పెద్ద తప్పు. ఎందుకంటే, అరబీ భాషలో యుద్ధాన్ని ఖితాల్ అంటారు. జిహాద్ అని పిలవడం జరగదు. జిహాద్ పేరుతో ఇస్లాం కరవాలం ద్వారా వ్యాపించిందని ప్రచారం జరుగుతోంది. చరిత్ర పుస్తకాల్లో ఇది అతిపెద్ద వక్రీకరణ, అతి పెద్ద అబద్ధం. ఇస్లాంలోని విలువలు, సూత్రాలు, ప్రమాణాల వల్ల ప్రపంచంలో విస్తరించిందే కాని కత్తివల్ల కాదు. చరిత్రలో ఇస్లామీయ క్రూసేడులు లేదా దురాక్రమణలు ఎక్కడా జరగలేదు. ''పవిత్రయుద్ధం'' అనే పదం ఇస్లామీయ పరిభాషలో ఎక్కడా లేదు. ఈ పదం నిజానికి పోప్ రెండవ అర్బన్ కాలంలో అంటే 1095లో మొదటిసారి ఉపయోగించబడింది. అప్పట్లో ఆయన పవిత్రభూభాగాలను మరలా స్వాధీనం చేసుకోడానికి ముస్లిములపై ''పవిత్రయుద్ధం'' చేయాలని యూరపులోని క్రయిస్తవులందరికీ పిలుపునిచ్చాడు. ముస్లిములు ఇస్లాం ప్రారంభ చరిత్రలో యుద్ధాల్లో పాల్గొన్నారన్నది నిజమే. అయితే ఆ యుద్ధాలన్నీ దురాక్రమణలను తిప్పికొట్టడానికి, లేదా నిరంకుశత్వాన్ని తొలగించడానికి, మతం విషయంలో మనస్సాక్షిని అనుసరించే స్వేచ్ఛను స్థాపించడానికి జరిగిన యుద్ధాలు. నిజానికి ఆ యుద్ధాలన్నీ స్వేచ్ఛ కోసం జరిగిన పోరాటాలు. అవి మతమార్పిడికి జరిగిన యుద్ధాలు కాదు. ఒక ఉదాహరణ ఏమిటంటే, భారతదేశాన్ని ముస్లిములు వందలాది సంవత్సరాలు పరిపాలించారు,

అయినా బలవంతపు మతమార్పిళ్ళు జరగలేదు. ఇప్పటికి కూడా భారతదేశం హిందూ మెజారిటీ దేశంగానే ఉంది.

'జిహాదీ', 'జిహాదిజం' వంటి పదాలు ఆధునిక కాలంలో మీడియాలో ముస్లిం గ్రూపుల తీవ్రవాదాన్ని, మిలిటెంటు గ్రూపులను, వారి సిద్ధాంతాలను వర్ణించడానికి ఉపయోగిస్తున్నారు. ఈ పదాలు ఆధునిక కాలంలో కనిపెట్టిన పదాలు, ఇస్లాం చరిత్రలో ఇలాంటి పదాలు లేవు.

ఇస్లాం హింసాకాండకు అనుమతి ఇవ్వదు. కేవలం ఆత్మరక్షణకు, దురాక్రమణను తిప్పికొట్టడానికి మాత్రమే పోరాడే అనుమతి ముస్లిములకు ఉంది. అలా ఆత్మరక్షణకు చేసే పోరాటం జిహాద్‌గా చెప్పవచ్చు. ఎందుకంటే అది ఆత్మరక్షణకు చేసే ప్రయత్నం, దురాక్రమణను నిరోధించే ప్రయత్నం. అల్లాహ్ దివ్యఖుర్ఆన్ 2:193లో ఇలా తెలియజేశాడు.

> ***పీడన (ఫిత్నా) అంతమయ్యేవరకు, దైవధర్మం స్థాపించబడేవరకు మీరు వారితో యుద్ధం చేస్తూనే ఉండండి. తరువాత వారు దానిని మానుకుంటే, దౌర్జన్యపరులను తప్ప మరెవ్వరినీ శిక్షించకూడదు.***



*టర్కీ, ఇస్తాంబుల్‌లో ఉన్న సుల్తాన్ అహ్మద్ మస్జిదు చారిత్రక మస్జిదు. నమాజుకు పిలుపు, అంటే అజాన్ తర్వాత ఇప్పటికి కూడా ఇక్కడ నమాజులో ప్రజలు సజ్దా చేస్తుంటారు. నీలం మస్జిదుగా దీన్ని పిలుస్తారు. ఈ మస్జిదు నిర్మాణం 1609 నుంచి 1616 మధ్యకాలంలో జరిగింది. మొదటి అహ్మద్ కాలంలో ఈ నిర్మాణం జరిగింది. ఈ మస్జిదు ఆవరణలో అహ్మద్ సమాధి, ఒక మదరసా, ధర్మాసుపత్రి ఉన్నాయి.*

# ఇస్లామీయ షరీఅత్

షరీఅత్ అంటే వివరణాత్మక ప్రవర్తనాసరళి. దైవాభీష్టానికి అనుగుణంగా మానవజీవితాన్ని మలిచే నియమావళి. ఇందులో మౌలిక విశ్వాసాలు, ఆరాధనారీతులు, నైతికప్రమాణాలు, సాంఘీక ఆర్థిక సూత్రాలు, శిక్షాస్మృతి ఉన్నాయి. షరీఅత్ అంటే “స్పష్టమైన మార్గం”, లేదా “దారి” అని అర్థం. ఇస్లామీయ పరిభాషలో సాఫల్య మార్గం, లేదా శాశ్వత సాఫల్యం అని అర్థాలున్నాయి. ఒక ముస్లిం షరీఅత్ ప్రకారం జీవించాలి. ఎందుకంటే అదే దైవిక జీవనమార్గం.

ఇస్లామీయ షరీఅత్ మౌలిక సూత్రాలు దివ్యఖుర్ఆన్, ప్రవక్త సంప్రదాయాల నుంచి గ్రహించడం జరిగింది. ధార్మిక పండితుల ఏకాభిప్రాయం (అరబీలో ‘ఇజ్మా’ అంటారు) ద్వారా ఈ సూత్రాల నిర్దిష్ట అమలు పద్ధతి, వివిధ పరిస్థితులకు వర్తించే న్యాయపరమైన, ధార్మికమైన చట్టాల రూపకల్పన షరీఅత్‌ను మరింత స్పష్టంగా నిర్వచించింది.

యావత్తు మానవాళికి న్యాయబద్ధమైన, నిష్పక్షపాతమైన చట్టాలను కేవలం మానవబుద్ధీవివేకాల ద్వారా సాధించడం కుదరదు. ఎందుకంటే అహం, పక్షపాతాలు, గర్వాలు, కోరికలు, స్వార్థ ప్రయోజనాలు, భావావేశాలు, హ్రస్వదృష్టి తదితర మానవ



ఒమాన్, మస్కట్ లో ఉన్న హైకోర్టు

బలహీనతలు మనిషి నిర్ణయాల్లో ఉంటాయి. అందువల్ల మనకు సృష్టికర్త మార్గదర్శనం అవసరం. మానవ వ్యవహారాలను నిర్వహించడానికి అవసరమైన న్యాయమైన, నిష్పక్షపాతమైన మార్గాన్ని సృష్టికర్త మాత్రమే ఇవ్వగలడు. అదే ఇస్లామీయ ''షరిఅత్''. ఇది పరిపూర్ణమైన ''నియమావళి''. ఇది మానవప్రాణాలను, గౌరవమర్యాదలను, బుద్ధీవివేకాలను, మతవిశ్వాసాన్ని, కుటుంబాన్ని, ఆస్తులను కాపాడడానికి ఉద్దేశించిన శాసనాంగం.

ఇస్లాం వ్యతిరేక ప్రచారంలో షరీఅత్‌పై చాలా దాడులు జరుగుతున్నాయి. మహిళలను అణిచివేత, బాల్యవివాహాలు, స్వేచ్ఛలను హరించడం ఇలాంటి వాటిని విధించే ఇస్లామీయ చట్టంగా విమర్శలు పెల్లుబుకుతున్నాయి. షరీఅత్ అంటే ఏమిటో తెలియని అజ్ఞానమే ఈ ప్రచారానికి కారణం. అనేక చెడులను నివారించడానికి అవసరమైన పరిష్కారాలను చూపించే నియమావళి ఇది. నిజానికి షరీఅత్‌ను ఏ విషయాల గురించి విమర్శిస్తున్నారో, అలాంటి చెడులన్నింటిని నివారించడానికి షరీఅత్ ఉద్దేశించింది. ఉదాహరణకు, స్త్రీపురుష సమానత్వానికి, తల్లిదండ్రుల హక్కులు, కుటుంబంలో పిల్లల హక్కులు, పేదలు, అభాగ్యుల హక్కులు, యుద్ధనియమావళి, యుద్ధఖైదీల పట్ల మానవీయంగా వ్యవహరించడం, న్యాయబద్ధమైన వ్యాపార వ్యవహారాలు, మతసహనం, సామాజిక మర్యాదలు, పరిపాలన వ్యవహారాలు మొదలైన వాటికి సంబంధించి చట్టాలు, మార్గదర్శక సూత్రాలు షరీఅత్ అందిస్తుంది.

ఇస్లామీయ షరిఅత్‌లో వాణిజ్య వ్యవహారాలకు సంబంధించి నిజాయితీకి సంబంధించిన సూత్రాలు దివ్యఖుర్ఆన్ లోని 26:181–183 నుంచి తీసుకోవడం జరిగింది.

أَوْفُوا۟ ٱلْكَيْلَ وَلَا تَكُونُوا۟ مِنَ ٱلْمُخْسِرِينَ ۝

وَزِنُوا۟ بِٱلْقِسْطَاسِ ٱلْمُسْتَقِيمِ ۝

وَلَا تَبْخَسُوا۟ ٱلنَّاسَ أَشْيَآءَهُمْ وَلَا تَعْثَوْا۟ فِى ٱلْأَرْضِ مُفْسِدِينَ ۝

*కొలపాత్రలను పూర్తిగా నింపండి, ఎవరికీ తక్కువ చేసి ఇవ్వకండి. సరైన తరాజుతో తూయండి. ప్రజలకు వారి వస్తువులను తక్కువ జేసి ఇవ్వకండి. భూమిపై కల్లోలాన్ని వ్యాపింపజేస్తూ తిరగకండి.*

# ఇస్లాంలో విభేదాలు

ప్రవక్త కాలంలో, ఆ తర్వాత ముగ్గురు ఖలీఫాల కాలంలో ముస్లిములందరూ ఒకే సముదాయంగా సమైక్యంగా ఉండేవారు. ప్రభుత్వ, పాలనా వ్యవహారాల విషయంలో కొన్ని అభిప్రాయభేదాలు ఉన్నా సమైక్యంగా ఉండేవారు. ముఖ్యంగా మూడవ ఖలీఫా ఉస్మాన్ ఇబ్నె అఫ్ఫాన్ (రజి), సామాన్యశకం 644-661, కాలంలో కొన్ని అభిప్రాయభేదాలు ఉండేవి. ఆ తర్వాత రాజకీయ అసమ్మతి, చివరకు తిరుగుబాటు నాల్గవ ఖలీఫా అలీ ఇబ్నె తాలిబ్(రజి), సామాన్యశకం 656-661 కాలంలో తలెత్తాయి. ఆ తర్వాతి ఘర్షణలు, యుద్ధంలో మూడు వర్గాలుగా చీలిపోయారు. అలీ తో పోరాడిన వారిది ఒక వర్గం, అలీ(ర)కి, ఆయన ప్రత్యర్థులకు మధ్య ఒప్పందానికి ప్రయత్నించిన వారిది రెండవ వర్గం. ప్రారంభంలో అలీ(ర)తో ఉండి, ప్రత్యర్థులతో ఒప్పందాన్ని వ్యతిరేకించిన వారిది మూడవ వర్గం. కాబట్టి ముస్లిముల్లో ఉన్న విభేదాలు మౌలికంగా రాజకీయమైనవి. ఇస్లామీయ చరిత్రలో ఈ కాలంలో రాజకీయాధికారాన్ని, న్యాయవ్యవస్థ నుంచి ప్రత్యేకంగా స్వతంత్రంగా మార్చడం జరిగింది. మూడు వర్గాల్లోను అనేకమంది ముస్లిం మేధావులు ముందుకు వచ్చారు. షరిఅత్‌కు సంబంధించి రూపురేఖలను తీర్చిదిద్దే అనేక సూత్రాలు, భావనలకు పునాదులు వేశారు. అనేకమంది ముస్లిం న్యాయకోవిదులు, జాబిర్ బిన్ జాయద్ (639-709), అబూహనీఫా (699-767), జాఫర్ సాదిఖ్ (702-765), మాలిక్ (711-795), షాఫయీ (767-820), ఇబ్నె హంబల్ (780-855) వంటి అనేకమంది ఈ కాలంలో కనిపిస్తారు. ఈ మేధావులను ఇమాములుగా పిలుస్తారు. ధార్మిక, న్యాయపరమైన మేధోనాయకత్వం వహించినందుకు వారికి లభించిన గౌరవబిరుదు ఇది. ఈ ఇమాములు ఇస్లామీయ శాసనాంగం, సూత్రాలను వివరించారు. ఇందులో ప్రతి ఒక్కరికి వారి అనుయాయులు ఏర్పడ్డారు. 10వ శతాబ్దం నాటికి ఈ ఇమాములు ప్రతిపాదించిన సూత్రాల పునాదులపై, స్పష్టమైన ధార్మిక పంథాలు రూపుదిద్దుకున్నాయి. ప్రతి ధార్మిక పంథా ఈ ఇమాముల్లో ఒక ఇమామును అనుసరించడం ప్రారంభించింది. ఆ విధంగా జాబిర్ బిన్ జాయద్ ప్రతిపాదించిన పంథా ఇబాదీ పంథా అంటారు. అబూహనీఫాను అనుసరించే వారు హనఫీ, జాఫర్ సాదిక్ ప్రతిపాదించిన పంథాను అనుసరించేవారు షియా, మాలిక్ ప్రతిపాదించిన పంథాను అనుసరించేవారు మాలికి, షాఫయీను అనుసరించేవారు షాఫయీ, ఇబ్నె హంబల్ పంథాలో నడిచేవారు హంబలీ అయ్యారు. నిజానికి ఈ ఇమాములు ఎవ్వరు కూడా ప్రత్యేకమైన పంథా ఏర్పరచాలని అనుకోలేదు, కాని తర్వాతి మూడు శతాబ్దాల కాలంలో ఈ పంథాలు క్రమేణా ఉనికిలోకి వచ్చాయి. ఎందుకంటే, ఈ కాలంలో ముస్లిములు

తమ ధార్మిక, సామాజిక, ఆర్థిక, కుటుంబ వ్యవహారాల్లో ఈ ఇమాముల్లో ఎవరో ఒకరి భాష్యాన్ని అనుసరించడం ప్రారంభించారు.

ఈ ధార్మిక పంథాలు ఉన్నప్పటికీ ముస్లిములందరూ ఒకే మతగ్రంథం దివ్యఖుర్‌ఆన్ ఆధారంగా ఒక్కటిగా ఉన్నారు. దివ్యఖుర్‌ఆన్ పద్నాలుగు వందల సంవత్సరాల క్రితం అవతరించినప్పటి నుంచి నేటి వరకు ఎలాంటి మార్పులు లేకుండా అలాగే ఉన్నది. ప్రవక్త ముహమ్మద్ (స) సంప్రదాయాలు అలాగే అందుబాటులో ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ముస్లిములు మతానికి, మతవిశ్వాసానికి, ధార్మిక ఆచరణలు, హజ్ యాత్ర వంటి మౌలికమైన విషయాల్లో ఎలాంటి భేదాభిప్రాయాలు కలిగిలేరు, ఒక్కటిగా ఉన్నారు.

మతాన్ని, విభిన్నశిబిరాలుగా ముక్కలు చేయడాన్ని ఇస్లాం నిషేధిస్తుంది. అల్లాహ్ దివ్యఖుర్‌ఆన్ 3:103లో ఇలా సెలవిచ్చాడు:

*అంతా కలిసి అల్లాహ్ త్రాడును గట్టిగా పట్టుకోండి. విభేదాలలో పడకండి.*

దివ్యఖుర్‌ఆన్‌లోని ఈ వాక్యం స్ఫూర్తిగా, వివిధ ఇస్లామీయ పంథాలన్నీ కలిసి ఒకే సముదాయంగా, సుహృద్భావంతో అనేక శతాబ్దాలుగా జీవిస్తున్నారు. చరిత్రలో మనం చూసిన దురదృష్టకరమైన ఘర్షణలు, ఇటీవలి కాలంలో తలెత్తినవి, ఇవన్నీ మతానికి సంబంధించినవి కావు. ఇవన్నీ భౌగోళిక, రాజకీయ పోరాటాలు మాత్రమే.



*గ్రేట్ మాస్క్ ఆఫ్ డెమస్కస్‌గా పేరుపడిన ఉమయ్య మస్జిదు డెమస్కస్ పాత నగరంలో ఉంది. ప్రపంచంలోని అతి పెద్ద, అతి ప్రాచీన మస్జిదుల్లో ఇది ఒకటి. ఇస్లాంలో దీన్ని నాల్గవ పవిత్రమైన మస్జిదుగా కొందరు భావిస్తారు.*

# ఇస్లాంలో మౌలిక మానవహక్కులు

అల్లాహ్ సృష్టిలో మానవాళికి గౌరవోన్నతులున్నాయి. దివ్యఖుర్ఆన్ 17:70లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

> ***మేము ఆదమ్ సంతతికి పెద్దరికాన్ని ప్రసాదించాము... మేము సృష్టించిన ఎన్నో ప్రాణులపై వారికి స్పష్టమైన ఆధిక్యాన్ని అనుగ్రహించాము.***

ఈ గౌరవోన్నతులను కాపాడ్డానికి, ఇస్లాం మానవాళి అంతటికి కొన్ని మౌలికమైన హక్కులను ప్రసాదించింది. మనిషి మతం, జాతి, హోదా ఏదైనప్పటికీ ఈ హక్కులు అందరికీ వర్తిస్తాయి. ఇస్లాంలో, దివ్యఖుర్ఆన్ పేర్కొన్న కొన్ని మౌలిక మానవ హక్కులు.

1. మనిషి ప్రాణాల పవిత్రత, జీవించే హక్కు. విభాగం 15లో పేర్కొన్న దివ్యఖుర్ఆన్ వాక్యం 5:32 మాత్రమే కాదు దివ్యఖుర్ఆన్‌లో ఈ వాక్యాన్ని కూడా చూడండి.

   > ***పేదరికానికి భయపడి మీ సంతానాన్ని హత్య చేయకండి ... సత్యంతో తప్ప అల్లాహ్ పవిత్రంగా నిర్ణయించిన ఏ ప్రాణాన్నీ హతమార్చకండి, ఈ విషయాలనే పాటించమని ఆయన మీకు ఉపదేశించాడు, బహుశా మీరు ఆలోచించి పని చేస్తారని. (దివ్యఖుర్ఆన్ 6:151)***

2. జీవన మౌలికావసరాలు పొందే హక్కు. తోటివారికి జీవన మౌలికావసరాలు అందేలా చేయడం ప్రతి ముస్లిం బాధ్యత.

   > ***వారి సంపదలో యాచకులకూ, అగత్యం కలవారికీ హక్కు ఉంది. అర్థించిన వారికి, (కారణాంతరాల వల్ల) అర్థించలేని వారికి. (ఖుర్ఆన్ 51:19).***

   పేదలకు సహాయం చేయడం, అగత్యపరులను ఆదుకోవడం అనేది వారికి మేలు చేయడమూ కాదు, అలా చేయడము ప్రత్యేకహోదా కూడా కాదు, అది పేదల హక్కు.

3. సంపూర్ణమైన స్వేచ్ఛ.

   > ***అతడు కష్టతరమైన కనుమ దాటిపోవటానికి సాహసించలేదు. కష్టతరమైన ఆ కనుమ అంటే ఏమిటో మీకు తెలుసా? ఎవరినైనా బానిసపు బంధనాల నుండి విముక్తి గావించటం (దివ్యఖుర్ఆన్ 90:11-13)***

బానిసత్వం అనేక రూపాల్లో ఉంటుంది. భౌతికంగా బానిసల్లా ఉండడం, ఆర్థిక బానిసత్వం, వెట్టిచాకిరి, లైంగిక దోపిడి ఇంకా అనేకరూపాల్లో ఈ దోపిడి ఉంటుంది.

ప్రవక్త ముహమ్మద్ (స) ఇలా అన్నారు :

> ***తీర్పుదినాన స్వయంగా నేను మూడు రకాల మనుషులకు వ్యతిరేకంగా వాదిస్తాను. అందులో ఒక రకం, స్వతంత్రులైన మనుషలను బానిసలుగా మార్చేవాడు.***

ఈ విధంగా ఇస్లాం 7వ శతాబ్దంలోనే బానిసత్వాన్ని రద్దు చేసింది. పాశ్చాత్యదేశాల్లో 19వ శతాబ్దం చివరి వరకు బానిసత్వం కొనసాగింది [38].



*చైనాలోని గ్జియాన్ లో ఉన్న గ్రేట్ మస్జిద్. 7వ శతాబ్దం ప్రారంభంలోనే చైనాలోకి ఇస్లాం ప్రవేశించింది. ఇప్పుడు చైనాలో 2 కోట్లకు మించి ముస్లిములున్నారు.*

4. మానవసమానత్వం : ప్రజలందరూ సమానులే. దైవం దృష్టిలో కేవలం స్వచ్ఛమైన నడవడి, ఉన్నత నైతిక ప్రమాణాలు కలిగిన వారికే ఆధిక్యత లభిస్తుంది.

*మానవులారా! మేము మిమ్మల్ని ఒకే పురుషుని నుండి, ఒకే స్త్రీ నుండి సృజించాము. తరువాత మీరు ఒకరినొకరు పరిచయం చేసుకునేందుకు మిమ్మల్నిజాతులుగానూ, తెగలుగానూ చేశాము. వాస్తవానికి మీలో అందరికంటే ఎక్కువ భయభక్తులు కలవాడే అల్లాహ్ దృష్టిలో ఎక్కువ గౌరవపాత్రుడు. నిశ్చయంగా అల్లాహ్ సర్వజ్ఞానం కలవాడు, సకల విషయాలూ తెలిసినవాడూను. (దివ్యఖుర్ఆన్ 49:13)*

5. సామాజిక, ఆర్థిక వ్యవహారాల్లో సామాజిక హోదాతో నిమిత్తం లేకుండా న్యాయాన్ని, నిష్పక్షపాతాన్ని పొందే హక్కు.

*విశ్వసించిన ప్రజలారా! న్యాయ ధ్వజవాహకులుగా నిలబడండి. అల్లాహ్ కొరకు సాక్షులుగా ఉండండి. మీ న్యాయం, మీ సాక్ష్యం మీకూ, మీ తల్లిదండ్రులకూ, మీ బంధువులకూ ఎంత హానికలిగించినాసరే. కక్షిదారులు భాగ్యవంతులయినా, నిరుపేదలయినా అల్లాహ్ మీ శ్రేయస్సును మీకంటే ఎక్కువగా కాంక్షిస్తాడు. కనుక మీ మనోవాంఛలను అనుసరిస్తూ న్యాయం నుండి వైదొలగకండి. మీరు గనక సాక్ష్యాన్ని వక్రీకరిస్తే, న్యాయాన్నిదాటవేస్తే, బాగా తెలుసుకోండి, మీరు చేసేదంతా అల్లాహ్‌కు తెలుసు అని. (దివ్యఖుర్ఆన్ 4:135)*

6. వ్యక్తి గౌరవమర్యాదలు, ప్రయివసీలకు రక్షణ

*విశ్వాసులారా! పురుషులు ఇతర పురుషులను ఎగతాళిచేయ కూడదు. వీరికంటే వారేశ్రేష్ఠులై ఉండవచ్చు. అలాగే స్త్రీలు ఇతర స్త్రీలను ఎగతాళి చేయకూడదు. వీరికంటే వారే శ్రేష్ఠురాండ్రయి ఉండవచ్చు. ఒకరి నొకరు ఎత్తిపొడుచుకోకండి, ఒకరినొకరు చెడ్డపేర్లతో పిలుచుకోకండి. విశ్వసించిన తరువాత చెడ్డతనంలో పేరు సంపాదించటం చాలా నీచమైన విషయం. ఈ వైఖరిని మానుకోనివారే దుర్మార్గులు. (దివ్యఖుర్ఆన్ 49:11)*

అంతేకాదు, దివ్యఖుర్ఆన్ 49:12లో అల్లాహ్ ఇలా తెలియజేశారు:

*విశ్వాసులారా! అతిగా అనుమానించటం మానివేయండి. కొన్ని అనుమానాలు పాపాలు అవుతాయి. గూఢచారులుగా వ్యవహరించకండి. మీలో ఎవరూ ఎవరినీ పరోక్షంగా నిందించరాదు. మీలో ఎవరైనా మీ మృతసోదరుని మాంసం తినటానికి ఇష్టపడతారా? చూడండి, మీరే స్వయంగా దీనిని అసహ్యించుకుంటారు. అల్లాహ్‌కు భయపడండి, అల్లాహ్ అత్యధికంగా పశ్చాత్తాపాన్ని స్వీకరించేవాడు, కరుణించేవాడూను.*

7. భావప్రకటనా స్వేచ్ఛ. మంచిదని నమ్మిన మాట చెప్పడం. న్యాయం కోసం మాట్లాడడం.

*విశ్వాసులైన పురుషులూ, విశ్వాసులైన స్త్రీలూ, వారందరూ ఒకరికొకరు సహచరులు, వారు మేలు చెయ్యండి అని ఆజ్ఞాపిస్తారు. చెడు చెయ్యవద్దు అని నిరోధిస్తారు. (దివ్యఖుర్ఆన్ 9:71)*

అంతేకాదు, దివ్యఖుర్ఆన్ 4:148లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

*అన్యాయం జరిగితే తప్ప, మనిషి చెడు పలకటాన్ని అల్లాహ్ ఇష్టపడడు. అల్లాహ్ అన్నీ వినేవాడూ అన్నీ తెలిసినవాడూనూ.*

8. మతస్వేచ్ఛ, మతాన్ని ఆచరించే స్వేచ్ఛ. ఇస్లామ్ బోధించే సత్యం వైపునకు ప్రజలను ఆహ్వానించడం తమ బాధ్యతగా ముస్లిములు భావిస్తారు. అయితే, ఎవరిపైన ఒక మతాన్ని రుద్దే అధికారం ఎవరికీ లేదు. ఎందుకంటే మతం అనేది స్వచ్ఛందంగా అవలంబించవలసింది. తన ఆత్మ పట్ల నిజాయితీగా తీసుకోవలసిన నిర్ణయం. దివ్యఖుర్ఆన్ 2:256లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

*ధర్మం విషయంలో నిర్బంధంకానీ, బలాత్కారంకానీ లేవు. సత్యవాక్కు అసత్యవాక్కుల నుండి ప్రస్ఫుటం చెయ్యబడింది.*

ఇస్లాంలోని ఈ మత స్వేచ్ఛను దివ్యఖుర్ఆన్ అనేక చోట్ల పునరుద్ఘాటించింది [39].

ఇస్లామీయ విలువలు, దివ్యఖుర్ఆన్ లో పేర్కొన్న అనేక సూత్రాలు, ప్రవక్త సంప్రదాయాలు విశ్వజనీనమైనవి. మానవహక్కులు, ప్రజాస్వామ్యానికి సంబంధించిన ఆవశ్యక నియమాలను అందిస్తున్నాయి.

# ఇస్లాంలో సాంస్కృతిక వైవిధ్యం

ప్రజల సంప్రదాయాలు, ఆచారవ్యవహారాలు, జాతి, భాష, వస్త్రధారణ, ఆహారఅలవాట్లు, కళలు, జానపదకళారూపాలు ఇతర సాంస్కృతిక అభివ్యక్తుల్లో వైవిధ్యాన్ని ఇస్లాం గుర్తిస్తుంది. ఈ వైవిధ్యం సమ్మతించబడింది మాత్రమే కాదు, ఇది అల్లాహ్ అనుగ్రహం కూడాను. అయితే మౌలిక మతవిశ్వాసంతో విభేదించే సాంస్కృతిక అంశాలను ఇస్లాం ఖండిస్తుంది. అల్లాహ్ ఇలా తెలియజేశాడు :

> ***ఆయన సూచనలలో, ఆకాశాలనూ, భూమినీ సృష్టించటమూ, మీ భాషల, మీ రంగుల వైవిధ్యాలూ ఉన్నాయి. నిశ్చయంగా విజ్ఞులకు ఇందులో ఎన్నో సూచనలు ఉన్నాయి. (దివ్యఖుర్ఆన్ 30: 22)***

మరో దివ్యఖుర్ఆన్ వాక్యంలో అల్లాహ్ ఇలా తెలియజేశాడు :

> ***మానవులారా! మేము మిమ్మల్ని ఒకే పురుషుని నుండి, ఒకే స్త్రీ నుండి సృజించాము. తరువాత మీరు ఒకరినొకరు పరిచయం చేసుకునేందుకు మిమ్మల్ని జాతులుగానూ, తెగలుగానూ చేశాము. వాస్తవానికి మీలో అందరికంటే ఎక్కువ భయభక్తులు కలవాడే అల్లాహ్ దృష్టిలో ఎక్కువ గౌరవపాత్రుడు. నిశ్చయంగా అల్లాహ్ సర్వజ్ఞానం కలవాడు, సకల విషయాలూ తెలిసినవాడూను. (దివ్యఖుర్ఆన్ 49 :13)***

ఆధునిక గ్లోబలైజేషన్ తర్వాత ప్రపంచంలో, వివిధ జాతులు, తెగలు, సాంస్కృతిక నేపథ్యాల నుంచి వచ్చే ముస్లిముల మధ్య చాలా వైవిధ్యాన్ని చాలా మంది గమనించి ఉంటారు. ముస్లిం ప్రపంచంలో సాంస్కృతిక వైవిధ్యాన్ని అర్థం చేసుకోవాలంటే ఏది సంస్కృతి? ఏది మతం? అనేది గుర్తించడం చాలా అవసరం. మతానికి, సంస్కృతికి మధ్య సంబంధాన్ని సరిగా అవగాహన చేసుకోవాలి.

ప్రపంచంలోని వివిధ సంస్కృతుల్లో ఇస్లాం రూపురేఖల్లో చాలా వైవిధ్యం ఉంది. ఇందులో ఆశ్చర్యపోవలసిన అవసరం ఏదీ లేదు. ఇస్లాం విశ్వజనీనమైన ధర్మం. ప్రపంచంలోని ప్రతి మూలలోను ముస్లిములు ఉన్నారు. అందువల్ల సాంస్కృతిక వైవిధ్యం కూడా అదే స్థాయిలో ఉంది. ఈ వైవిధ్యం ఇస్లామీయ విశ్వాసాల చట్రంలోనే ఉంటుంది. అంటే, ఏ ప్రాంతంలో అయినా, ఏ సంస్కృతిలో అయినా, ఇస్లాం మౌలికవిశ్వాసాలు, మతవిశ్వాసానికి ఆవశ్యకమైన విషయాలు, వ్యక్తిగత ఆచరణలు, ఇవి ముస్లిములందరిలోను ఒకేవిధంగా ఉంటాయి.

ఉదాహరణకు, ముస్లిములందరు ఒకే దేవుడిని విశ్వసిస్తారు. ముస్లిములందరూ దైవదూతలను విశ్వసిస్తారు. ముస్లిములందరు దివ్యఖుర్ఆన్ పఠిస్తారు, అర్థం చేసుకుంటారు, ఆలోచిస్తారు. ముస్లిములంతా ప్రవక్త ముహమ్మద్ (స)ను విశ్వసిస్తారు. ఆయన్ను అనుసరిస్తారు. మరణానంతర జీవితాన్ని నమ్ముతారు, తీర్పుదినం రోజున దైవం ముందు జవాబివ్వాలని విశ్వసిస్తారు. దైవిక నిర్ణయాలను, విధిని నమ్ముతారు. ఇస్లాంలోని ఐదు మూలస్తంభాలు ప్రపంచంలోని ముస్లిములందరికీ ఒక్కటే. ఒమ్మాన్ లో అయినా, ఇండోనేషియాలో అయినా, సెనెగల్‌లో అయినా, చైనాలో అయినా ప్రార్థనకు పిలుపు, అజాన్ ఒక్కటే. రమజాను మాసంలో ప్రపంచవ్యాప్తంగా ముస్లిములంతా ఉపవాసాలుంటారు. హజ్ యాత్ర సందర్భంగా మక్కాకు అందరూ వస్తారు. అందువల్ల ఇస్లాంలో సాంస్కృతిక వైరుధ్యం పరిధిలోనే మౌలిక విశ్వాసాలు, ఆచరణలకు సంబంధించి బలమైన సమైక్యత ఉంది.

సంస్కృతిలేని శూన్యంలో మతం కూడా ఉండదు. మతం ఎల్లప్పుడు సాంస్కృతిక వేదికపైనే వ్యక్తమవుతుంది. సంస్కృతులు నైతిక ప్రమాణాలు, ధార్మిక బోధనలకు అతీతంగా వికసించడం జరగదు. మెజారిటీ ప్రజల నైతిక ప్రమాణాలు, ధార్మిక ఆచరణలు ఇందులో చేరి ఉంటాయి. కాబట్టి “సంస్కృతి అది ఏదైనా గాని మతరహితం కాదు. అలాగే సంస్కృతి లేని మతం కూడా ఉండదు.”[40]. ముస్లిములకు, ముస్లిమేతరులకు కూడా ఎక్కడైనా, ఎప్పుడైనా పెద్ద సవాలు ఏమిటంటే, అన్నికాలాలకు వర్తించే, విశ్వజనీనమైన ఇస్లాం బోధనలను వివిధ సంస్కృతుల్లోని పొరల్లో వేరుగా గుర్తించడం. ప్రవక్త ముహమ్మద్ (స) కూడా ఈ సమస్యను గుర్తించారు. దివ్యఖుర్ఆన్, సున్నతుల్లో లేని సమస్యలు ముస్లిములు భవిష్యత్తులో ఎదుర్కోవచ్చని ఆయన అంచనా వేశారు. కొత్త సాంస్కృతిక, న్యాయపరమైన పరిస్థితులు ఎదురుకావచ్చు. అలాంటి సందర్భాల్లో లోతయిన విశ్లేషణ అవసరమవుతుంది. ప్రవక్త ముహమ్మద్ (స) కాలంలో ఎదురైన సమస్యలకు భిన్నమైన కొత్త సమస్యలు ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో తలెత్తవచ్చు, కాబట్టి కొత్త సాంస్కృతిక నేపథ్యాల్లో తలెత్తే కొత్త పరిస్థితులను విశ్లేషించి తగిన విధంగా ప్రతిస్పందించడం ముస్లిములు శతాబ్దాలుగా ఆచరిస్తూ వస్తున్నారు.

పరిశీలకులు, ముఖ్యంగా పాశ్చాత్య పరిశీలకులు ముస్లిం సమాజాల పరిశీలనలో రెండు వైఖరులు మాత్రమే ప్రదర్శిస్తున్నారు. మొదటి వైఖరి ఏమిటంటే, ముస్లిములంతా ఏకశిలాసదృశమైన ఏకదైవారాధక సముదాయంగా చూడడం. ముస్లిములు ఎక్కడున్నా, భౌగోళికంగా ఏ ప్రాంతంలో ఉన్నా, ఏ కాలం వారయినా గాని అంతా ఒకేలా ఉంటారని భావించడం [41]. ఆధునిక ముస్లిం ప్రపంచంలోని సాంస్కృతిక వైవిధ్యాన్ని ఈ వైఖరి

విస్మరిస్తుంది. రెండవ వైఖరి ఏమిటంటే, ఇది మొదటి వైఖరికి పూర్తి విరుద్ధమైనది. ఇస్లాంను ధార్మిక గ్రంథాల నుంచి వేరు చేసి కేవలం ముస్లిముల ఆచరణలను మాత్రమే పరిగణనలోకి తీసుకోవడం. ముస్లిముల్లో చాలా వైవిధ్యాలున్నాయి. అందువల్ల చాలా ఇస్లాములు కనబడతాయి. ఉదాహరణకు టర్కీ ఇస్లాము, లెబనీస్ ఇస్లామ్, ఒమ్మానీ ఇస్లామ్, ఇండోనేషియన్ ఇస్లామ్ వగైరా. ఈ వైఖరి వల్ల ఇస్లాం ఒకటి కాదని, అనేక ఇస్లాములున్నాయని తీర్మానించేస్తారు [42]. అంటే సాంస్కృతిక వైవిధ్యాన్ని సాగదీసి ఇస్లామును జాతీయ గుర్తింపుల స్థాయికి తీసుకురావడం జరుగుతుంది. ఈ రెండు వైఖరులు సరయినవి కాదు. స్థలకాలాల పరంగా ఇస్లాం గురించి మాట్లాడాలి. ఇస్లాం ఒక మతంగా దివ్యఖుర్ఆన్, హదీసు గ్రంథాల్లో భద్రంగా ఉంది. హదీసు గ్రంథాల్లో ప్రవక్త ఆచరణలు ఉన్నాయి. ఈ గ్రంథరూపంలో ఉన్న ఇస్లాం మారదు. కాని ముస్లిములు ఒక శూన్యంలో నివసించడం లేదు. ఒక నిర్దిష్టకాలంలో, నిర్దిష్ట ప్రదేశంలో నివసించేవారు, నిర్దిష్ట భౌగోళిక ప్రాంతంలోని పరిస్థితులు, నిర్దిష్ట కాలానికి సంబంధించిన సవాళ్ళు ఎదుర్కొంటారు. ఈ క్రమంలో దివ్యఖుర్ఆన్, సున్నతుల నుంచి మార్గదర్శనం పొందుతారు. ఈ విధంగా నిర్దిష్ట స్థలకాలాల పరిస్థితుల్లో ధార్మిక గ్రంథాలకు అనుగుణంగా ఇస్లామీయ జీవనశైలి ఉంటుంది. మార్పులు లేని ధార్మిక గ్రంథాలకు మారిన పరిస్థితులకు అనుగుణంగా అర్థం చేసుకుని, భాష్యం చెప్పుకుని ఆచరించడం జరుగుతుంది[43].

వ్యక్తిగత స్థాయిలో ముస్లిం ఇస్లామీయ జీవితం, ఇస్లామీయ బోధనలకు సంబంధించి అతని అవగాహనపై ఆధారపడి ఉంటుంది. ఇస్లామీయ బోధనల అవగాహన స్థాయి, వాటి ఆచరణ జీవితంలో ప్రతిఫలించేలా చేయడం, వాటిని ఆచరిస్తున్న స్థాయి వీటన్నింటిపై ముస్లిం గడిపే ఇస్లామీయ జీవితం ఆధారపడి ఉంటుంది. అదేవిధంగా ఒక సమాజంలో ఇస్లామీయ జీవితం గురించి చెప్పాలంటే, స్థలకాలాల ప్రభావాలను పరిగణనలోకి తీసుకోవాలి. కాబట్టి ముస్లిములు ఏకశిలాసదృశమైన సముదాయం కాదు. అలాగే ప్రపంచంలో అనేక ఇస్లాములు కూడా లేవు. వ్యక్తిగతంగా ముస్లిముల ఇస్లామీయ జీవితం, వివిధ సమాజాల ఇస్లామీయ జీవితాలు వీటన్నింటిలోను వైవిధ్యం ఉంది. ఇవి అనివార్యమైన వైవిధ్యాలు. ముస్లిం ప్రపంచంలో కనబడే వైవిధ్యానికి ఇవి కారణాలు. ఈ వైవిధ్యం నిజానికి, వివిధ సాంస్కృతిక నేపథ్యాల్లో ఇస్లాం సమ్మిళితమయ్యే లక్షణానికి నిదర్శనాలు. ఇస్లాం మౌలిక విశ్వాసాలు, నియమాలను కాపాడుకుంటూ వివిధ

సంస్కృతుల్లో సమ్మిళితమయ్యింది. ఈ సమతుల్యాన్ని ముస్లిములు దైవిక కారుణ్యానికి నిదర్శనంగా భావిస్తారు. ఇస్లాం సంస్కృతులకు అనుకూలమైన మతం. సంస్కృతిని మరింత మెరుగుపరచడానికి ఇస్లాం ఎల్లప్పుడు ప్రయత్నిస్తుంది. దురదృష్టవశాత్తు కొందరు ముస్లిములు తమ ఇస్లామీయ మూలాలను, సంస్కృతితో జతపరచడంలో విఫలమవుతున్నారు. దీనికి కారణం అజ్ఞానం, లేదా చారిత్రక అవగాహన లేకపోవడం. ఇలా జరిగినప్పుడు, ఇస్లామీయ విలువలకు, విశ్వాసాలకు విరుద్ధమైన సాంస్కృతిక ఆచరణలు చోటు చేసుకోవడం మాత్రమే కాదు, ఇదే ఇస్లాం అనే అభిప్రాయం కలుగజేసే ప్రమాదం ఉంది[44]. కొన్ని ముస్లిం సమాజాల్లో ఇలాంటి విపరీతమైన సాంస్కృతిక ఆచరణలు చోటు చేసుకున్నాయి. ఈ ఆచరణలను ఇస్లాంతో పొరబాటున ముడిపెట్టడం జరిగింది. ఇవి ఇస్లామీయ బోధనల్లో భాగంగా పొరబాటున జతచేయడం జరిగింది. ఈ దుస్సంప్రదాయాల్లో బలవంతపు వివాహాలు, బాల్యవివాహాలు, పరువు హత్యలు, పురుషసంతానానికి ప్రాధాన్యం ఇవ్వడం, స్త్రీల లైంగికావయవాలను ఛేదించడం (Female Genital Mutilation) వంటివి ఉన్నాయి. ఇవన్నీ ఇస్లాం విరుద్ధ ఆచారాలు. అయినప్పటికీ ఇవన్నీ నేడు ఇస్లాం పేరుతో ఇస్లాం పట్ల అపోహలు, అపార్థాలు పెంచడానికి కారణమవుతున్నాయి.



థాయ్ లాండ్ లోని నిఖాన్ శ్రీథమ్మారత్ లో ఒక మస్జిదులోని స్టడీ సర్కిలులో దివ్యఖుర్ఆన్ చదువుతున్న ముస్లిం విద్యార్థులు

# మతం ఎందుకు ముఖ్యమైనది?

మతం ఎందుకు ముఖ్యమైనదో చెప్పడానికి ఆరు కారణాలున్నాయి :

1. మన విలువలు, ప్రవర్తన, ఆచరణలు అన్నీ మనం మన అంతరాంతరాల్లో ఏది సత్యమని నమ్ముతామో దానికి అనుగుణంగా ఉంటాయి. ఇది మనం వారసత్వంగా పొందే మన సంస్కృతిపై ఆధారపడి ఉంటుంది. సాంస్కృతిక లక్షణాలు మతం వల్ల ప్రభావితమవుతాయి. అది ఏ మతమైనా సరే సంస్కృతిని ప్రభావితం చేస్తుంది. సాంస్కృతిక ప్రమాణాలు లేకపోతే మన జీవితాల్లో గమ్యరాహిత్యం చోటు చేసుకుంటుంది. అయోమయం చోటు చేసుకుంటుంది. దిశారహితంగా మారిపోతాయి. ఒక శూన్యం, ప్రమాణాలు, విలువలు పతనమయ్యే పరిస్థితి సమాజంలో వస్తుంది. ఆ విధంగా సామాజిక, వ్యక్తిగత అరాచకత్వం చోటు చేసుకుంటుంది. అందువల్ల మతం అనేది చాలా ముఖ్యమైనది. ఎందుకంటే మతం అనేది మన విశ్వాసాలను నిర్వచిస్తుంది. మతవిశ్వాసాలు మన సాంస్కృతిక ప్రమాణాలను, ప్రాపంచిక దృక్పథాన్ని నిర్వచిస్తాయి. అందువల్ల మతం అనేది మనకు సామాజిక, వ్యక్తిగత సమగ్రతకు గ్యారంటీ ఇస్తుంది.

2. మతం మాత్రమే దైవానికి సంబంధించిన జ్ఞానానికి ఏకైక మార్గం. దైవం ఎవరు? దైవం గుణగణాలేమిటి? దైవం స్వభావం ఏమిటి? వంటి ప్రశ్నలకు మతమే జవాబిస్తుంది. అందువల్ల మతం చాలా ముఖ్యమైనది. మతాన్ని కాదంటే, దైవాన్ని కాదనడమే.

3. మనిషికి జ్ఞానపరిధిలో లేని వాస్తవాల గురించి తెలుసుకునే మార్గం మతం మాత్రమే. మనిషి ఆత్మ శాశ్వతమైందన్న విషయాన్ని మతం మాత్రమే చెబుతుంది. మరణానంతర జీవితం, దైవదూతలు మొదలైన విషయాలను మతమే వివరిస్తుంది. అందువల్ల మతం లేకపోతే మనిషి ఈ వాస్తవాలను, మన భౌతిక పరిధికి ఆవల ఉన్న వాస్తవాలను తెలుసుకునే అవకాశం ఉండదు.

4. మతం మనకు జీవిత లక్ష్యం గురించి చెబుతుంది. నేను ఇక్కడ ఎందుకు ఉన్నాను? చివరకు నేను ఎక్కడికి వెళుతున్నాను? జీవితంలో నా నిర్ణయాల పర్యావసానాలు ఎలా ఉంటాయి? చాలా మందికి జీవిత లక్ష్యం గురించి స్పృహ లేకపోవడం వల్ల నిరాశలో కూరుకుపోతున్నారు.

5. మతం జీవనమార్గం. జీవననియమావళి. మానవ గౌరవోన్నతులను కాపాడ్డానికి, భద్రత కల్పించడానికి, సౌహార్ధంతో, ఆనందంగా జీవించడానికి అవసరమైన

పరిస్థితులు సృష్టించాలి. మతం నైతిక ప్రమాణాలను నిర్వచిస్తుంది. మనం జీవించడానికి అవసరమైన నిష్పక్షపాతమైన న్యాయవ్యవస్థను అందిస్తుంది. మతాన్ని విస్మరిస్తే అనేక చెడులు, దోపిళ్ళు, అన్యాయాలు, అణిచివేతలు, దురాశ, వివక్ష, అవినీతి మొదలైన అనేక రుగ్మతల్లో సమాజం కూరుకుపోతుంది. కాబట్టి సామూహిక ప్రయోజనం దృష్ట్యా మతం ఎంతో అవసరం.

6. చివరిగా, మతం చాలా అవసరం, ఎందుకంటే, మన మరణానంతర జీవితానికి ఎలా ఏర్పాట్లు చేసుకోవాలన్నది మతం చెబుతుంది. విభాగం 9లో చెప్పినట్లు, మరణానంతర జీవితం ఒక వాస్తవం. ఈ జీవితంలో మనం తీసుకునే నిర్ణయాలపై, మరణానంతర జీవితంలో మనకేం లభిస్తుందనేది ఆధారపడి ఉంది. మనం ఏం చేయాలో సృష్టికర్త చెప్పిన మాటలు మతంలోనే ఉన్నాయి. మనం ఎలా జీవించాలి, ఇక్కడ మన ఆచరణల పర్యావసానాలు మరణానంతర జీవితంలో ఎలా ఉంటాయన్నది మతం వల్లనే తెలుస్తాయి.

మతం లేని జీవితం, లక్ష్యం లేని జీవితం, మన ఉనికికి సంబంధించిన విస్తృత దృక్పథం లేని జీవితం. భవిష్యత్తులో వచ్చే పరిణామాల గురించిన ఆలోచన లేని జీవితం. దివ్యఖుర్ఆన్ లోని 67 : 6–12 వాక్యాల్లో చెప్పినట్లు మతాన్ని నిర్లక్ష్యం చేయడం వివేకం కాదు :

> ***తమ ప్రభువును తిరస్కరించిన ప్రజలకు నరకశిక్షపడుతుంది : అది చాలా చెడ్డనివాస స్థలం. వారిని అందులోకి విసిరివేసినప్పుడు, వారికి భయంకరమైన దాని గర్జన ధ్వని వినిపిస్తుంది. అది అప్పుడు ఉద్రేకంతోఉడికిపోతూ ఉంటుంది, తీవ్రమైన ఆగ్రహంతో బ్రద్దలవుతూ ఉంటుంది. ఏదైనా ఒక గుంపును అందులో వేసిన ప్రతిసారీ, దాని కాపలాదారులు, "మీ వద్దకు హెచ్చరించేవారు రాలేదా?" అని వారిని అడుగుతారు. దానికి వారు ఇలా జవాబు ఇస్తారు, "వచ్చాడు, హెచ్చరికచేసే అతను మా వద్దకు వచ్చాడు. కాని మేము అతనిని తిరస్కరించాము. అల్లాహ్ దేన్నీ అవతరింపజేయలేదు, నీవు మార్గభ్రష్టుడవైపోయావు అని మేము అతనితో అన్నాము." ఇంకా వారు ఇలా అంటారు, "అయ్యో! మేముగనక (ఆనాడు) విని ఉంటే, లేదా గ్రహించి ఉంటే, ఈనాడు ఇలా మండేనరకాగ్నిశిక్షకు గురిఅయిన వారిలో చేరి ఉండేవారము కాదు కదా!" ఈ విధంగా వారే స్వయంగా తమ తప్పును ఒప్పుకుంటారు. ఈ నరక వాసులు నాశనమైపోను! చూడకుండానే తమ ప్రభువుకు భయపడే వారికి, తప్పకుండా మన్నింపు, గొప్పప్రతిఫలం లభిస్తాయి.***

# ముస్లింగా ఎవరైనా మారడం ఎలా?

ఇస్లాం ఆరు విశ్వాస నియమాలపై (మూలస్తంభాలపై) ఆధారపడి ఉంది. అలాగే ఐదు మత నియమాలపై ఆధారపడి ఉంది. విభాగం 2లో వీటి గురించి చర్చించాము. ఈ నియమాలు, సూత్రాలను అర్థం చేసుకుని ఎవరైనా ఒప్పుకుంటే, క్రింది విశ్వాసవచనాన్ని పలకడం ద్వారా ఎవరైనా ముస్లింగా మారిపోతారు :

అష్హదు అల్లా ఇలాహ
ఇల్లల్లాహు వ అష్ హదు అన్న
ముహమ్మదర్రసూలుల్లాహ్

'అల్లాహ్ తప్ప ఆరాధ్యుడెవరు లేరని,
ముహమ్మద్ (స) అల్లాహ్ సందేశహరులని
నేను సాక్ష్యమిస్తున్నాను' అని పై
విశ్వాసవచనానికి అర్థం.

ఈ వాక్యాన్ని షహాదా ని అరబీలో అంటారు. అంటే విశ్వాసాన్ని ప్రకటించే ప్రతిజ్ఞ, ప్రకటన. ఇది మొదట అరబీలో పలకడం, తర్వాత తన మాతృభాషలో చెప్పడం జరుగుతుంది.

వ్యక్తి ఈ షహాదా ఒకసారి ప్రకటించిన తర్వాత ముస్లిముగా మారిపోతాడు. ఆ తర్వాత విశ్వాసానికి సంబంధించిన నియమాలు, మతానికి సంబంధించిన నియమాలు ఆచరించవలసి ఉంటుంది.

ఒక ముస్లిమేతరుడు ఇస్లాం స్వీకరించిన తర్వాత నిజానికి అతను లేదా ఆమె తన పుట్టుకతో లభించిన మతం వైపు మరలుతాడు. ఎందుకంటే ప్రతి వ్యక్తి పుట్టుకతో ముస్లిం. మనిషి పుట్టినప్పుడు దైవానికి పూర్తిగా విధేయుడైన స్థితిలో జన్మిస్తాడు. అతనిలో అంతర్గతంగా మౌలిక నైతికత అంటే ఫిత్రత్ జాగృతంగా ఉంటుంది. కాని మనిషి పెరుగుతున్నప్పుడు, తల్లిదండ్రులు, సామాజిక వాతావరణం, సంస్కృతి మనిషిని ప్రత్యేకమతస్తునిగా మారుస్తాయి. అందువల్ల ప్రతి మనిషి సత్యాన్ని గుర్తించాలి. ఏది హేతుబద్ధమో దాన్ని అవలంబించాలి. మతం, మతవిశ్వాసాల విషయంలో మనస్సాక్షిని అనుసరించాలి.

# విశ్వాసానికి సంబంధించిన సత్యాలు

1. యాధృచ్ఛికంగా పుట్టుక వల్ల లేదా పూర్వికుల వల్ల లభించిన మతవిశ్వాసాన్ని గుడ్డిగా నమ్మడం విశ్వాసం కాదు.

2. నిజమైన మతవిశ్వాసం జ్ఞానం, హేతువులపై ఆధారపడి ఉండాలి.

3. మనిషి మతవిశ్వాసం బలమైన నిదర్శనాలపై ఆధారపడి ఉండాలి.

గమనిక : ఇస్లాములో మతం, హేతువు ఇవి రెండు ముఖ్యమైనవే. మనిషి తన మతవిశ్వాసాన్ని బలపరచుకోడానికి, తన మత విశ్వాసాన్ని నిరూపించుకోడానికి హేతువు ఉపయోగించాలి.

# పదసూచిక

**అల్లాహ్ :** సృష్టికర్త, విశ్వప్రభువు పేరు (చూడండి విభాగం 3)

**ఆయత్ :** దివ్యఖుర్‌ఆన్ లోని వాక్యం. దైవచిహ్నం అనే అర్థం కూడా ఉంది.

**ఖలీఫా :** ముస్లిం సముదాయానికి నాయకుడు. అరబీలో ఖలీఫా అనే పదానికి అర్థం ప్రతినిధి.

**హదీసు :** *హదీసు, సున్నతులు ప్రవక్త ముహమ్మద్ (స) చెప్పిన మాటలు, చేసిన ఆచరణలు. వీటన్నింటిని కలిపి ప్రవక్త ముహమ్మద్ (స) సంప్రదాయాలుగా పిలుస్తారు (చూడండి విభాగం 8)*

**హజ్ :** ముస్లిములు ఏటా మక్కాకు వెళ్ళే ధార్మిక యాత్ర (చూడండి విభాగం 2)

**హిజ్రత్ :** మక్కా నుంచి ముస్లిములు మదీనా నగరానికి సామాన్యశకం 622లో వలసవెళ్ళిన సంఘటన. ముస్లిముల చంద్రమాన కేలండరు ఈ సంఘటన నుంచి ప్రారంభం అవుతుంది. దీన్ని హిజ్రీ కేలండర్ అంటారు (చూడండి విభాగం 4)

**ఇబాదీ :** ఇస్లాము ధార్మిక పంథాల్లో ఒకటి (చూడండి విభాగం 18)

**ఇస్లాం :** సృష్టికర్త, అల్లాహ్ ఒక్కడే, ఆయన అభీష్టాన్ని పూర్తిగా ఆమోదించి, ఆయనకు విధేయత చూపించాలని బోధించే మతం పేరు.

**జిహాద్ :** అల్లాహ్ కోసం ప్రయత్నించడం. కాబట్టి ఒక విశ్వాసి చేసే ప్రతి పని, అల్లాహ్ ప్రసన్నత కోసం చేసే ప్రతి పని జిహాద్ అవుతుంది. (చూడండి విభాగం 16)

**కాబా :** ఒకే దైవం ఆరాధన కొరకు భూమిపై నిర్మించబడిన మొదటి ఆరాధనాలయం. మక్కాలోని పవిత్ర మస్జిదు ఆవరణలోపల ఇది ఉంది. సాధారణంగా నల్లని వస్త్రం దీనిపై కప్పి ఉంటుంది.

**మదీనా :** సౌదీ అరేబియాలోని ఒక నగరం. మక్కాకు 400 కి.మీ. ఉత్తరాన ఉంది. ఇస్లాంలో రెండవ అతి పవిత్రమైన మస్జిదు ఉన్న నగరం. ఆ మస్జిదు ప్రవక్త మస్జిదు (అరబీలో మస్జదున్నబవీ).

**మక్కా :** సౌదీఅరేబియాలో పశ్చిమభాగంలో ఉన్న నగరం. ఇక్కడే కాబాగృహం ఉంది. ఇస్లాములో అత్యంత పవిత్రమైన మస్జిదు. మస్జిదుల్ హరం అని అరబీలో అంటారు.

**ముస్లిం :** ఇస్లామీయ మత సూత్రాలను విశ్వసించి ఆచరించే వ్యక్తి.

**ఖిబ్లా :** మక్కా నగరం ఉన్న దిశ. ముస్లిములు నమాజు చేస్తున్నప్పుడు ఈ దిశకు తిరిగి నమాజు చేస్తారు.

**ఖుర్ఆన్ :** చిట్టచివరి దైవసందేశం. ప్రవక్త ముహమ్మద్ (స) పై అవతరించింది. (చూడండి విభాగం 6)

**షరీఅత్ :** ఇస్లామీయ ప్రవర్తనా నియమావళి. ఇందులో మౌలిక మతవిశ్వాసాలు, ఆరాధనారీతులు, నైతికనియమాలు, సామాజిక, ఆర్థిక సూత్రాలు, శిక్షాస్మృతి ఉన్నాయి (చూడండి విభాగం 17)

**షియా :** ఇస్లామీయ ధార్మికపంథాల్లో ఒకటి (చూడండి విభాగం 18)

**సున్నీ :** ఇస్లామీయ ధార్మిక పంథాల్లో ఒకటి (చూడండి విభాగం 18)

**సూరా :** దివ్యఖుర్ఆన్ లో అధ్యాయాన్ని సూరా అంటారు.

**ఉమ్మత్ :** ముస్లిం ప్రపంచంలోని యావత్తు ముస్లిం సముదాయాన్ని ఉమ్మత్ అంటారు.

# పాదసూచికలు

1. ప్రవక్తల పేర్లు ఉచ్చరించినప్పుడు ముస్లిములు అల్లాహ్‌ను ఈ విధంగా ప్రార్థిస్తారు, “శాంతి (అల్లాహ్) అనుగ్రహాలు వారిపై కురియుగాక” అని అంటారు. (చూడండి ఖుర్ఆన్ 33:56, 37:181)

2. ఖుర్ఆన్ 2:132, 136, 22:78

3. దివ్యఖుర్ఆన్ లో అనేక చోట్ల విశ్వాసానికి సంబంధించిన నియమాలు చెప్పబడ్డాయి. ఉదాహరణకు 2:3–4, 2:285, 4:136, 54:49,తదితర వాక్యాలు.

4. మన ఆచరణలు ముందస్తుగా అల్లాహ్ నిర్ణయించలేదన్నది దివ్యఖుర్ఆన్ ద్వారా స్పష్టమవుతోంది. ఉదాహరణకు చూడండి 4:62, 10:44, 13:11, 18:29, 30:41 తదితర వాక్యాలు.

5. మతానికి సంబంధించిన నియమాలు దివ్యఖుర్ఆన్‌లో అనేక చోట్ల చెప్పబడ్డాయి. ఉదాహరణకు 2:3, 2:43, 2:183, 2:196, 3:97, 22:78 తదితర వాక్యాలు.

6. తఖ్వా అంటే నైఘంటిక అర్థం భయపడడం, కాపాడుకోవడం. అల్లాహ్ ఆగ్రహం నుంచి తనను తాను కాపాడుకునే ప్రయత్నాలు, అల్లాహ్ గురించి ఎల్లప్పుడు భయపడుతు ఉండడమని ఈ పదానికి భావం. దైవం పట్ల ఎల్లప్పుడు ఈ స్పృహకలిగి ఉండడం వల్లనే ధర్మపరాయణత, సన్మార్గం సాధ్యపడతాయి. అంటే మంచిని పాటించడం, చెడుకు దూరంగా ఉండడం సాధ్యపడుతుంది.

7. దివ్యఖుర్ఆన్ 7:158, 21:107, 33:40, 34:28

8. ఉత్బా బిన్ రాబియా (అబూ సుఫియాన్‌కు మామ) మక్కాలోని ప్రముఖుల్లో ఒకరు. ఉత్బా బిన్ రాబియా ఈ ప్రతిపాదనలు చేశారు.

9. దివ్యఖుర్ఆన్ 29 : 50–51

10. దివ్యఖుర్ఆన్, అనువాదం, వ్యాఖ్యానం ఏ.యూసుఫ్ అలీ, ది ఇస్లామిక్ ఫౌండేషన్, లడన్, 1975, వాక్యాలు 7:157 వ్యాఖ్యానం.

11. దివ్యఖుర్ఆన్ 3:3, 4:47, 5:48, 15:9, 26:192–196, 76:23, ఇతర వాక్యాలు.

12. మనిషికి అల్లాహ్ తోను ఇతర సృష్టితోను ఉన్న సంబంధం దివ్యఖుర్ఆన్‌లో అనేక

చోట్ల ప్రస్తావనకు వచ్చింది. ఉదాహరణకు, 1:2, 2:21–22, 2:257, 7:54, 50:21, 82:10–12, 18:50, 6:112, 12:5, 6:38, 2:164, 31:10, 36:71–73 తదితర వాక్యాలు.

13. దివ్యఖుర్ఆన్ 2:38–39, 2:81–82, 17:9–10 తదితర వాక్యాలు

14. దివ్యఖుర్ఆన్ 3:137, 10:71—73; 11:25—49, 12: 1—113, 17:2–8, 71:1—28 తదితర వాక్యాలు

15. దివ్యఖుర్ఆన్ లో పర్వతాల గురించిన భూగర్భశాస్త్ర ప్రస్తావనలు ఎల్.నాగ్గార్, పేజి.5

16. ఈ విషయం గురించి మరింత అధ్యయనం కోసం చూడండి : (1) డా.జాకిర్ నాయక్ రాసిన ఖుర్ఆన్ అండ్ మోడర్న్ సైన్, (2) మోరిస్ బుకాయిలే రాసిన ది బైబిల్, ది ఖుర్ఆన్ అండ్ సైన్స్(3) కేనర్ తస్లామాన్ రాసిన ది ఖుర్ఆన్: అన్ చాలెంజిబుల్ మిరకిల్, ఎండర్ గురోల్ అనువాదం

17. దివ్య ఖుర్ఆన్ 2:34, 17:61

18. దివ్యఖుర్ఆన్ 14:44–46, 74:8–10, 80:33–46

19. దివ్యఖుర్ఆన్ 13:22–23, 36:55–56, 52:21

20. దివ్యఖుర్ఆన్ 5:48, 16:36, 10:47

21. దివ్యఖుర్ఆన్ 3:64—65; 3:98—100, 4:47 తదితర వాక్యాలు.

22. దివ్యఖుర్ఆన్ 2:75, 2:79, 2:146, 159, 174, 3:71, 4:46, 5:13, 5:15. క్రయిస్తవ నేపథ్యం ఉన్న బైబిల్ మేధావులు కూడా ఈ వాస్తవాన్ని చెప్పారు, ఉదాహరణకు చూడండి (1) 'మిస్ క్వోటింగ్ జీసస్ (2) బర్ట్ డి. ఇర్మాన్ రాసిన 'జీసస్ ఇంటరప్టడ్'

23. దివ్యఖుర్ఆన్ 5:48.

24. దివ్యఖుర్ఆన్ 11:118–119

25. దివ్యఖుర్ఆన్ 3:59, 4:171, 5:75, 5:116–117, 19:30

26. ది బైబిల్ (కే.జే.వి), మాథ్యు 24:36, జాన్ 5:30, 14:28, 17:3, 20:17, యాక్ట్స్ 2:22. ఈ విషయమై మరింత అధ్యయనానికి క్రింది వెబ్ సైట్ చూడండి. http://www.islam-guide.com/ch3-10-1.htm. ఇంకా అధ్యయనానికి డా.లారెన్స్ బ్రౌన్ రాసిన 'ది ఫస్ట్ అండ్ ఫైనల్ టెస్టామెంట్' చూడండి.

27. దివ్యఖుర్ఆన్ 3:45, 4:171, 5:72, 19:30

28. దివ్యఖుర్ఆన్ 19:27–33, దివ్యఖుర్ఆన్ 3:49; 5:110.

29. దివ్యఖుర్ఆన్ 5:110, 57:27.

30. ఏసు (ఆయనపై శాంతి కురియుగాక) 'ఇస్రాయీల్ సంతతి' వారి వద్దకు పంపబడ్డారని బైబిల్ వర్ణనల్నీ ధృవీకరిస్తున్నాయి. ఉదాహరణకు చూడండి, ది బైబిల్ (కేజేవి), మాథ్యు 10:5-6, మాథ్యు 15:22-26

31. శాస్త్రవేత్తలలో నాస్తికత్వాన్ని బలంగా సమర్థించినవారు సర్ అంథోని ఫ్లూ ఒకరు. 2004లో ఆయన దైవాన్ని విశ్వసిస్తున్నానని ప్రకటించారు. 2007లో ఆయన ఒక పుస్తకం రాశారు – 'దేర్ ఈజ్ గాడ్ : హౌ ది వరల్డ్స్ మోస్ట్ నొటోరియస్ అథీయిస్ట్ ఛేంజెడ్ హిజ్ మైండ్'

32. దివ్యఖుర్ఆన్ 7:172, 30:30

33. దివ్యఖుర్ఆన్ 3:86, 10:9, 13:27, 17:97, 18:17, 48:4, 74:31.

34. దివ్యఖుర్ఆన్ 17:70, 23:115, 29:2, 30:8

35. చరిత్రలో మహిళలు ఎదుర్కున్న అన్యాయాలు క్రింది విధంగా ఉన్నాయి: (1) ఇస్లాంకు పూర్వం అరేబియాలో ఆడశిశువులను సజీవంగా సమాధి చేసేవారు. (2) రోమన్ నాగరికతలో మహిళలను బానిసలుగా చూసేవారు, గ్రీకులు మహిళలను సరుకులుగా భావించేవారు. (3) ఫ్రాన్సులో సామాన్యశకం 587లో ఒక సమావేశం జరిగింది. అసలు మహిళలు మనుషులేనా కాదా అనే అంశంపై జరిగిన సమావేశం ఇది. (4) 1850కి ముందు ఇంగ్లాండులో మహిళలకు పౌరసత్వ హోదా లేదు. 1882 వరకు వారికి వ్యక్తిగత హక్కులనేవి లేవు. (5) చైనాలో నాగరికతలో భార్యలను బానిసలుగా అమ్మేసే అనుమతి ఉండేది. అంతేకాదు, భార్యలను సజీవంగా సమాధి చేసే హక్కు కూడా భర్తకు ఉండేది. (6) మహిళలను మరణం కన్నా, నరకం, విషం, అగ్ని కన్నా భయంకరమైన ఆపదగా హిందువులు ప్రాచీనకాలంలో భావించేవారు.

36. దివ్యఖుర్ఆన్ 2:190, 2:193, 2:217, 4:75, 8:39

37. దివ్యఖుర్ఆన్ 8:67–70. దివ్యఖుర్ఆన్ లోని 8వ, 9వ అధ్యాయాల్లో చాలా భాగం, ఇంకా ఇతర అధ్యాయాల్లోను, యుద్ధపరిస్థితుల గురించి చర్చ ఉంది. యుద్ధవ్యవహారాలు, యుద్ధంలో సంధికి సంబంధించిన నియమాలు, ఆశ్రయం కోరేవారు, యుద్ధసొత్తు నిర్వహణ, యుద్ధఖైదీల పట్ల వ్యవహారశైలి గురించి వివరాలున్నాయి. యుద్ధఖైదీల పట్ల ఎలా వ్యవహరించాలనే చట్టాలు ప్రవేశపెట్టింది ప్రపంచంలో మొదటిసారి ముస్లిములే.

38. బానిసత్వ రద్దుకు సంబంధించిన కాలక్రమాన్ని చూడండి: http://en.wikipedia.org/wiki/Abolition_of_ slavery_timeline

39. దివ్యఖుర్ఆన్ 10:99, 109:1–6 తదితర వాక్యాలు.

40. రిఫరెన్సు 6, పేజి 183

41. రిఫరెన్సు 7, పేజి 4

42. రిఫరెన్సు 7, పేజి 4

43. రిఫరెన్సు 8, పేజి 110–114

44. రిఫరెన్సు 8, పేజి 116–118

# రిఫరెన్సులు

I. దివ్యఖుర్ఆన్, అనువాదం, వ్యాఖ్యానం ఏ.యూసుఫ్ అలీ, ది ఇస్లామిక్ ఫౌండేషన్, లండన్ 1975.

II. టువార్డ్స్ అండర్ స్టాండింగ్ ది ఖుర్ఆన్ (తెలుగులో ఖుర్ఆన్ అవగాహనం), సయ్యద్ అబుల్ ఆలా మౌదూదీ, ది ఇస్లామిక్ ఫౌండేషన్, లండన్, 1992.

III. ఖుర్ఆన్ అండ్ మోడర్న్ సైన్సెస్: కాన్ ఫ్లిక్ట్ ఆర్ కాన్ సిలియేషన్?, డా. జాకిర్ నాయక్ (2008), ఇస్లామిక్ రిసెర్చ్ ఫౌండేషన్, ముంబయి, ఇండియా.

IV. ఉలూముల్ ఖుర్ఆన్, యాన్ ఇంట్రోడక్షన్ ఆఫ్ ది ఖుర్ఆన్, అహ్మద్ వాన్ డెన్ఫర్, ధి ఇస్లామిక్ ఫౌండేషన్, లండన్, 1983

V. ముహమ్మద్ ఇన్ హిందూ స్క్రిప్చర్స్, డా. వేద్ ప్రకాష్ ఉపాధ్యాయ్, ఏ.యస్.నూర్దీన్ ప్రచురణ, మలేషియా, 2007.

VI. తారీక్ రమదాన్, రాడికల్ రిఫార్మ్: ఇస్లామిక్ ఎథిక్స్ అండ్ లిబరేషన్, ఆక్స్ ఫర్డ్ యూనివర్శిటీ ప్రెస్, ఆక్స్ ఫర్డ్, 2009.

VII. క్లింటన్ బెన్నెట్, ముస్లిమ్స్ అండ్ మోడర్నిటీ: యాన్ ఇంట్రోడక్షన్ టు ది ఇష్యూస్ అండ్ డిబేట్స్, కంటిన్యూం, న్యూయార్క్, 2005.

VIII. మెహ్మట్ ఓజ్లాప్, ఇస్లాం బిట్వీన్ ట్రెడిషన్ అండ్ మోడర్నిటి, బార్టన్ బుక్స్, ఆస్ట్రేలియా 2012.



*“అర్రహ్మాన్”, ది ఎంటైర్లీ మెర్సీఫుల్. ఇది అల్లాహ్ గుణనామాల్లో ఒకటి.*

# నోట్స్

تعريف الإسلام باللغة التيلوجو




ఇస్లామ్ ఆరాధన

## అమ్మకానికి కాదు